ఏప్రిల్
2025

228

సంపుటి : 20 సంచిక : 11

వెల రూ. 15/-

# MARXISTU
# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

వామపక్ష ప్రత్యామ్నాయమే శరణ్యం

నయా-ఫాసిజానికి దారులు వేస్తున్న నయా-ఉదారవాదం

భాషా వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం

త్రిభాషా సూత్రంపై నిజాయితీగా చర్చలు జరపాలి

ట్రంప్, మస్క్, డోజ్: అమెరికా కార్పొరేట్ లాబీ కుట్ర

ట్రంప్ సుంకాలు కార్మికవర్గంపై భారాలు

మధ్య యుగాల్లో సాంకేతిక అభివృద్ధి : వృత్తులు, నేత

గ్రీస్‌ను కుదిపేస్తున్న ప్రజాఉద్యమం

ప్రజలను మోసం చేయటానికే 2047 అభివృద్ధి జపం

భారత్‌లో ప్రజా సైన్సు ఉద్యమం ముందున్న సవాళ్లు

అంతర్జాతీయ స్ఫూర్తి శిఖరం డా॥ కోట్నీస్

# అంతర్జాతీయ స్ఫూర్తి శిఖరం డా॥ కోట్నీస్

**పిబి చారి**

గత కొన్ని దశాబ్దాలుగా చైనా అధ్యక్షులు కానీ, ఆ దేశ ఉన్నతాధికారులు లేక దౌత్యాధికారు కానీ భారతదేశంలో పర్యటించినపుడు ఇక్కడ ఒక భారతీయ డాక్టర్ కుటుంబ సభ్యులను కలుసుకోవడం, వాళ్లకు సముచిత సత్కారం చేయటం ఒక సంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. జపాన్ సామ్రాజ్య వాదుల దాడులనుండి తమ విప్లవాన్ని రక్షించుకోడానికి చైనా ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నప్పుడు ఆ విప్లవ ప్రజా సైన్యానికి ప్రాణాలొడ్డి వైద్యం అందించి, అక్కడే మరణించిన ఆ భారతీయ డాక్టర్ సేవలను చైనా ప్రభుత్వం, ప్రజలు నేటికీ మరిచిపోలేదు. ఇటీవలెనే 2023లో ఆ డాక్టర్ స్మారకార్థం ఆయన జన్మస్థలమైన మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నిర్మించబడిన పాఠశాలను చైనా ప్రభుత్వం సుమారు 7 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పునర్నిర్మాణం చేసింది. ఆయన పేరుతో అక్కడ ఒక వైద్య శాల నిర్మాణానికి చర్చలు జరుపుతోంది. చైనా ప్రభుత్వం, ప్రజల ఆదరాభిమానాలకు ఇంతగా పాత్రుడైన ఆ డాక్టర్ పేరు ద్వారకానాథ్ శాంతారామ్ కోట్నీస్. ఆయన విప్లవ కాలంలో చైనా ప్రజలకు సేవ చేయడానికి వెళ్లి 1942లో అక్కడే మరణించాడు. డాక్టర్ కోట్నీస్ చైనా ప్రజలకు నేటికీ ఒక హీరోనే. ఉత్తర చైనాలోని "షిజువా జియాంగ్" అనే పట్టణంలో ఉన్న అమరవీరుల స్మారక వనంలో దక్షిణ ప్రాంతం మొత్తాన్ని డాక్టర్ కోట్నీస్ స్మారకార్థం కేటాయించారు. అక్కడ ఆయనకు పెద్ద విగ్రహం ఏర్పాటు చేశారు. అక్కడున్న మ్యూజియంలో డాక్టర్ కోట్నీస్ రాసుకున్న డైరీలు, ఆయన వాడిన వైద్య పరికరాలు, చైర్మన్ మావో జెడాంగ్ లాంటి ప్రముఖులతో కలిసి ఉన్న ఫోటోలు ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో 100 రోజుల పాటు రోజుకో గొప్ప వ్యక్తిపై వ్యాసాలు ప్రచురించారు. అందులో నాలుగో వ్యాసం డాక్టర్ కోట్నీస్ గురించే కావడం విశేషం. డాక్టర్ కోట్నీస్ గురించి చైనా పాఠ్య పుస్తకాలలో బోలెడన్ని పాఠాలు గత 80 సంవత్సరాలకు పైగా కొనసాగుతూనే ఉన్నాయి.

డాక్టర్ కోట్నీస్ 1910 అక్టోబర్ 10వ తేదీన మహారాష్ట్రలోని సోలాపూర్ లో జన్మించాడు. ఆయన తండ్రి సోలాపూర్ లోని ఒక కాటన్ మిల్లులో గుమస్తా. తల్లి గృహిణి. వారికి గల ఆరుగురు సంతానంలో కోట్నీస్ రెండవ కుమారుడు. ఆయన ప్రాథమిక



విద్యాభ్యాస మంతా సోలాపూర్ లోనే గడిచింది. 1931లో బొంబాయిలోని "జిఎస్ మెడికల్ కాలేజీలో "మెడిసిన్ చదవడానికి చేరాడు. మొదటి సంవత్సరంలో ఉండగానే కాలేజీలో జరిగిన సమ్మెలో పాల్గొని చురుకైన పాత్ర పోషించాడు. ఆ కారణంతో ఆ సంవత్సరం ఆఖరిలో కాలేజీ నుండి పంపించి వేశారు. 1932లో బొంబాయిలోనే "గ్రాంట్ మెడికల్ కాలేజీలో" రెండవ సంవత్సరంలో చేరి 1936 కల్లా మెడిసిన్లో పట్టభద్రుడు అయ్యాడు. అదే మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశాడు. అప్పటికి కోట్నీస్ వయస్సు 28 సంవత్సరాలు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత లండన్ వెళ్లి సర్జరీలో ఉన్నత శిక్షణ కోసం ఎఫ్ఆర్‌సిఎస్ చదవాలని ప్రయత్నం చేశాడు కానీ ఆర్థిక పరిస్థితి అందుకు దోహదపడలేదు.

భారత్, చైనాలు రెండూసామ్రాజ్యవాదుల చెర నుండి విముక్తి కోసం పోరాటాలు చేస్తున్న రోజులవి. 1931 సెప్టెంబర్‌లో చైనాలో భాగంగా ఉన్న "మంచూరియా" ప్రాంతాన్ని జపాన్ సైన్యం ఆక్రమించింది. 1937 జూలై నుండి అధికారికంగా చైనా మీద యుద్ధాన్ని ప్రకటించింది. ఆ యుద్ధం ఎనిమిదేళ్లపాటు 1945 దాకా కొనసాగటమే కాకుండా రెండో ప్రపంచ యుద్ధంలో భాగమయ్యింది. చైనాలో అప్పుడు బూర్జువా రిపబ్లిక్‌కు నాయకత్వం వహిస్తున్న కొమిన్ టాంగ్ పార్టీ, విప్లవ పోరాటం చేస్తున్న చైనా కమ్యూనిస్టు పార్టీలు రెండూ ఐక్యసంఘటన ఏర్పాటు చేసి జపాన్‌పై ఉమ్మడిగా పోరాడ్డం ప్రారంభించాయి.

1938 వచ్చేసరికి చైనాలోని చాలా నగరాలను జపాన్ ఆక్రమించి ఇంకా లోపల ప్రాంతాలకు కూడా చొచ్చుకొని వచ్చింది. ఆసియా ఖండంలోని చాలా దేశాలు జపాన్ ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ చైనాకు మద్దతు ప్రకటించాయి. భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటన్ ప్రభుత్వం మాత్రం జపాన్‌కు మద్దతు ఇచ్చింది. ఇది భారతదేశంలోని దేశభక్తుల్లో తీవ్రమైన నిరసనకు దారితీసింది. జాతీయ ఉద్యమాన్ని నడుపుతున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకులు బహిరంగంగానే చైనా చేస్తున్న జపాన్ వ్యతిరేక పోరాటానికి మద్దతు ప్రకటించారు. చైనాకు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా ముందుంటామని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రకటించారు. ఆ సమయంలో చైనా యుద్ధ క్షేత్రంలోని ఎనిమిదవ రూట్ ఆర్మీ బెటాలియన్‌కు చెందిన "జనరల్ ఛూటే"నుండి నెహ్రూకు ఒక ఉత్తరం వచ్చింది. "ఇప్పటికే మా దేశం చైనా జపాన్ దురాక్రమణను ఎదుర్కోవటానికి చేస్తున్న పోరాటం గురించి మీకు తెలిసే ఉంటుంది. ఇది మా ఒక్కరి పోరాటమే కాదు ఇది ఆసియాలోని మిగతా దేశాల తరఫున కూడా మేము పోరాడుతున్నాము. ఈ క్లిష్ట సమయంలో ఈ చలికాలంలో సైనికులకు మందులు, శస్త్ర చికిత్స పరికరాలు, ముఖ్యంగా శిక్షణ పొందిన వైద్యులు అవసరం. పంపగలరని అభ్యర్థిస్తున్నాన" అని ఆ ఉత్తరం సారాంశం. ఈ ఉత్తరం అందుకున్న జవహర్లాల్ నెహ్రూ 1938 జనవరి 9వ తేదీన "చైనా సౌభ్రాతృత్వ దినంగా" పాటించాలని పిలుపునిచ్చారు. దేశమంతటా చైనాకు మద్దతుగా విరాళాలు సేకరించారు. చైనాకు సహాయ సహకారాలు అందించ డానికి ఆనాటి కాంగ్రెస్ అధ్యక్షుడైన సుభాష్ చంద్రబోస్ అన్ని ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైనారు.

(మిగతా 33వ పేజీలో)

# ఈ సంచికలో...

1. అంతర్జాతీయ స్ఫూర్తి శిఖరం డా॥ కోట్నీస్
పిబి చారి..........2
2. వామపక్ష ప్రత్యామ్నాయమే శరణ్యం
కెఎం శ్రీమాలి.....4
3. నయా-ఫాసిజానికి దారులు వేస్తున్న నయా-ఉదారవాదం
ప్రభాత్ పట్నాయక్ ........7
4. భాషా వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం
మణిశంకర్ అయ్యర్...... 10
5. త్రిభాషా సూత్రంపై నిజాయితీగా చర్చలు జరపాలి
అపూర్వానంద...... 11
6. ట్రంప్, మస్క్, డోజ్ : అమెరికా కార్పొరేట్ లాబీ కుట్ర
వివేక్ కట్జు........14
7. ట్రంప్ సుంకాలు కార్మికవర్గంపై భారాలు
జెస్సికా కోర్బెట్........16
8. మధ్య యుగాల్లో సాంకేతిక అభివృద్ధి : వృత్తులు, నేత
ఎంవిఎస్ శర్మ........ 19
9. గ్రీస్‌ను కుదిపేస్తున్న ప్రజాఉద్యమం
ఎస్ వెంకట్రావు........22
10. పజలను మోసం చేయటానికే 2047 అభివృద్ధి జపం
ఎ కోటిరెడ్డి..... ....25
11. భారత్‌లో ప్రజా సైన్సు ఉద్యమం ముందున్న సవాళ్లు
రఘునందన్.......28

సంపాదకుడు :
ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం :
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# సమన్యాయం కోసం..

**బు**ద్ధిగా పాఠాలు చదివి మంచిగా పరీక్షలు రాసే విద్యార్థికి సున్నా మార్కులు వేసినట్లు తయారైంది మన దేశంలో నియోజకవర్గాల పుర్విభజన వ్యవహారం. భారత ప్రభుత్వ జనాభా నియంత్రణ విధానాన్ని క్రమశిక్షణతో అమలు పరచడం, అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుండడం తమకు శాపంగా మారిందని, అభివృద్ధి కాముకంగా ఉన్నందుకు నియోజకవర్గాల పునర్విభజనలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న ఆందోళన అన్ని విధాలా సరైందే. కేంద్ర ప్రభుత్వం ముందు దక్షిణాది వాణిని బలంగా వినిపించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చొరవ తీసుకుని మార్చి 22న దక్షిణాది రాష్ట్రాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

భారత దేశంలో ప్రతి పదేళ్లకొకసారి జనాభా లెక్కలు నిర్వహించిన ప్రతిసారీ నియోజక వర్గాల పునర్విభజన చేయాల్సి ఉంటుందని రాజ్యాంగం నిర్దేశించింది. దీనికోసం నియమించబడే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్, జనాభా ప్రాతిపదికన అటు పార్లమెంటు స్థానాలు, ఇటు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు ఎన్ని ఉండాలో, వాటి సరిహద్దులు ఎలా ఉండాలో నిర్ణయిస్తుంది. అయితే 1976 ఎమర్జెన్సీ కాలంలోనూ, తరువాత వాజ్‌పేయీ హయాంలో 2001లోనూ రాజ్యాంగానికి చేసిన సవరణల వల్ల 1981, 91, 2001 జనాభా లెక్కల తరువాత నియోజకవర్గాల పునర్విభజన కమిషన్లను నియమించలేదు. అందువల్ల ఇప్పటివరకు ఆ ప్రక్రియ ఆగిపోయింది. అయితే 2026తో ఈ నిలిపివేత గడువు తీరిపోతుంది.

నియోజక వర్గాల పునర్విభజన సమస్యను అన్ని రాష్ట్రాలతో సంప్రదించి పరిష్కరించాల్సి కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల్లో భయ సందేహాలకు తావిచ్చే విధంగా జనాభా ప్రాతిపదికగా నియోజక వర్గాల పునర్విభజన అంటూ ప్రకటనలు చేయడం ప్రారంభించింది. దాంతో దేశంలో ప్రాంతాల మధ్య అగ్గి రాజేసే మరో విభజన అంశం రంగం మీదకు వచ్చింది. నిజానికి ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం జనాభా లెక్కలనే ప్రజల ముందు ఉంచలేదు. ఆ లెక్కలను వెల్లడిస్తే బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న అనేక దుష్ప్రచారాల లోగుట్టు ప్రజలకు తెలుస్తుంది. దేశంలో ముస్లిం జనాభా విపరీతంగా పెరిగిపోతున్నదని సంఘ్ పరివారం చేస్తున్న ప్రచారంలోని బండారం బయట పడుతుంది. దాని అభివృద్ధి లెక్కల మర్మం ప్రజలకు అర్ధమవుతుంది. అందుకని ప్రతిపక్షాలు ఎంతగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం జనాభాలెక్కల వివరాలు వెల్లడించ నిరాకరిస్తున్నది.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన అంటూ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకూ, బెంగాల్, పంజాబ్ వంటి రాష్ట్రాలకూ తీరని అన్యాయం జరుగుతుంది. ఎందుకంటే ఈ రాష్ట్రాలు జనాభా నియంత్రణను ఖచ్చితంగా పాటించాయి. అందువల్ల వాటి జనాభా తగ్గింది. జనాభా నియంత్రణ పెద్దగా పాటించని ఉత్తరాది రాష్ట్రాల జనసంఖ్య బాగా పెరిగింది. అందువల్ల జనాభా ప్రాతిపదికగా నియోజకవర్గాల పునర్విభజన నిర్వహిస్తే ఉత్తరాది రాష్ట్రాల లోక్‌సభ నియోజవర్గాల సంఖ్య పెరిగి దక్షిణాది రాష్ట్రాల సంఖ్య తగ్గుతుంది. దీనికి తోడు దక్షిణాది రాష్ట్రాలు గత కొన్ని దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధిలోనూ, విద్య విషయంలోనూ ముందున్నాయి. ఎక్కడైతే ఆర్థికాభివృద్ధి జరిగి, మహిళలు విద్యావంతులవుతారో అక్కడ జననాల రేటు తగ్గుతుంది. ఇది ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న విషయం. ఆర్థికాభివృద్ధిలో ముందుపీఠిన నడిచినందుకు కూడా పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలను శిక్షించినట్లవుతుంది.

అందువల్ల తమకు అన్యాయం చేయరాదనీ, పునర్విభజనలో న్యాయం జరిగేట్లు చూడాలని దక్షిణాది రాష్ట్రాలు కోరడం సరైందే. పుర్విభజనను మరో 25 ఏళ్లు వాయిదా వేయాలి లేకుంటే 1981 జనాభా లెక్కలకు పూర్వం ఉన్న జనాభా ప్రకారం పునర్విభజన జరగాలని, తమకు అన్యాయం జరక్కుండా నిర్దిష్టంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. జనాభా ప్రాతిపదికగా కాకుండా ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఉన్న నియోజకవర్గాల సంఖ్య ప్రాతిపదికగా సీట్లను పెంచితే ఎవరికీ అన్యాయం జరగదని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు తమిళనాడులో 39 స్థానాలు, ఉత్తర ప్రదేశ్‌లో 80 స్థానాలు ఉన్నాయి. దేశంలో పెరిగిన జనాభా ఆధారంగా 10 శాతం స్థానాలు పెంచితే అప్పుడు తమిషనాడుకు 43 స్థానాలు, ఉత్తర ప్రదేశ్‌కు 88 స్థానాలు అవుతాయి. 20 శాతం పెంచితే తమిళనాడుకు 47, యుపికి 96 స్థానాలవుతాయి. సమన్యాయం జరుగుతుంది. అలా కాకుండా జనాభాను ప్రాదిపదికగా తీసుకుని నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం ముందుకెళితే ప్రాంతీయ విభేధాలు తీవ్రమై దేశ సమైక్యత ప్రమాదంలో పడుతుంది.

ఈ మాసం ముఖ్యాంశం

# వామపక్ష ప్రత్యామ్నాయమే శరణ్యం



రచయిత ఢిల్లీ యూనివర్శిటీ చరిత్ర విభాగంలో మాజీ ప్రొఫెసర్

ప్రొ॥ కెఎం శ్రీమాలి

**1980** దశకం చివరిలో భారత దేశం నయా–ఉదారవాద విధానాలు చేపట్టడం, అదే సమయంలో రామ జన్మభూమి విముక్తి కోసం ఉద్యమం తలెత్తడం (నేను దీన్ని సమాజాన్ని మతతత్వం గావించడం అంటాను).. రెండూ ఒకే సారి జరగడం కేవలం యాధృచ్ఛికం కాదు. రాజీవ్ గాంధీ ఈ రెంటికీ ప్రోత్సాహం ఇచ్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలు – షాబానో కేసులో సుప్రీం కోర్టు తీర్పును తిరగదోడడం, బాబ్రీమసీదు తాళాలు పగలగొట్టి అయోధ్య లోని వివాదాస్పద స్థలంలో రామ మందిర నిర్మాణానికి శిలాన్యాస్‌కు అనుమతివ్వడం పెద్ద తప్పిదాలు. ఈ తప్పిదాలకు గాను కాంగ్రెస్ పార్టీ నేటికీ మూల్యం చెల్లిస్తూ ఉంది. దీనికి తోడు ఇదే కాలంలో అస్తిత్వ రాజకీయాలు ముఖ్యంగా కుల అస్తిత్వం (మండలైజేషన్) కూడా ముందుకు వచ్చింది. ఈ విషయంలో కూడా రాజీవ్ గాంధీ సందిగ్ధత ప్రదర్శించారు. ఇది కూడా కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం కలిగించింది, ముఖ్యంగా ఉత్తరాది హిందీ ప్రాంతాల్లో.

ఈ శక్తులన్నిటినీ భారతీయ జనతా పార్టీ తెలివిగా ఉపయోగించుకుని లాభపడింది. దాంతో 1990 దశకం చివర మరీ ముఖ్యంగా 2002 గుజరాత్ అల్లర్లతరువాత దాని బలం బాగా పెరిగింది. అది తన పూర్వ అవతారం అయిన జనసంఘ్ దగ్గరినుండీ బహిరంగ మార్కెట్ ఆర్థిక వ్యవస్థను, పెట్టుబడిదారీ విధానాన్నీ సమర్థిస్తోంది.

బిజెపి హిందుత్వ అస్తిత్వ రాజకీయాలను అనుసరిస్తున్న విషయం రహస్యవిషయమేమీ కాదు. అది ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లకూ వ్యతిరేకంగా ఉన్నప్పటికీ కులం కార్డును చాలా వ్యూహాత్మంగా ఉపయోగించుకుంది.

గత వంద సంవత్సరాల చరిత్రను, ముఖ్యంగా 20వ శతాబ్దం తొలినాళ్ల నుండి జరిగిన చరిత్రను గనక పరిశీలిస్తే..ఆర్థిక సంక్షోభం లేక మాంద్యం ఎప్పుడు వచ్చినా ప్రపంచ రాజకీయాలు (ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాల్లో) మితవాదం వైపు మొగ్గు చూపాయి. 1930వ దశకంలో వచ్చిన మహా మాంద్యం (ఇది 1929 అక్టోబర్ స్టాక్ మార్కెట్ పతనంతో ప్రారంభమైంది) యూరప్‌లోనూ ఇతర చోట్లా ఫాసిజం తలెత్తడానికి దారితీసింది.

అదే విధంగా 2007–08 ద్రవ్య సంక్షోభం ప్రపంచ వ్యాపితంగా రాజకీయాలు మితవాదం వైపు మొగ్గడానికి కారణమైంది. టైమ్ పత్రిక భారత ప్రధాని నరేంద్ర మోడీని "భారత దేశ విచ్ఛిన్న సేనాని" అని (2019, మే 20) కథనాన్ని ప్రచురించింది. ఎందుకంటే ఆయన "దేశభక్తులు, దేశవ్యతిరేకులు" అన్న విచ్ఛిన్నకర నినాదంతో భారత దేశ సామాజిక జీవనాన్ని మత ప్రాతిపదికగా మధ్యకంటా నిలువునా చీల్చేశారు. కానీ మన్మోహన్ సింగ్ 15 ఏళ్ల కాలంలో (పివి నరసింహారావు కింద ఆర్థిక మంత్రిగా అయిదేళ్లు, దేశ ప్రధాన మంత్రిగా పదేళ్లు) దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిన తీరును గమనిస్తే ఆయన కూడా భారత ప్రజలను నిలువునా చీల్చిన వ్యక్తిగానే చరిత్రలో నిలిచిపోతారు.

ఆయన అనుసరించిన ఆర్థిక సరళీకరణ, కార్పొరైటైజేషన్ విధానాలు దేశంలో ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ (క్రోనీ క్యాపిటలిజం) కు దారితీసింది. ఇదంతా ప్రపంచ బ్యాంకు ఆదేశాల ప్రకారం జరిగింది. ఈ విధానాల వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. భారత– అమెరికా అణు ఒప్పం దాన్ని ఎటువంటి పరిస్థితుల్లో కుదుర్చుకోవాలని ఆయన భీష్మించుకున్నారు. భారతీయ వామపక్షాలు కూడా అంతే పట్టుదలతో సరిగ్గానే దాన్ని వ్యతిరేకించాయి. ఈ ఒప్పందం కుదరక పోతే తాను రాజీనామా చేస్తానని బెదిరించే వరకు మన్మోహన్ సింగ్ వెళ్లిన విషయాన్ని మనం ఈ సందర్భంగా గమనించాలి. దేశంలో నయా–ఉదారవాద ఆర్థిక వ్యవస్థ ఏర్పడ్డంతోనే మన దేశ విదేశాంగ విధానాన్ని కూడా అమెరికా–ఇజ్రాయిల్–భారత్ యాక్సిస్‌కు అనుసంధానించడం జరిగింది. ఇస్లామోఫోబియాను పెంచి పోషించడం ఇందులో భాగమే.

**భారత్ ఎదుర్కొంటున్న ప్రమాదాలు**

నా ఉద్దేశంలో భారత దేశం కింది ప్రమాదాలనెదుర్కొంటున్నది:

1. బిజెపి రానురాను మరింత వేగంగా హిందూ రాష్ట్ర సాధన రాజకీయాలవైపు నడవడంతో దేశంలో హిందూ అస్తిత్వ రాజకీయాలు పెరిగాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది తానొక సాంస్కృతిక సంస్థ అనే ముసుగును పూర్తిగా తొలగించిన విషయాన్ని మనం గుర్తించకుండా ఉండలేం. దాని సిద్ధాంతం ఏనాడూ భారత రాజ్యాంగాన్ని గానీ, భారత దేశ పతాకాన్ని గానీ అంగీకరించలేదు. బిజెపి–ఆర్ఎస్ఎస్ చెప్పుకుంటున్న గుజరాత్ ఆర్థిక నమూనా అనే మిధ్య బద్దలైపోయింది. కానీ బిజెపి పాలిస్తున్న అనేక రాష్ట్రాల్లో మాత్రం

గుజరాత్ రాజకీయ నమూనాను అనుసరిస్తున్నారు. 2002 మారణహోమం తరువాత నేను గుజరాత్‌లోని అనేక జిల్లాలు పర్యటించినప్పుడు నాకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు బయట ఒక పెద్ద హోర్డింగ్ కనిపించింది; "భారత దేశపు తొలి హిందూ రాజ్యానికి స్వాగతం" అని.

ఈ సమస్య మీద కాంగ్రెస్ పార్టీలో సాఫ్ట్ హిందూత్వ వల్ల వచ్చిన గజిబిజి ఆలోచనలు అటుంచితే "లౌకిక శక్తుల ఐక్యత" అని గొంతుచించుకుని నినాదాలిచ్చే ప్రాంతీయ శక్తులు కూడా నోటి మాటలు మినహా ఏమీ చేయలేకపోయాయి. ఇటువంటి శక్తుల నాయకులు తమ పడవలు మునిగిపోయే సమయం వచ్చినప్పుడు ఎటువంటి తటపటాయింపులు లేకుండా బిజెపి పడవలోకి దూకేయం నాకేమీ ఆశ్చర్యం అనిపించలేదు. దురదృష్ట వశాత్తు బహుశా కాంగ్రెస్ ప్రభుత్వ ఒత్తిడితో తస్లీమా నస్రీన్‌ను బెంగాల్ నుండి పంపివేయడం ద్వారా వామపక్షాలు కూడా తప్పుచేశాయని నేను అభిప్రాయ పడుతున్నాను. 2019 ఎన్నికల తరువాత మోడీ "లౌకిక వాదలు" పారిపోయి మొహం చాటువేసుకున్నారు అని అన్న మాటలను తేలిగ్గా తీసుకోరాదు. దీని వెనుక పెద్ద ప్రమాదం దాగి వుంది.

" కాంగ్రెస్ పార్టీలో సాఫ్ట్ హిందూత్వ వల్ల వచ్చిన గజిబిజి ఆలోచనలు అటుంచితే "లౌకిక శక్తుల ఐక్యత" అని గొంతుచించుకుని నినాదాలిచ్చేప్రాంతీయ శక్తులు కూడా నోటి మాటలు మినహా ఏమీ చేయలేకపోయాయి. ఇటువంటి శక్తుల నాయకులు తమ పడవలు మునిగిపోయే సమయం వచ్చినప్పుడు ఎటువంటి తటపటాయింపులు లేకుండా బిజెపి పడవలోకి దూకేయం నాకేమీ ఆశ్చర్యం అనిపించలేదు. "




2. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటి నుండీ అమలుపరుస్తూ వచ్చిన నయా-ఉదారవాద ఆర్థిక విధానాలను బిజెపి లేక ఎన్డీఏ ప్రభుత్వాలు (మోడీ, వాజ్‌పేయిలిద్దరి హయాంలోనూ) కొనసాగించడమే కాదు, కాంగ్రెసేతర, ఎన్డీఏ-బిజెపి యేతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తున్నారు.

2007- 2008లో బెంగాల్‌లోని సింగూర్‌లో టాటా నానో కార్ల ఫాక్టరీ, నందిగ్రామ్‌లో రసాయన ఫాక్టరీ పెట్టడం కోసం రైతుల భూములు కొనుగోలు చేయడానికి బుద్ధదేవ్ వామపక్ష ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ఉపయోగించుకుని రైతులకు ఏదో అయిపోతున్నదని మమతా బెనర్జీ భూమ్యాకాశాలను ఏకం చేసేంతంగా గగ్గోలు చేశారు. 1977లో పశ్చిమ బెంగాల్ భూసంస్కరణల (సవరణ) చట్టం ద్వారా రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం 11 లక్షల ఎకరాల భూమిని 14 లక్షల మంది రైతులకు పంచిపెట్టింది. ఈ భూములపై రైతులకు వారసత్వ హక్కులు లభించాయి. 1977 నుండి 30 ఏళ్లపాటు పాలించిన వామపక్ష ప్రభుత్వం ఈ భూసంస్కరణల ద్వారా సంపాదించుకున్న ప్రతిష్టను ఈ ఘటనలతో ఒక్కపెట్టున పోగొట్టుకున్నది. దాంతో పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పతనం ప్రారంభమైంది.

3. కుల అస్తిత్వ రాజకీయాలు ఊపందుకున్నాయి. దేశంలో కుల లేక వర్గ రహిత సమాజాన్ని నిర్మిస్తానని ఎవరైనా ఊహాజనితమైన ఆలోచనలు చేయవచ్చు. 2019 మే ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మోడీ భారత దేశం కుల రాజకీయాలను తిరస్కరించింది, మండలైజేషన్ అంతమైపోయింది అని ప్రకటించడం నాకు నవ్వు పుట్టించింది. ఇంతకన్నా కపటత్వం ఇంకోటి ఉండదు. ఎందుకంటే అమిత్ షా గారి ఎన్నికల వ్యూహం అంతా కూడా దళితులను చీల్చడం, మరోవైపు ఓబిసిలను చూపించి దళితులను భయభ్రాంతులకు గురిచేయడం మీదనే ఆధారపడి ఉంది. ఉత్తరాదిలో దళితులు, ముస్లింలు ఉమ్మడి శక్తిగా ముందుకు రావడం మనం చూస్తాం. వాస్తవమేమంటే, భారత దేశ ఎన్నికల ప్రజాస్వామ్యంలో కులం అనేది ఒక ముఖ్యమైన అంశంగా ఉంటుందనే దాన్ని ఎవరూ నిరాకరించలేరు.

4. బిజెపి లక్ష్యం అయిన "ఒకే ప్రజలు, ఒకే సంస్కృతి, ఒకే దేశం" అనేది "భారత దేశం అనే భావన" వెనుకనున్న భిన్నత్వం, బహుళత్వాలకు తీవ్రమైన ప్రమాదకారి. ఇది రాజ్యాంగంలో పేర్కొన్న ఫెడరల్ వ్యవస్థకు కూడా పెద్ద సవాలు విసురుతుంది.

ఈ బహుముఖ సంక్షోభాల నుండి భారత దేశం ఎలా బయటపడుతుంది? దానికోసం నేను క్రింది భావాలు పంచుకుంటున్నాను:

1. మితవాదంవైపు ఉండే రెండు రాజకీయ పార్టీలకు తావు ఉండకూడదు. కాంగ్రెస్ ఇటీవలి తన అవతారంలో (1980 నుండి) మితవాదానికి బీజాలు వేసిందనీ, లేక బిజెపి అనేది కాంగ్రెస్‌కు కార్బన్ కాపీ అనీ, లేక (తొలిసారి మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు 2014-15లో అరుణ్ శౌరీ అభివర్ణించినట్లు) బిజెపి అంటే కాంగ్రెస్ + ఆవు అనే ప్రకటనలేవీ భారత దేశానికి మేలు చేయవు. కాంగ్రెస్ తిరిగి కోలుకునే అవకాశాలు తక్కువ.

2. ప్రాంతీయ పార్టీల్లో అనేకం ఏదో విధంగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండడమే పరమావధిగా పనిచేస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో మాయావతికి చెందిన బహుజన సమాజ్ పార్టీ, అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్ వాదీ పార్టీ, లేక పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణాలో కె. చంద్రశేఖరరావుకు చెందిన తెలంగాణా రాష్ట్ర సమితి - టిఆర్ఎస్ (నేడు

> "వామపక్షం 1. ఉద్యోగాలు, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి విధానాలు చేపట్టాలి. 2. రైతుల ప్రయోజనాలను కాపాడే దీర్ఘకాలిక విధానాలు అనుసరించాలి 3. వ్యవసాయ, పారిశ్రామిక వస్తూత్పత్తి రంగాల్లో ఉత్పత్తిని పెంచే విధానాలు అవలంభించాలి. 4. వైద్యం, విద్యపైన (విద్యమీద జిడిపిలో 10 కన్నా తక్కువ కాకుండా) ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. ఈ రంగాల్లో ప్రయివేటీకరణ ఆపడం మీద కాకుండా ప్రభుత్వం ఈ రంగాలపై ఖర్చు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి."

బిఆర్ఎస్), ఆంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడుకు చెందిన తెలుగుదేశం పార్టీ, వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఒడిషాలో బిజు జనతా దళ్, బీహార్‌లో నితీష్ కుమార్‌కు చెందిన జనతా దళ్ (యు), లలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన రాష్ట్రీయ జనతా దళ్...లేక ఇంకా ఎక్కడైనా గానీ ఇటువంటి పార్టీలేవీ కూడా సామాన్య ప్రజలకు మేలు చేకూర్చే ప్రత్యామ్నాయ ఆర్థికాభివృద్ధి నమూనాను అందించలేవు. కార్పొరేటైజేషన్, లేక నయా-ఉదారవాద ఆర్థిక ఎజెండాకు వ్యతిరేకంగా నిలబడాలన్న కోర్కె కూడా వీటిలో దేనికీ లేదు. చివరికి లౌకిక భారత దేశాన్ని రక్షించే విషయంలో కూడా ఈ పార్టీలు ముందుకొస్తాయన్న భరోసా లేదు. ఎందుకంటే ఇటీవల జమ్మూ-కాశ్మీర్‌లో 370, 35ఎ అధికరణాలను రద్దు చేసే విషయంలో ఈ పార్టీలు (ఆర్‌జెడి మినహా) వ్యవహరించిన తీరు ఎలా ఉందో మనం చూశాం.

3. స్వాతంత్ర్య వచ్చిన వెంటనే జరిగినట్లు నేడు దేశంలోని రాజకీయ పార్టీలన్నిటితో కలిపి ఒక ''జాతీయ ప్రభుత్వాన్ని'' ఏర్పాటు చేయాలన్న ఊహే వ్యర్థమైనది. భారత దేశంలో నేడు జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ భాయ్ పటేల్ వంటి రాజకీయవేత్తలు లేరు. ఈనాటి రాజకీయ నాయకులు స్వార్థపరులు, నిపుణులు కారు.

4. కాంగ్రెస్, బిజెపిలు రెంటికీ సమ దూరంలో ఉండే "తృతీయ ప్రత్యామ్నాయం" అనేది ప్రతిష్ట కోల్పోయింది.

5. ఆర్థికాభివృద్ధికి సంబంధించిన రెండు స్పష్టమైన ప్రత్యామ్నాయ మార్గాలు కలిగిన రెండు రాజకీయ కూటములవైపు భారత రాజకీయాలు పయనించాలి. ఒకటి, మితవాద మధ్యేవాద కూటమి, రెండోది వామపక్ష మధ్యేవాద కూటమి. పైన చెప్పిన రాజకీయ పరిస్థితులను బట్టి వామపక్షాల నాయకత్వం లోని ప్రత్యామ్నాయం తప్ప నేను మరోటి ఆలోచించలేను. వామపక్షాలు తమ నాగేటి చాలులో తామే దున్నుకోడానికి సిద్ధపడాలి. దీర్ఘకాలిక ఫలాలు ఆశించాలి. (అంతేకాని హ్రస్వదృష్టితో కూడిన తక్షణ ప్రయోజనాలకోసం అవకాశవాద పార్టీల తోనూ, లేక సైద్ధాంతి కంగా మితవాద శక్తులతోనూ పొత్తులు, అవగాహనలకు రాకూడదు). బాధాకరమైన విషయం ఏమిటంటే 80శాతం కన్నా ఎక్కువ మంది ప్రజలు పేదరికంలో నివసిస్తున్న చోట, వ్యవసాయ సంక్షోభం రైతుల ప్రాణాలు తీస్తున్న చోట, నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరిన చోట, వైద్యం విద్య సదుపాయాలు కునారిల్లిపోతున్న చోట, మొత్తం ఆర్థిక వ్యవస్థ బదాబదలైపోయిన చోట...అలాంటి దేశంలో కూడా వామపక్షాల బలం క్రమంగా తగ్గిపోతున్నది.

ప్రస్తుత వామపక్షాలు వ్యక్తుల అహాలను పక్కన బెట్టి ఒకే ఒక గొడుగు కిందకు రావాలి. ఇంకా చెప్పాలంటే కార్మికులు, రైతులు, రాజ్యాంగం మొదలైన అంశాలను ఇముడ్చుకున్న ఒకే పేరు కిందకి రావాలి.

### కనీస ఉమ్మడి కార్యక్రమం

గత కొన్ని దశాబ్దాలుగా వామపక్షాలు ఎన్నికలు ముగిసిన వెంటనే కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) గురించి మాట్లాడ్డం వింటున్నాను. కానీ ఇప్పుడు విడివిడిగా ఉన్న వామపక్ష గ్రూపులన్నీ ఒక చోటకు వచ్చి తమ స్వంత కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించుకుని ప్రజల దగ్గరకు వెళ్లాల్సిన సమయం వచ్చిందని అనుకుంటున్నాను. ఈ కనీస ఉమ్మడి కార్యక్రమంలో వామపక్షాలు ప్రజా రాజకీయాల్లో కుల, మతాల స్థానం పట్ల తమ స్పష్టమైన అభిప్రాయాలు తెలియజేయాలి. సైద్ధాంతికంగా ఈ విషయంలో వామపక్షాల ఆలోచనలు ప్రజల ఆమోదం పొందడం అంత సులువేం కాదు. కేరళలో శమరిమల కేసు విషయంలో సుప్రీం కోర్టు తీర్పుపై వామపక్ష వైఖరిని దేశం నలుమూలలకు తీసుకుపోవాలి. కులం-వర్గం సమస్యపై సామాన్యులకు అర్థమయ్యే విధంగా తమ ఆలోచనలను వివరించ గలగాలి.

సామాన్య ప్రజల ఆర్థికాభివృద్ధికి సంబంధించి తన స్వంత విధానాన్ని వామపక్షం ప్రజల ముందుంచాలి. ప్రస్తుతం సామాజిక, ఆర్థిక విధానాలపై కార్పొరేట్లకున్న పట్టును తొలగించేందుకూ, క్రమంగా కనుమరుగవు తున్న ప్రభుత్వ రంగాన్ని కాపాడేందుకూ తమ వద్ద నున్న వ్యూహం ఏమిటో వామపక్షం ప్రజలకు వివరించాలి. నయా-ఉదారవాద మార్కెట్ ఆర్థికాభివృద్ధి మార్గం నుండి కొత్త మార్గానికి అంటే చిట్టచివరి పేద వాని వరకూ అందరికీ ప్రగతి ఫలాలు అందే విధంగా కార్యక్రమాన్ని రూపొందించాలి.

వామపక్షం 1. ఉద్యోగాలు, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి విధానాలు చేపట్టాలి. 2. రైతుల ప్రయోజనాలను కాపాడే దీర్ఘకాలిక విధానాలు అనుసరించాలి 3. వ్యవసాయ, పారిశ్రామిక వస్తూత్పత్తి రంగాల్లో ఉత్పత్తిని పెంచే విధానాలు అవలంభించాలి. 4. వైద్యం, విద్యపైన (విద్యమీద జిడిపిలో 10 కన్నా తక్కువ కాకుండా) ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. ఈ రంగాల్లో ప్రయివేటీకరణ ఆపడం మీద కాకుండా ప్రభుత్వం ఈ రంగాలపై ఖర్చు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ప్రభుతం ''ప్రయివేటు రంగానికి'' ఫెసిలిటేటర్‌గా ఉండకూడదు.


పెద్ద వైచిత్రి ఏమంటే, అహింసను ప్రబోధించిన బుద్ధ, మహావీర, మహాత్మా గాంధీల భూమి అయిన భారత దేశం ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మారణా యుధాలు దిగుమతి చేసుకుంటోంది. యుద్ధ రహిత ప్రాంతంగా ప్రకటించబడిన జమ్మూ - కాశ్మీర్, లడఖ్ ప్రాంతం ప్రపంచం లోనే అత్యంత సైనికీకరించబడిన ప్రాంతంగా మారింది. సైనిక వ్యవస్థమీద ఖర్చును దశలవారీగా తగ్గించే అవకాశం ఉందా? జాతీయవాద యుద్ధనాదాలకు లోబడిపోవడం చాలా సులువు, కానీ అసలు సమస్య లోతుల్లోకి వెళ్లాలి, ఈ అంశంపై ప్రజల్లో చర్చ ప్రారంభించాలి.

### ప్రజల్లోని దురభిప్రాయాలపై పోరాటం

ప్రజల్లో అజ్ఞానం వల్లనూ, మరీ ముఖ్యంగా మీడియా సృష్టి వల్లనూ ఏర్పడిన దురభిప్రాయాలపై వామపక్షాలు తీవ్రంగా పోరాడాలి. ఒక ఉదాహరణ చెబుతాను: 2004 ఎన్నికల (14వ లోక్‌సభ ఎన్నికలు)

*(మిగతా 9వ పేజీలో)*

# నయా-ఫాసిజానికి దారులు వేస్తున్న నయా-ఉదారవాదం



రచయిత ప్రముఖ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త

ప్రభాత్ పట్నాయక్

నయా–ఫాసిజానికి దారితీస్తున్న ప్రస్తుత పరిణామాలను గురించి ప్రఖ్యాత ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ ఇచ్చిన ఇంటర్వ్యూ ఇది. హ్యూమన్ సైన్సెస్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరైన సుభోరంజన్ దాస్‌గుప్తా ఈ ఇంటర్వ్యూ చేశారు. ఆడమ్ స్మిత్, ఆల్‌ఫ్రెడ్ మార్షల్, జాన్ మేనార్డ్ కీన్స్, అమర్త్యసేన్ తదితర ఆర్థికవేత్తలు చెప్పిన సామాజిక విలువలతో కూడిన మార్కెట్ ఆర్థిక విధానాల స్థానంలో.. రాజకీయ నాయకులు, అత్యంత శక్తివంతులైన గుత్తాధిపతుల ప్రయోజనాలకు అనుగుణంగా "సమాజంతో సంబంధం లేని నయా–ఉదారవాద విధానాల''ను ప్రస్తుత దశలో అమలు చేస్తున్నారు. ఈ విధమైన రాజకీయ–ఆర్థిక విధానాలకు ట్రంప్–మస్క్, మోడి–అదానీ ద్వయాలు ప్రస్తుతం అత్యంత స్పష్టమైన ఉదాహరణలుగా ఉన్నారు. సూత్రరీత్యా, ఆచరణలోనూ ఈ పరిణామాలు సంక్షేమ పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తాయా? స్వేచ్ఛా వాణిజ్యం నుండి గుత్త పెట్టుబడిదారీ విధానం వరకు పెట్టుబడిదారీ విధానంలో చోటు చేసుకున్న పరిణామాలను విశ్లేషిస్తూ ప్రభాత్ పట్నాయక్ ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇంటర్వ్యూ సారాంశాన్ని పాఠకులకు అందిస్తున్నాం...**సంపాదకుడు.**

---

**ప్రస్తుతం పెట్టుబడిదారి దేశాలైన దక్షిణ కొరియా, జపాన్, స్కాండినేవియన్, పశ్చిమ దేశాలలో పెట్టుబడికీ–నయా ఫాసిజానికీ మధ్య ఇటువంటి కూటములు ఎందుకు ఏర్పడటం లేదు? ఈ దేశాల మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో బడా కార్పొరేట్‌లు, మధ్యరకం సంస్థలు, చిన్న పరిశ్రమలు పరస్పరం కలిసి పని చేస్తుండటం ఇందుకు కారణమా?**

గుత్త పెట్టుబడిదారీ దశలో అన్ని దేశాలలోనూ ప్రభుత్వం, గుత్త, ద్రవ్య పెట్టుబడిదారుల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడటం సహజం. జపాన్‌లో జేయ్‌బట్సు (పెట్టుబడిదారి సంస్థల కూటమి), దక్షిణ కొరియాలో చైబొల్స్ (కుటుంబాలు ఆధిపత్యం వహించే బడా పెట్టుబడిదారుల కూటమి)లు ఈ విధంగానే ఆధిపత్యం వహిస్తున్నాయి. ఈ సంబంధాలలో ఫాసిస్టు భావాలు ఆధిపత్యం సంపాదించినపుడు గుత్త పెట్టుబడి, ఫాసిజం ఒక కూటమిగా అభివృద్ధి కావటం మాత్రమే కాక, నూతన తరగతి గుత్త పెట్టుబడి, ఫాసిస్టు పాలకులకు మధ్య ప్రత్యేకంగా సన్నిహితమైన సంబంధాలు అభివృద్ధి అవుతాయి. యుద్ధానికి ముందు జపాన్‌లో ఇదే జరిగింది. నూతనంగా అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారి కూటమి "షింకో జేయ్‌బట్సు" తో జపాన్ మిలిటరి ఫాసిజం అత్యంత సన్నిహితంగా కలిసి పనిచేసింది.

ఇది ఒక దేశ ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. నయా–ఫాసిజం ఆధిపత్య స్థానానికి రావటానికి దారి తీస్తున్న కారణాలకు సంబంధించినది. కానీ నయా–ఫాసిజం ఆధిపత్య స్థానానికి వచ్చిన దేశానికి చెందిన ప్రత్యేకతలు దానిలో మిళితమై ఉంటాయి. దానితో పాటు నయా–ఫాసిజం ఒక దేశంలో అధికారంలోకి రావటం ఆ దేశంలో వర్గాలు రూపుదిద్దుకున్న తీరుపై ఆధారపడి ఉంటుంది. అయితే కాలక్రమంలో వర్గ పొందికలు మారుతూ ఉంటాయి. కాబట్టి మనకు ఎదురౌతున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవటానికి జపాన్, దక్షిణ కొరియా అనుభవాలను తీసుకోవచ్చు.

కొన్ని సంవత్సరాల క్రితం సీమెన్స్ సంస్థలో పనిచేస్తున్న ఒక ఉన్నతస్థాయి అధికారితో బెర్లిన్‌లో నేను చేసిన చర్చలు ఈ సందర్భంలో గుర్తుకొస్తున్నాయి. జర్మనీ మాజీ ఛాన్సలర్ విల్లిబ్రాంట్‌ను "వాణిజ్య వ్యతిరేకి" అని ఆయన నిందించాడు. ఈనాటి సోషల్ డెమోక్రాట్లకు విల్లిబ్రాంట్ మైళ్ళ దూరంలో ఉన్నాడని మనకు తెలుసు. బ్రాంట్‌ను ఎక్కువగా ప్రశంసించే మరొక సోషలిస్టు గుంతర్ గ్రాస్ తన జీవిత కాలమంతా నయా–ఉదారవాద ప్రపంచీకరణను తీవ్రంగా విమర్శిస్తూ ఉన్నాడు. ప్రారంభంలో నేను ప్రస్తావించిన రెండు కూటములపై వారెలా స్పందించారు? గ్రాస్ లేదా బ్రాంట్ కమ్యూనిస్టులు కాదు. వారు పెట్టుబడిదారీ సమాజంలో జీవించారు.

సీమెన్స్ ఉన్నతాధికారి బ్రాంట్‌ను వ్యాపార వ్యతిరేకి అనటం నాకేమి ఆశ్చర్యం కలిగించలేదు. తన ప్రయోజనాలను "జాతీయ ప్రయోజనాలు"గా ప్రచారం చేస్తూ, ప్రభుత్వం తనకు లాభాలు తీసుకొచ్చే చర్యలు తీసుకోవాలని గుత్త పెట్టుబడి కోరుకొంటుంది. ఎవరైనా రాజకీయ నాయకుడు అటువంటి పని చేయకపోతే "వ్యాపార వ్యతిరేకి" అని అతనిపై ముద్ర వేస్తుంది. నయా–ఫాసిజంలో అతనిని " జాతి వ్యతిరేకి" అని కూడా పిలువవచ్చు. నయా–ఫాసిజంలో జరుగుతున్నట్లుగా ఒకటి, రెండు ''కొత్త''గా అభివృద్ధి అవుతున్న గుత్తసంస్థలు, ప్రభుత్వానికి మధ్య ఏర్పడుతున్న సన్నిహిత సంబంధాలను బ్రాంట్ (గ్రాస్ కూడా) ఖచ్చితంగా వ్యతిరేకించి ఉండవచ్చు. కానీ ఈ మధ్య ఫ్రాన్స్‌లో ఏర్పడినట్లుగా వామపక్షాలతో విస్తృతమైన సంఘటనను ఏర్పాటు చేసి, నయా–ఫాసిస్టు ప్రభుత్వం అధికారంలోకి రాకుండా నిరోధించటం కోసం బ్రాంట్ కష్టపడి ఉండవచ్చునని నేను భావిస్తున్నాను.

**ఒకవేళ ఇండియా కూటమి గాని**

> **" నయా-ఉదారవాదమే నయా-ఫాసి జం రూపుదిద్దుకోవటానికి అవసరమైన పరిస్థితులను సృష్టించింది. నయా-ఉదార వాదం దీనిని రెండు విధాలుగా చేసింది. మొదటిది, నిరుద్యోగాన్ని ఎక్కువగా పెంచటం ద్వారా కార్మికవర్గ ఉద్యమాన్ని బలహీన పరచటం ద్వారా. రెండవది, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించటం ద్వారా నయా-ఉదారవాదం దీనిని సాధించింది. ఫాసిజం పెరుగుదలను ప్రతిఘటించ లేనంతగా కార్మికవర్గం బలహీనపడింది. "**

అధికారంలోకి వస్తే అదానీ లాంటి శక్తివంతులైన పారిశ్రామిక వేత్తలతో ఎలా వ్యవహరిస్తుంది? అది ఈ వ్యవస్థను సంపూర్ణంగా మార్చగలుగుతుందా?

ఇప్పటి వరకు ప్రభుత్వం రక్షిస్తున్న అదానీ గ్రూపుపై వస్తున్న వివిధ ఆరోపణలపై విచారణ జరపటానికి అది ఒక కమిటీని ఏర్పాటు చేయగలుగుతుంది. విచారణలో వెల్లడైన అంశాల ప్రాతిపదికగా చర్యలు తీసుకొంటుంది. కానీ ఇండియా కూటమి గనుక అధికారంలోకి వచ్చినట్లైతే అదానీపై చర్యలు తీసుకోవటం మాత్రమే కాక దాని ఎజెండా మరింత సమగ్రంగా ఉండాలి. ప్రజలలో అత్యంత ధనికులుగా ఉన్న వారిపై సంపద పన్ను విధించటంతో పాటు వారసత్వ పన్ను కూడా విధించాలి.

నా అంచనా ప్రకారం ప్రజలలో ఒక శాతంగా ఉన్న ధనికులపై రెండు శాతం సంపద పన్ను, మూడవ వంతు వారసత్వ పన్ను విధిస్తే, కీలకమైన, సార్వజనీనమైన, న్యాయమైన ఐదు ఆర్థిక హక్కులు ప్రజలకు కల్పించటానికి అవసరమైన ఆదాయం సంక్షేమ ప్రభుత్వానికి వస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలలో వారసత్వ పన్ను మరింత ఎక్కువగా ఉన్నది. ఉదాహరణకు జపాన్‌లో 55 శాతం, బ్రిటన్‌లో 40 శాతం వారసత్వ పన్ను ఉన్నది.

అదే విధంగా 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బెర్నీ శాండర్స్, ఎలిజబెత్ వారెన్‌లు వారి కార్యక్రమాలలో ప్రతిపాదించిన దాని కన్నా... ఒక శాతం ధనికులపై విధించే రెండు శాతం సంపద పన్ను చాలా తక్కువ.

**ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన చర్చలలో ఎలాన్ మస్క్ పాల్గొనటం, భారతదేశంలో కాంట్రాక్టులన్నీ ఒక పెద్ద సంస్థకు పోవటం కోసం టెండర్లు వేసిన మిగతా వారిని బెదిరించి, బలవంతంగా ఉపసంహరింపజేయటం కోసం ఐటి డిపార్ట్‌మెంట్ అధికారులు దాడులు చేయటం నయా-ఉదారవాదానికి ఒక కొత్త, భయానకమైన కోణాన్ని ఇస్తున్నది. దీనికి "అణచివేసే ద్వయం" అని వివరణ ఇవ్వచ్చని మీరు భావిస్తున్నారా? ఈ పరిణామాలను చూస్తుంటే నయా-ఉదారవాదం అనేది పదం చాలా తక్కువ అని అనిపిస్తున్నది.**

ఇవన్నీ నయా-ఫాసిజం లక్షణాలు మాత్రమే. నయా-ఉదారవాదమే నయా-ఫాసిజం రూపుదిద్దుకోవటానికి అవసరమైన పరిస్థితులను సృష్టించింది. నయా-ఉదారవాదం దీనిని రెండు విధాలుగా చేసింది. మొదటిది, నిరుద్యోగాన్ని ఎక్కువగా పెంచటం ద్వారా కార్మికవర్గ ఉద్యమాన్ని బలహీన పరచటం (వాణిజ్య సరళీకరణ ద్వారా పోటీ తీవ్రంగా పెరగటంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, చిన్న ఉత్పత్తి రంగాన్ని నాశనం చేయటం), రెండవది, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించటం ద్వారా నయా-ఉదారవాదం దీనిని సాధించింది. ఫాసిజం పెరుగుదలను ప్రతిఘటించలేనంతగా కార్మికవర్గం బలహీనపడింది.

రెండవది, నయా-ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతుండటం వలన అధికోత్పత్తి సమస్య గుత్త పెట్టుబడి ఆధిపత్యాన్ని ప్రమాదంలో పడవేస్తుంది. ప్రజలను భౌతిక జీవిత సమస్యల నుండి దారి మళ్ళించి, "ఇతరుల" ను బూచిగా చూయిస్తుంది. ఎటువంటి రక్షణ లేని మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టటం కోసం అది నయా-ఫాసిస్టులతో కూటమి కడుతుంది. నయా-ఉదారవాదం, నయా-ఫాసిజాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మనం పరిగణనలోకి తీసుకుని, వాటి రెండింటి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని గురించి స్పష్టంగా ఉన్నపుడు నయా-ఉదారవాదం పదాన్ని వాడటం సమస్య కాదు.

అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ న్యూయార్క్‌లోని కోర్టులో అదానిపై అవినీతి ఆరోపణలు చేయటం, ఆయన మేనల్లుడు సాగర్ అదాని నివాసంలో ఎఫ్‌బిఐ దాడులు నిర్వహించటం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో విడదీయరాని భాగంగా అక్రమాలు జరగటానికి ఏ విధంగా అనుమతి స్తున్నారో స్పష్టం చేస్తున్నాయి. జో బైడెన్‌కు సోషల్ డెమోక్రాట్ వాసనలు కూడా లేవు. అయినప్పటికీ ఆయన అత్యధిక సంపదలున్న గుత్తాధిపతులు ఆధిపత్యం వహించటం గురించి తన వీడ్కోలు ప్రసంగంలో హెచ్చరించాడు.

అమెరికాలో ప్రజాభిప్రాయం ఎప్పుడూ ''పోటీ''కి అనుగుణంగానే ఉంటుంది. న్యాయవ్యవస్థ ఇస్తున్న అనేక తీర్పుల్లో కూడా ఇది ప్రతిఫలిస్తుంటుంది. అదే సమయంలో పెట్టుబడిదారీ విధానంలో "స్వేచ్ఛా పోటీ" పెట్టుబడి నిరంతరం పోగుపడటానికి, తద్వారా గుత్తసంస్థల ఏర్పాటుకు దారి తీస్తుంటుంది. గుత్త పెట్టుబడిదారీ విధానం సహజంగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి దారితీస్తుంది (నయా-ఫాసిజంలో అది శిఖరాగ్రానికి చేరుతుంది). న్యాయవ్యవస్థలోని కొన్ని తరగతుల తీర్పులలో ప్రజాభిప్రాయంతో వ్యక్తమయే "నైతికత" ప్రతిఫలిస్తుంటుంది. మరోవైపు పెట్టుబడిదారీ విధానం అనివార్యంగా "ఆశ్రితుల"ను తయారు చేస్తుంటుంది. అదాని కేసులో వలె ఈ వైరుధ్యం అపుడపుడు అమెరికా న్యాయవ్యవస్థ ఇస్తున్న తీర్పులలో


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

వ్యక్తమౌతుంటుంది.

నైతికంగా పెట్టుబడిదారీ విధానంలో సమస్యలు లేవనీ, అదానీ కేసు ప్రత్యేకమైనదనీ నేను భావించటం లేదు. నయా-ఉదారవాదం ఏర్పరచిన సానుకూలమైన పరిస్థితులలో రూపుదిద్దుకున్న నయా-ఫాసిజంలో, అవధులు లేని గుత్త పెట్టుబడి ఆధిపత్యంలో ఏం జరుగుతుందనే దానికి అదానీ కేసు ఒక ఉదాహరణ మాత్రమే. కాబట్టి బైడెన్ హెచ్చరికకు నేను ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం లేదు. నయా-ఉదారవాద విధానాలను అధిగమించి, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అనుసరిస్తేనే అదానీ వంటి కేసులను నిరోధించటం సాధ్యమౌతుంది.

> **“ నైతికంగా పెట్టుబడిదారీ విధానంలో సమస్యలు లేవనీ, అదానీ కేసు ప్రత్యేకమైనదనీ నేను భావించటం లేదు. నయా-ఉదారవాదం ఏర్పరచిన సానుకూలమైన పరిస్థితులలో రూపుదిద్దుకున్న నయా-ఫాసిజంలో, అవధులు లేని గుత్త పెట్టుబడి ఆధిపత్యంలో ఏం జరుగుతుందనే దానికి అదానీ కేసు ఒక ఉదాహరణ మాత్రమే. ”**

**అమెరికా కోర్టు చేసిన నేరారోపణలతో కొన్ని దేశాలలో అదానీతో జరిగిన ఒప్పందాలను తిరస్కరించటం, వాటిని గురించి పునరాలోచన చేయటం జరుగుతున్నది. కెన్యా ప్రభుత్వం అదానీ గ్రూపుతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది. బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం అదానీతో చేసుకున్న కాంట్రాక్టును పున:పరిశీలిస్తున్నది. అదానీ గ్రూపుపై చేసిన ఆరోపణలు తప్పు అని తేలేవరకు తాను ఆ గ్రూపులో పెట్టుబడులు పెట్టటాన్ని ఆపివేస్తున్నానని ఫ్రెంచి విద్యుత్ కంపెని టోటల్ ఎనర్జీ ప్రకటించింది. అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని శ్రీలంక ప్రభుత్వం రద్దు చేసుకుంది. అవినీతి బురదలో ఉన్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని మార్కెట్ శక్తులు వ్యతిరేకిస్తున్నాయని ఈ చర్యలు వెల్లడిస్తున్నాయా?**

ఈ పరిణామాలతో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో “మార్కెట్ శక్తులు”, కొంత మేరకు “స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానాన్ని” తీసుకువస్తాయనే పొరపాటు ఆలోచనలకు మనం రాకూడదు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, ఆ విధానంలో నయా-ఫాసిజం ఆధిపత్యంలో ఉన్నంతకాలం అదానీ సామ్రాజ్యం దెబ్బతింటే దాని స్థానంలో అటువంటి మరొక సామ్రాజ్యం రూపు దిద్దుకుంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో రూపుదిద్దుకున్న నైతిక సూత్రాలను ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ధ్వంసం చేస్తుంటే చూస్తూ ఉండమని దీని అర్థం కాదు. ప్రస్తుత నయా-ఉదారవాద విధానాలతో ఆధిపత్యం వహిస్తున్న గుత్త పెట్టుబడిదారీ విధానాన్ని మార్చనంత వరకు, అత్యంత నిర్లజ్జగా వ్యవహరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని మనం అధిగమించలేమన్న వాస్తవాన్ని గుర్తించాలన్నదే దీని భావం.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# వామపక్ష ప్రత్యామ్నాయమే శరణ్యం

***(6వ పేజీ తరువాయి)***

ఫలితాలు వెలువడిన వెంటనే ఏర్పడిన పరిస్థితిని తీసుకుందాం. వామపక్షాలు 59 స్థానాలు గెలుచుకోవడంతో కొత్త ప్రభుత్వం (యుపిఎ-1) ఏర్పాటులో వామపక్షాల ప్రభావం పెద్దగా ఉంటుందని స్పష్టమైంది. దాంతో మీడియా మొత్తం (ప్రింట్, ఎలక్ట్రానిక్) గొంతు చించుకుని “కమ్యూనిస్టు భూతం” గురించి అరవడం ప్రారంభించింది. కమ్యూనిజం అనేది హింసాత్మకమైన, ప్రజాస్వామ్య విరుద్ధ శక్తి అనే దురభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతుంది. కమ్యూనిస్టులు మతాన్నీ, భారత దేశ సంస్కృతినీ పట్టించుకోరని కూడా ఆరోపించారు. ఈ రంగాల్లో ప్రజల్లో ఉన్న దురభిప్రాయాలను పారద్రోలడానికి నిరంతరం పట్టుదలతో కూడిన కృషి చేయాలి.

ఫెడరల్ వ్యవస్థను మరింత వాస్తవం చేసేందుకు గాను అంతర్రాష్ట్ర మండలి స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని చీల్చడం అనేది మన రాజ్యాంగంలో నిర్దేశించబడిన, అలాగే సర్కారియా కమిషన్ (1983-87) చెప్పిన కేంద్ర రాష్ట్ర సంబంధాలకు పెద్ద విఘాతం కల్గించింది. దాంతోపాటు ఇప్పుడు ఎన్డీఎ ప్రభుత్వం రాష్ట్రాలతో ఏమాత్రం సంప్రదించకుండానే రక్షణ ఖర్చులను అవి కూడా భరించేట్లు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

వామపక్షాలు మరింత విస్తృతమైన ప్రజానీకానికి సభ్యత్వం ఇవ్వాలి. ప్రజల పౌర హక్కులు, మహిళా విముక్తి, దళితులు ఆదివాసీలు మతపరమైన మైనారిటీల హక్కుల కోసం అనేక ప్రజా ఉద్యమాలు నడుస్తున్నాయి. కొత్త రాజకీయ కూటమి వ్యవస్థాగత నిర్మాణంలో ఇటువంటి వారందరికీ అవకాశం కల్పించాలి.

వామపక్షాలు తమ కనీస ఉమ్మడి కార్యక్రమంలో మరో రకమైన ఘర్ వాపసీ విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఆదివాసీలు, దళితులు, ఇతర పీడిత ప్రజల నిర్దిష్ట సంస్కృతులపై కేంద్రీకరించాలి. దేశవ్యాపితంగా బ్రాహ్మణేతర సాంస్కృతిక సంప్రదాయాలపై కేంద్రీకరించాలి. అంటే ఈ సెక్షన్ ప్రజల ఆధ్యాత్మిక కార్యకలాపాలను “నిర్‌బ్రాహ్మణీకరించాలి”. ఇదంతా పూర్తిగా 365 రోజులు, రోజుకు 24 గంటలూ చేయాల్సిన పని. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనుసరించే సాఫ్ట్ హిందుత్వ కార్యక్రమంలా ఉండకూడదు.

యుద్ధాలు నేల మీద చేయాలి, టీవీ స్టేషన్లలో కాదు. అయితే నేటి వామపక్షానికి టీవీల్లో స్థానం ఇవ్వడం లేదనుకోండి. అందరికీ తెలిసిన భారత దేశం అనే భావన (భిన్నత్వం, బహుళత్వం) మీద జరుగుతున్న దాడికి వ్యతిరేకంగానూ, నయా-ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగానూ జరిగే పోరాటంలో తటపటాయింపులుండరాదు. అలాగే ఈ పోరాటంలో ముందొకటి తరువాత మరొకటి అనే ప్రాధాన్యాలు ఉండకూడదు. ఈ రెండు విషయాలూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి కనుక రెంటికి వ్యతిరేకంగా ఏక కాలంలో పోరాడాలి.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

# భాషా వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం



రచయిత మాజి ఎంపి, వివిధ దేశాలలో భారత ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేశారు.

**మణిశంకర్ అయ్యర్**

అత్యంత గొప్ప వ్యక్తి అయిన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నిర్వహించిన విద్యాశాఖను తాను నిర్వహిస్తున్నానన్న విషయం నేటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అర్థం కావటం లేదు. భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించే సహస్రాబ్దాల మన సంస్కృతిని మరింత పరిపుష్టం చేసే గ్రంథం డిస్కవరీ ఆఫ్ ఇండియా. అటువంటి పుస్తక రచనలో తనకు కలామ్ గొప్ప సహకారాన్ని అందించాడని మన ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చెప్పారు.

ఏకత్వంలో మాత్రమే ఐక్యతను చూసే సావర్కర్-గోల్వాల్కర్-మోడి భావజాలానికి చెందిన వాడు ధర్మేంద్ర ప్రధాన్. అన్ని రాష్ట్రాల మీదా హిందీని రుద్దటానికి ఉద్దేశించిన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) మొదటి ముసాయిదాలో "సమగ్ర విద్య" మార్గం ద్వారా విద్యకు కేటాయించిన నిధులు రాష్ట్రాలకు అందుతాయని పేర్కొన్నారు. కానీ తమిళనాడు ద్విభాషా (తమిళం, ఇంగ్లీష్) విధానాన్ని వదులుకోవటానికి సిద్ధం కాలేదు. హిందుత్వవాదులు దురుద్దేశంతో తీసుకొస్తున్న త్రిభాషా విధానాన్ని దృఢంగా వ్యతిరేకించింది. ధర్మేంద్ర ప్రధాన్ లాంటి వారు హిందుత్వ భావజాలాన్ని దాటి ఆలోచించ లేకపోతున్నారు.

కాశీలోని తమిళ సంగమంలో -అన్ని చోట్ల కూడా- ఏకత్వం ద్వారా ఐకమత్యాన్ని సాధించాలని ప్రధాన్ చేసిన ప్రకటన తీవ్ర వివాదాలకు కారణమైంది. దక్షిణాది వేర్పాటువాదులు దేశ ఐక్యతకు ప్రమాదం కలిగిస్తున్నారని హోం మంత్రి అమిత్‌షా అంతకు ముందే ప్రకటించాడు. దేశ ఐక్యతకు ప్రమాదం కలిగిస్తున్నారని అమిత్ షా పేర్కొన్న "వేర్పాటువాదుల"లో అతి తక్కువ సంఖ్యలో ఉన్న బిజెపి మినహా తమిళనాడులోని మిగతా అన్ని పార్టీలు, తమిళ ప్రజలందరూ ఉన్నారు. తమలో ఒకరి పట్ల మరొకరికి ఉన్న తీవ్రమైన వ్యతిరేకతలను పక్కన పెట్టి, హిందీ సమస్యపై ఈ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. ఇప్పుడు తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య లేఖల యుద్ధం నడుస్తున్నది. బిజెపి ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా జాతీయ సమగ్రతను ప్రమాదంలోకి నెడుతున్నదన్న అవగాహన ధర్మేంద్ర ప్రధాన్‌కు లేకుండాపోయింది.

హిందీ దేశంలోని ఒక ప్రాంతం వారికి మాత్రమే మాతృభాష అని ధర్మేంద్ర ప్రధాన్ అర్థం చేసుకోలేక పోతున్నాడు. ఒక ప్రాంతంలోని వారి మాతృభాషగా ఉన్న హిందీని తప్పనిసరి జాతీయ భాషగా చేయటం అంటే హిందీ తమ మాతృభాషగా ఉన్నవారికి అనుకూలంగా మన జాతీయతను వక్రీకరించటంతో పాటు, తమ మొదటి భాషగా తమిళం, ఇతర ద్రవిడియన్ భాషలు నేర్చుకొంటున్న వారి పట్ల వివక్షతో చూడటం అవుతుంది. నాలుగు ద్రవిడ భాషలైన తమిళం, తెలుగు, కన్నడ, మళయాళంలలో ఒకదానిని హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలలో మూడవ భాషగా చేస్తే ఈ వివక్షను కొంత వరకు తగ్గించవచ్చు. కానీ ఆచరణలో గంగా-యమున ప్రాంతంలోని ఉత్తరాది రాష్ట్రాలు ద్రవిడ భాషతో సంబంధం లేని సంస్కృతాన్ని మూడవ భాషగా ఎంచుకొంటున్నాయి.

భారతదేశంలోని ప్రధానమైన ఏ గ్రూపు ప్రజలకూ ఇంగ్లీష్ మాతృభాష కాదు. కానీ మనందరం ఇంగ్లీష్ నేర్చుకుంటున్నాం. ఆచరణలో ఇది భారతీయులందరికీ సమానమైన అవకాశాలను కల్పిస్తుంది. కానీ "ప్రపంచ అనుసంధాన భాష"ను నేర్చుకోవటంలో అన్ని దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఉత్తరాది రాష్ట్రాల వారికి మార్గదర్శకులుగా ఉన్నారు. ఐటి రంగంలో దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానానికి చేరటంలో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. "తమిళనాడు విద్యార్థులు హిందీ నేర్చుకోకుండానే ప్రపంచంలో ఎక్కడికైనా వలసలు పోయేంతగా విద్యావంతులైనారు" అని డిఎంకె నాయకుడు శరవణన్ అన్నాదురై చెప్పాడు. ఆధునిక ఉత్పత్తిరంగంలో దక్షిణాది రాష్ట్రాలు పైస్థాయిలో ఉన్నాయి. తమిళనాడు ఒక్కటే దేశ జిడిపిలో 9 శాతాన్ని సమకూరుస్తున్నదని తమిళనాడు ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరుసు చెప్పాడు. విద్యా, ఆర్థికరంగాలలో తమిళనాడు అద్భుతమైన ప్రగతి సాధించింది. ప్రభుత్వ పాఠశాలలో తమిళంలో చదివిన డాక్టర్లు, శాస్త్రవేత్తలు రాష్ట్రం అభివృద్ధి సాధించటంలో గొప్ప పాత్ర నిర్వహించారు. అందుకు ద్విభాషా విధానం ఏ మాత్రం ఆటంకం కాలేదు. వారు ప్రపంచస్థాయిలో కూడా గొప్ప పాత్ర నిర్వహిస్తున్నారు.

**నియోజకవర్గాల పునర్విభజన సమస్య**

2026లో దేశవ్యాపితంగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కాబోతున్న సమయంలో కేంద్ర విద్యా మంత్రి విద్యారంగంలో ద్విభాషా విధానాన్ని సవాలు చేయటం ఏ మాత్రం సరైనది కాదు. మనం మార్పు లేకుండా "ఒక వ్యక్తి-ఒక ఓటు" ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లైతే దక్షిణాది

రాష్ట్రాలు సక్రమంగా విధి నిర్వహణ చేయటం వలన, జనాభా లెక్కలతో భారీగా పార్లమెంటు సీట్లు కోల్పోయి శిక్షను (అవి సక్రమంగా పని చేశాయి కాబట్టి!) అనుభవిస్తాయి. (జనాభా పెరుగుదలను అరికట్టాల్సిన విధి నిర్వహణలో విఫలమైన) ఉత్తరాది రాష్ట్రాలు ఎక్కువ స్థానాలు పొంది, తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంటాయి. ఇది సమంజసమేనా!

ఆయా ప్రభుత్వాలు అమలు చేసినవి ఏమిటి, విఫలమైనవి ఏమిటి అన్న అంశాలను పరిశీలిద్దాం. గర్భధారణ అంశాన్ని మొదట చూద్దాం. 1950, 60 దశాబ్దాలలో జనాభా పెరిగి అభివృద్ధిని దెబ్బతీస్తుందన్న మాల్తూసియన్ భయాలను ఎదుర్కొని, మొదటగా విజయం సాధించిన రాష్ట్రం తమిళనాడు. కాంగ్రెస్ నాయకుడు కె కామరాజు, తర్వాత ద్రవిడ పార్టీల ముఖ్యమంత్రులు గర్భధారణను ప్రస్తుత 1.4 శాతానికి తగ్గించటంలో విజయం సాధించారు. మిగతా దక్షిణాది రాష్ట్రాలు కూడా అదే బాటలో సాగాయి.

ఉత్తరాది రాష్ట్రాలలో ఇది ఇంకా 2.1 శాతంగా–తగ్గుతున్న జనాభాను పూరించటం కన్నా ఎక్కువస్థాయి–ఉంది. పెరుగుతున్న జనాభాను తగ్గించటంలో దేశానికి ఆదర్శం చూపిన దక్షిణాది రాష్ట్రాలు సాపేక్షంగా పార్లమెంటులో బలం కోల్పోయి శిక్షను

> **"దేశ ఖజానాకు తమిళనాడు రూపాయి జమ చేస్తే, 60 పైసలు మాత్రమే తిరిగి పొందుతున్నది. మరోవైపున బీహార్ కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయికి 3.60 రూపాయలు తిరిగి పొందుతున్నది. అయినప్పటికీ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి తమిళ నాడుకు ఎటువంటి ప్రత్యేక పథకాలు లేకుండా "బీహార్‌కు ప్రత్యేకమైన బడ్జెట్"ను ప్రవేశపెట్టారు. విధినిర్వహించిన వారిని శిక్షించటం, విఫలమైన వారిని సత్కరించటం అని నేను చెప్పింది అర్థమయిందా?"**


అనుభవించాలా? దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికరంగంలో కూడా మంచి అభివృద్ధిని సాధించాయి. దక్షిణాది రాష్ట్రాలు తాము సాధించిన ప్రగతిని అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకోవాలని, అభివృద్ధి సాధనలో అట్టడుగున ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలతో కాదని ప్రధాని నరేంద్ర మోడి ప్రధాన ఆర్థిక సలహాదారు చెప్పాడు.

దేశ ఖజానాకు తమిళనాడు రూపాయి జమ చేస్తే, 60 పైసలు మాత్రమే తిరిగి పొందుతున్నది. మరోవైపున బీహార్ కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయికి 3.60 రూపాయలు తిరిగి పొందుతున్నది. అయినప్పటికీ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి తమిళనాడుకు ఎటువంటి ప్రత్యేక పథకాలు లేకుండా "బీహార్‌కు ప్రత్యేకమైన బడ్జెట్"ను ప్రవేశపెట్టారు. విధినిర్వహించిన వారిని శిక్షించటం, విఫలమైన వారిని సత్కరించటం అని నేను చెప్పింది అర్థమయిందా?

రాజ్యాంగంలోని అంశాలు పట్టువిడుపులతో కూడి ఉండటం వలన భారతదేశంలో కేంద్ర–రాష్ట్ర సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందుతున్నాయని జస్టిస్ సర్కారియా కమిషన్ తన నివేదికలో చెప్పింది. అమెరికా రాజ్యాంగం కఠినంగా ఉండటం వలన, దానిని ఆమోదించిన 20 సంవత్సరాలలో(1861–65) సివిల్ వార్‌కు దారి తీసింది. అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఉత్తరాది రాష్ట్రాలు చేసిన యుద్ధం మానవ చరిత్రలో అతి రక్తపాతంతో కూడినదిగా

# త్రిభాషా సూత్రంపై నిజాయితీగా చర్చలు జరపాలి

**అపూర్వానంద్**



**రచయిత ఢిల్లీ యూనివర్సిటీలో హింది బోధకులుగా ఉన్నారు. విద్య, సాంస్కృతికాంశాలపై విమర్శనాత్మకంగా వ్యాసాలు రాస్తున్నారు.**

"త్రిభాషా సూత్రం" పేరుతో భాష అంశంపై జాతీయస్థాయిలో చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పోరాటాన్ని తీవ్రం చేశాడు. దశాబ్దాల తరబడి రాష్ట్రంలో అమలు జరుగుతున్న ద్విభాషా విధానాన్ని అమలు జరుపుతామని ఆయన గట్టిగా చెబుతున్నాడు. ఈ విధానంలో తమిళంతో పాటు ఇంగ్లీషును కూడా బోధిస్తారు. మూడవ భాషను, ప్రత్యేకంగా హిందీని నేర్చుకోవటం ద్వారా తమిళ ప్రజలు ప్రయోజనం పొందుతారని, దేశంలోని భాషా వైవిధ్యంలో వారు కూడా భాగస్వాములౌతారని చేస్తున్న సూచనలపై స్టాలిన్ ఈ విధంగా చెప్పాడు."మీకు మరీ మరీ కృతజ్ఞతలు. ఏ ఫార్ములా లేకుండానే మేము ఈ భాషలను నిజాయితీగా, నమ్రతతో నేర్చుకుంటున్నాం. మేం భౌతికంగా, ఆర్థికంగా హిందీ రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌ల కన్నా అభివృద్ధి చెందటానికి ద్విభాషా విధానం దోహదం చేసిందని మా చరిత్ర మీకు తెలుపుతుంది. తమ స్వంత రాష్ట్రాలలో బతుకు తెరువు లేకపోవటంతో తమిళనాడు, కేరళ, కర్ణాటక లాంటి దక్షిణాది రాష్ట్రాలకు వలసలు వస్తున్న హిందీ రాష్ట్రాల ప్రజల వలె మా రాష్ట్రంలోని ప్రజలు ఆ రాష్ట్రాలకు వలసలు పోవటం లేదు.

తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి 2022లో కోయంబత్తూరులో పానీపూరి అమ్ముతున్నవారిని వారి భాష ఏదని అడిగాడు. బతకటానికి అవసరమైన ఆదాయం సంపాదించుకోవటానికి తాను తమిళనాడు వచ్చానని స్పష్టంగా చెప్పటం హింది మాట్లాడే ప్రజలను బాధిస్తుంది. హింది నేర్చుకోవటం మిమ్మల్ని కూడా ఈ స్థితికి తీసుకొస్తుందని అతను చెప్పింది సరైనదే. హిందీ మాట్లాడే వారు బాధ పడతారు. కానీ వారి వద్ద సమాధానం లేదు.

తమిళ, కన్నడ ప్రాంతాలలో హింది మాట్లాడే ప్రజలకు జీవనోపాధి లభిస్తుంది కాబట్టి వారు ఈ భాషలు నేర్చుకోవాలి,

> **"సంస్కృతం లాగా "పురాతన భాషగా" రాజ్యాంగంలో గుర్తింపు పొందిన తమిళ భాషను, సంపద్వంతమైన భారతీయ భాషలు, ప్రాంతీయ వైవిధ్యాలను అభివృద్ధి చేయటానికి బదులుగా సంకుచితమైన, దురభిమానంతో కూడిన, ఇతరుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే , "ఒక దేశం, ఒకే భాష" అనే హిందుత్వ దుర్విధానాలతో తమిళాన్ని అట్టడుగు భాషగా ఎందుకు చేయాలి?"**

నమోదైంది. (20వ శతాబ్దంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలలో జరిగిన మారణహోమం మాత్రమే దీనికన్నా ఎక్కువ). రాజ్యాంగంలో పొందుపరచిన పట్టు విడుపులతో కూడిన విధానాన్ని అనుసరించటానికి మారుగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజ్యాంగాన్ని ఏ విధంగా గౌరవించాలన్న అంశంపై తమిళనాడుకు ఉపన్యాసాలిస్తున్నాడు. "రాజ్యాంగంలో ఏ ఆర్టికల్‌ను గురించి ఆయన ఉదహరిస్తున్నాడు?'' అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ దీనిని తిప్పికొట్టాడు.

రాజ్యాంగం నిర్దేశించిన అంశాలలో ప్రధాన్ పూర్తి అజ్ఞానిగా ఉన్నాడు. నూతన విద్యా విధానం (ఎన్ఇపి)లో చెప్పిన త్రిభాషా విధానాన్ని అమలు చేయకపోతే సమగ్ర శిక్షా అభియాన్ కింద తమిళనాడుకు రావలసిన 2,152 కోట్ల రూపాయల నిధులను నిలిపి వేస్తామని బెదిరించటం ఈ అజ్ఞానం కన్నా ప్రమాదకరమైనది. ఇది రాష్ట్రాన్ని బ్లాక్‌మెయిల్ చేయటమేనని, తమిళులు ఇటువంటి బెదిరింపులకు లొంగరని, ఈ విధమైన మూర్ఖత్వాన్నే ప్రదర్శిస్తే తమిళ ప్రజల శక్తి ఏమిటో ఢిల్లీ తెలుసుకొంటుందని స్టాలిన్ సరిగానే హెచ్చరించాడు. కేంద్రం చేస్తున్న ఈ బెదిరింపుల వలన రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యార్థులు, 32 వేల మంది సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని హిందుపత్రిక ఫిబ్రవరి,19వ తేదీ రాసిన సంపాదకీయంలో పేర్కొన్నది.

విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చటం ద్వారా రాష్ట్రాల విధానాలపై పెత్తనం చేసే హక్కు కేంద్రానికి రాదని, అది కేవలం విద్యకు మాత్రమే సంబంధించినది కాదనీ, రాష్ట్ర గౌరవానికి చెందిన విస్తృత అంశాలు, తమిళుల ప్రత్యేక గుర్తింపు, ఆత్మ గౌరవం, ఘనమైన భాషా-సాంస్కృతిక వారసత్వం దానిలో ఉన్నాయని స్టాలిన్ ప్రధాన్‌కు గుర్తు చేశాడు. సంస్కృతం లాగా ''పురాతన భాషగా'' రాజ్యాంగంలో గుర్తింపు పొందిన తమిళ భాషను, సంపద్వంతమైన భారతీయ భాషలు, ప్రాంతీయ వైవిధ్యాలను అభివృద్ధి చేయటానికి బదులుగా సంకుచితమైన, దురభిమానంతో కూడిన, ఇతరుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే , "ఒక దేశం, ఒకే భాష" అనే హిందుత్వ దుర్విధానాలతో తమిళాన్ని అట్టడుగు భాషగా

అంతేగానీ దాన్ని తల్లకిందులు చేస్తూ దక్షిణాది రాష్ట్రాల ప్రజలు హిందీ నేర్చుకోవాలని చెప్పటం సరికాదని అతను చెప్పాడు. కాబట్టి అవకాశాలు ఉన్న ప్రాంతాల భాషలను బలపర్చే పని మీరు చేయాలి. బళ్ళపై సరుకులు అమ్ముకొనే వారు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు స్థానిక భాషలు నేర్చుకోవటాన్ని మనం చూస్తున్నాం. కానీ ఉన్నతోద్యోగాలు చేస్తున్న వారు సంవత్సరాల తరబడి దక్షిణాది రాష్ట్రాలలోని నగరాలలో ఉన్న తర్వాత కూడా స్థానిక భాష నేర్చుకోలేదని అరుదుగా మాత్రమే గుర్తు చేసుకుంటారు. తమ అవసరాలకు ఇంగ్లీష్ సరిపోతుందని వారు భావిస్తున్నారు.

### క్షీణిస్తున్న బహుళత్వ భావన

భౌతికపరమైన ఈ అంశాన్ని పక్కన పెట్టి మన ప్రజల బహు భాషా ప్రావీణ్యాన్ని పరిశీలిస్తే "హిందీ" మాట్లాడే రాష్ట్రాల కన్నా దక్షిణాది రాష్ట్రాలలోని ప్రజలు భాషల విషయంలో అగ్రస్థానంలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోని ప్రజలు ఎక్కువగా వారి మాతృభాషలు అవద్ లేక భోజ్‌పురిని వాడతారన్న విషయాన్ని పక్కన పెడితే వారికి ఒక్క భాష మాత్రమే తెలుసు. ఏదైనా ఇతర భారతీయ భాషను నేర్చుకోవాలన్న భావనే వారికి లేదు. ఇంగ్లీష్ తప్పనిసరిగా నేర్చుకోవాలి కాబట్టి దానిని వారు తప్పించుకోలేరు. దశాబ్దాల పాటు త్రిభాషా విధానాన్ని అమలు చేసిన తర్వాత కూడా వారు భాషాపరంగా దిగువస్థాయిలో ఎందుకున్నారన్న ప్రశ్న వేయాలి. ఇతర భారతీయ భాషలను నేర్చుకోవాలన్న కోరిక ఈ ప్రాంత ప్రజలలో ఉందా? ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని పాఠశాలలలో ఎవరైనా తమిళం, అస్సామీ భాషలను బోధించే ఉపాధ్యాయులు ఉన్నారా?

వివిధ భాషలు మాట్లాడే ప్రజలను ఒకరికి మరొకరిని సన్నిహితం చేయటానికి సాధనంగా త్రిభాషా విధానం ఉపయోగపడుతుందని భావించారు. కాని ''హిందీ'' మాట్లాడే ప్రాంతంలో దీనిని ఉపయోగించలేదు. వారు మరాఠీ, కన్నడ లేదా బెంగాలీ భాషలను నేర్చుకోవటం లేదు. కాబట్టి హిందీ మాట్లాడే ప్రజలు చెప్పే దానిలో "భారతీయత" ఎంత అని ప్రశ్నించాలి. హిందీని ఎక్కువ మంది మాట్లాడతారు కాబట్టి హిందీ ద్వారా భారతీయతను నిర్ధారించవచ్చునని వారు భావిస్తున్నారు. కాని అది కూడా పాక్షికంగా మాత్రమే వాస్తవం.

"హిందీ మాట్లాడేవారు తులసిదాస్, సూరదాస్, కేశవ్ రాసిన పుస్తకాలను ఎందుకని చదవటం లేదు? అవి భారతదేశం మొత్తం పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కాని వాటిని శ్రద్ధగా చదివేవారిని యూరప్‌లో చూస్తాం". మనం ఇపుడు హిందీ ప్రాంతంగా చెప్పుకొనే చోట హిందీని జాతీయ భాషగా ప్రచారం చేయటం కోసం అనేక స్థానిక భాషలను చిదిమి వేశారని ముఖ్యమంత్రి స్టాలిన్ "హిందీ" మాట్లాడే ప్రజలకు గుర్తు చేశాడు. ఇపుడు వారి మూపులపై హిందీ స్వారి చేస్తున్నది.

హిందీ వారికి మాతృభాషగా లేదా మొదటి భాషగానో లేదని హిందీ బోధించే ఉపాధ్యాయునిగా నాకు బాగా తెలుసు. వారి ఇళ్ళలో వారు మైథిలి, బ్రజ్, మార్వారి లేదా హర్యానవి భాషలను ఉపయోగిస్తారు. వారికి హిందీ నేర్చుకోవలసిన భాష. అది వారికి అంత తేలిక కాదు. ఉత్తరప్రదేశ్‌లో హిందీ పరీక్షలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలవటం దీనిని ధృవపరుస్తున్నది. వారి ఇళ్ళలో వాడే భాష నుండి హిందీని వేరు చేస్తూ పాఠశాలలలో బోధించే విధానం పూర్తిగా లోపభూయిష్టమైనది. "స్వచ్ఛమైన" హిందీని నేర్పాలనే తాపత్రయంతో స్థానిక భాషలను తుడిచిపెట్టటం మరో కారణం. దేశ నిర్మాణ కర్తవ్యం పేరుతో ఏ మాత్రం ఉత్సాహం కలిగించని హిందీతో పిల్లలను భయపెడుతున్నది.

ఎందుకు చేయాలి?

**బలవంతం కాదు**

**ఏకాభిప్రాయం సాధించాలి**

కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ప్రధాన్ ఆధునిక తమిళ చరిత్రను గురించి తెలుసుకోవాలి. దక్షిణ భారత హిందీ ప్రచారసభ ద్వారా హిందీని నిరంతరం ప్రచారం చేసిన రాజాజి (రాజగోపాలాచారి) రాజకీయంగా అప్రధాన స్థితికి చేరాడు. రాజగోపాలాచారిని సవాలు చేస్తూ ఇవి రామస్వామి పెరియార్ 1930 దశాబ్దం చివరిలో తిరుచ్చి నుండి చెన్నైకి నిర్వహించిన యాత్ర, గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుడైన రాజాజీ స్థాయిని ఆయన స్వరాష్ట్రంలోనే దిగజార్చింది. దీని వలన కామరాజు తక్షణం లాభపడ్డాడు. కానీ ఆయన కూడా 1967 శాసనసభ ఎన్నికలలో 27 సంవత్సరాల విద్యార్థి చేతిలో ఓడిపోయాడు. 58 సంవత్సరాల క్రితం జరిగిన ఆ ఎన్నికలు తమిళనాడులో కాంగ్రెస్ స్థానంలో ద్రవిడియన్ పార్టీలు ఆధిపత్య స్థానానికి రావటానికి దారితీశాయి.

1965లో ప్రారంభమైన హిందీ వ్యతిరేక ఆందోళన పాత ఆధిపత్య శక్తులను నాటకీయంగా కూలదోయటానికి దారితీసింది. రాజ్యాంగం ఇంగ్లీషుకు ఇచ్చిన 15 సంవత్సరాలు అప్పటికి పూర్తయ్యాయి. అప్పటికి పరిపాలన, జాతీయ అనుసంధాన భాషగా ఇంగ్లీష్ స్థానంలో హిందీని అభివృద్ధి చేయవచ్చునని భావించారు. ఇందిరాగాంధీ హుటాహుటిన చెన్నై వచ్చారు. తమిళనాడు తన ద్విభాషా విధానాన్ని కొనసాగించుకో వచ్చునని, ఇతర రాష్ట్రాలు తాము కోరిన భాషను ఎంచుకోవచ్చునన్న రాజీ ఫార్ములాతో తమిళుల ఆగ్రహాన్ని చల్లార్చారు. సాహసంతో ఆమె చేసిన కృషికి 1971 ఎన్నికలలో ఐక్య డిఎంకె తగిన సత్కారం చేసింది. కీలకమైన ఆ ఎన్నికలలో “మనకు స్థిరమైన ప్రభుత్వాన్ని ఇస్తున్న నెహ్రూ కుమార్తెకు స్వాగతం” అని ఎం కరుణానిధి ప్రజలను ఆకర్షించే నినాదం ఇచ్చాడు.

భావోద్వేగాలతో కూడిన సున్నితమైన అంశాలపై సమతూకంతో వ్యవహరించటం దేశ సమగ్రతను కాపాడటానికి దోహదం చేసింది. ఐక్యంగా ఉన్న భారత్‌ను 50 సంవత్సరాల తర్వాత ప్రధాన్, ఆయన కాషాయ సహచరులు 1860 నాటి ఇండియా స్థితికి తీసుకుపోతున్నారు. 1970 ఉద్యమాన్ని తలచుకుంటే మన కాలానికి, దేశానికి సమీపంలో ఉన్న పాకిస్తాన్ పరిణామాలు గుర్తుకు వస్తున్నాయి. జస్టిస్ సర్కారియా కమిషన్ నివేదికను తిరస్కరిస్తూ, మన రాజ్యాంగానికి తప్పుడు భాష్యం చెప్పారు. బెదిరింపులు, భయపెట్టటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని లొంగదీసుకోవటానికి ఎన్ఇపిని పూర్తిగా దుర్వినియోగం చేశారు. కానీ ఈ విషయంలో బిజెపి మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, తమిళ ప్రజలు అందరూ రాష్ట్ర ప్రభుత్వం వెనుకే ఉన్నారు. విద్య కోసం కేంద్రం రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులకు ఎన్ఇపిలోని త్రిభాషా విధానంతో సంబంధం లేకుండా చేయాలి. అత్యవసరమైన సందర్భాలలో నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ నుండి రాష్ట్రం నిధులను కోరినపుడు, కేంద్రం ఎటువంటి పక్షపాతం లేకుండా నిధులను అందజేయాలి.

ప్రభుత్వ విధానాన్ని అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించి, విఫలమైన వారిని సత్కరించకుండా ఉండేలా చేయాలి. 2026 సెన్సస్‌లో వచ్చిన అంశాలను సక్రమంగా అమలు చేయటానికి కేంద్రం రాష్ట్రాలతో చర్చలు ప్రారంభించటం అత్యంత ప్రధానమైనది. ఈ జాతీయ కార్యక్రమంలో ప్రధాన్‌కు కూడా కొంత పాత్ర ఉంటుంది. దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉంటుంది.

❊

**హిందీపై దాడి కాదు**

బ్రజ్, మైథిలి భాషలపై హిందీ వేస్తున్న ప్రతికూల ప్రభావం గురించి స్టాలిన్ చేస్తున్న వ్యాఖ్యలపై కొందరు స్నేహితులు భయపడు తున్నారు. హిందీపై దాడి చేయవద్దని ఆయనకు సలహాలు ఇస్తున్నారు. కానీ ఆయన హిందీపై దాడి చేయటం లేదు. స్టాలిన్ మాటలలోని భావాన్ని అర్థం చేసుకోవటం కోసం ప్రముఖ భాషావేత్త ఆయేషా కిద్వాయ్ మాటలను ఉదహరిస్తాను. “స్టాలిన్ చెబుతున్నది వాస్తవం. హిందీ ప్రాంతంలో 50 భాషలు మాట్లాడతారని జనాభా లెక్కల్లో వెల్లడౌతున్నది. విద్యలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం ద్వారా విద్యార్థులు పాఠశాలకు వెళ్ళటం ప్రారంభమైన తర్వాత ప్రామాణికమైన హిందీని బోధించటంతో వారు మాట్లాడే భాషలు కుదించబడుతున్నాయి. అటువంటి భాషలు తక్షణమే అంతమైపోవు. కాని వాటి వినియోగం క్రమంగా తగ్గిపోతుంది. ఆ భాషల వినియోగం ఇంటికే పరిమితం అవుతుంది. దాని వలన కొద్ది ప్రయోజనం మాత్రమే ఉందని వినియోగించేవారు భావిస్తే తమ పిల్లలతో మాట్లాడటం ఆపివేస్తారు. దీనిని తిరస్కరించ టానికి లేదు. భారతదేశంలో గత ఒకటిన్నర శతాబ్దాలుగా ఈ క్రమాన్ని మనం చూస్తున్నాం. ప్రజలను ఒక భాష నుండి మరొక భాషకు మార్చటంగా ఈ క్రమాన్ని గురించి భాషా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు”.

స్టాలిన్ విమర్శలకు సమాధానంగా అభివృద్ధి క్రమంలో సహజంగా భాష ప్రామాణీకరించ బడుతుందని హిందీ విస్తరణను బలపరుస్తున్న వారు చెబుతున్నారు. కానీ ఒక భాషను ప్రామా ణీకరించే క్రమంలో అక్కడ ఉన్న ఇతర భాష లను నాశనం చేయరాదని ప్రొఫెసర్ కిద్వాయ్ మనకు చెబుతున్నారు.

“భాషను స్థిరీకరించటం అన్నది అక్కడ ఉన్న విభిన్నమైన భాషలను నిర్మూలించేలా (19వ శతాబ్దంలో మీరు ఫ్రెంచి వారై ఉంటే మినహా) ఉండకూడదు. ప్రజలు సరళంగా అర్థం చేసుకోవటం కోసం భాషను స్థిరీకరించటానికి రాతకు అవసరమైన నిబంధనలు రూపొందించటం, వ్యాకరణాన్ని, నిఘంటువులను తయారు చేయటం, స్పెల్లింగ్ పుస్తకాలు, ఇతర సాహిత్య, కళా సంబంధ అంశాలపై పుస్తకాలు తయారు చేయటం, సాహిత్య కృషి జరగాలి. హిందీగా ఉదహరిస్తున్న అనేక స్థానిక భాషలను – చాలా వరకు ప్రజలు మాట్లాడని భాషగా పేరున్న బ్రజ్ భాషను– పాఠశాలలలో బోధిస్తున్నారా, ఈ మధ్యకాలంలో ఆ భాషలో ఏదైనా గొప్ప గ్రంథం రాశారా, కొత్త పాటలు, సంగీతం వచ్చాయా అన్న అంశం గుర్తుంచుకోండి. దేశంలోని ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో ఉన్న బ్రజ్ భాష మాట్లాడేవారు జనాభా లెక్కలలో తమను హిందీ మాట్లాడేవారుగా నమోదు చేయించుకుంటున్నారు.


త్రిభాషా సూత్రం ప్రకారం తమిళ నాడులోని పాఠశాలలలో హిందీని బోధించ మని స్టాలిన్‌కు సలహాలు ఇస్తున్న వారు బ్రజ్‌లాంటి భాషను పాఠశాలలలో ఎందుకు బోధించటం లేదో ఆలోచించటం లేదు. హిందీని బోధించమని ప్రచారం చేస్తున్నవారు తులసిదాస్, సూర్‌దాస్, కేశవ లాంటి వారు రాసిన గ్రంథాలను చదవటం లేదు. భారతదేశ వ్యాపితంగా ఉన్న పాఠశాలలలో వాటిని బోధిస్తున్నాం. కాని యూరప్‌లో మాత్రమే వాటిని లోతుగా అధ్యయనం చేస్తున్నారు!

కావలసినదేమిటంటే త్రి భాషా సూత్రాన్ని నిజాయితీగా సమీక్షించాలి. హిందీని గురించి ప్రచారం చేసేవారు ఊహాలోకంలో విహరించేలా దానిని ఒట్టి నినాదంగా మాత్రమే వాడుకోకూడదు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

ఈ మాసం ప్రత్యేకం

# ట్రంప్, మస్క్ డోజ్: అమెరికా కార్పొరేట్ లాబీ కుట్ర



రచయిత రిటైర్డ్ భారత విదేశీ వ్యవహారాల అధికారి. 2002 మార్చి నుండి 2005 జనవరి వరకు ఆయన ఆఫ్ఘనిస్తాన్‌లో భారత రాయబారిగా పనిచేశారు

**వివేక్ కట్జు**

**ట్రంప్‌కూ అమెరికన్ కార్పొరేట్ లాబీకీ మధ్య ఏర్పడిన అపవిత్ర కూటమికి డ్రైవింగ్ సీట్‌లో ఎలాన్ మస్క్‌ను కూర్చోబెట్టారు. ఈ కూటమి ప్రభుత్వ వ్యవస్థలను వ్యాపార ప్రయోజనాలకు లోబరుస్తున్నది.**

పరిశ్రమలూ, వ్యాపార సంస్థలూ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తాయన్నది పరమ సత్యం. ప్రభుత్వాలు విదేశాల్లో తమ వ్యాపార సంస్థల ప్రయోజనాలను కాపాడ్డానికి ప్రయత్నిస్తాయనేదీ, ప్రభుత్వ రంగం పెద్దగా లేని దేశాల్లో ఈ వ్యాపార సంస్థలన్నీ ప్రయివేటు వారివే అయివుంటాయన్నది కూడా వాస్తవం. అయినప్పటికీ ప్రభుత్వానికీ, వ్యాపారానికీ మధ్య అందరికీ తెలిసే ఒక తేడా ఉంటుంది. అవి రెండూ నిర్ణయాలు తీసుకునే పద్ధతీ, పనిచేసే పద్ధతీ, వాటి లక్ష్యాలు వంటి వాటి బట్టి ఈ తేడాలు మనకు కనిపిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే: ప్రభుత్వం అనేది కంపెనీ కాదు. తిరగేసి చెప్పాలంటే కంపెనీ అనేది ప్రభుత్వం కాదు.

కానీ నేటి అమెరికాలో ఈ తేడాలు మసకబారిపోయాయి. అమెరికా అధ్యక్షుల వారైన డొనాల్డ్ ట్రంప్, ఆయన వీర స్నేహితుడు, కుడిభుజం అయిన ఎలాన్ మస్క్‌లు వ్యాపార యాజమాన్య పద్ధతులను ప్రభుత్వ నిర్వహణకు వర్తింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదంతా కూడా అమెరికా ఫెడరల్ ప్రభుత్వాన్ని మరింత సమర్ధవంతంగా మార్చడం కోసమే చేస్తున్నట్లు వాళ్లు చెప్పుకుంటున్నారు.

కానీ ఈ మాటల మాటున ప్రభుత్వాన్ని వ్యాపార కార్యకలాపాల యాజమాన్యం కిందకు నెట్టేస్తున్నారు. ట్రంప్ ఏర్పాటు చేసిన, మస్క్ నాయకత్వం వహిస్తున్న "డోజ్" (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) నడక తీరును గమనిస్తే మనకు ఈ విషయం బోధపడుతుంది.

ప్రభుత్వం కంపెనీలను నియంత్రించాలన్నది విశ్వజనీన సూత్రం. గతంలో 18వ శతాబ్దంలో ఈస్టిండియా కంపెనీ విషయంలో ఇలా జరిగింది. ఇప్పటికీ అనేక చోట్ల జరుగుతోంది. కానీ ట్రంప్, మస్క్ ద్వయం ఆ సూత్రాన్ని తిరగేసి అమలు చేస్తున్నారు.

ఆనాడు ఈస్టిండియా కంపెనీని బ్రిటిష్ ప్రభుత్వం నియంత్రించిన విషయాన్ని గమనిస్తే నేడు ట్రంప్, మస్క్‌లు చేస్తున్న పని పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. భారత దేశంలోకి ఈస్టిండియా కంపెనీ ద్వారా వ్యాపారం చేసుకోడానికి వచ్చిన బ్రిటిష్ వాళ్లుచివరికి దేశంలో పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారన్నది మనందరికీ తెలిసిన విషయమే. అయితే అలా వారు ఎలా చేయగలిగారు అన్న విషయం తెలుసుకోవడం మాత్రం చరిత్ర కారుల పని. దాని గురించి సామాన్యులకు పెద్దగా పట్టదు. ముఖ్యంగా స్వాతంత్ర్య వచ్చిన తరువాతి దశాబ్దాల్లో ఈ అంశంపై చరిత్రకారుల్లో చర్చ జరిగింది. అయితే 18,19 శతాబ్దాల్లో ఈస్టిండియా కంపెనీకీ, బ్రిటిష్ ప్రభుత్వానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధం అధ్యయనం చేయదగ్గది. ఎందుకంటే ఒక కంపెనీలో వాటాదారుల ప్రయోజనాలను చూడ్డమే కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం దాన్ని ప్రభుత్వం తన నిర్వహణలోకి తీసుకోవచ్చు అన్న సూత్రాన్ని ఇది నెలకొల్పింది. దాని వల్ల ప్రభుత్వం కంపెనీపై ఆధిపత్యం నెలకొల్పింది. కానీ ఇప్పుడు ట్రంప్, మస్క్‌లు ఎంతో కాలంగా స్థిరపడిన పద్ధతి అంటే రాజకీయ, అధికారయంత్రాంగం ద్వారా ప్రభుత్వం పనిచేసే పద్ధతిని తలకిందులు చేసి ప్రభుత్వంపై కంపెనీలు, వాటి వ్యవస్థలు అజమాయిషీ చేసే పద్ధతిని ప్రవేశపెట్టారు.

**ఈస్టిండియా కంపెనీ ఒక రాజకీయ వ్యవహర్తగా ఎలా మారింది?**

1600 సంవత్సరంలో తూర్పు ప్రాంతంలో వ్యాపారం చేయడం కోసం బ్రిటన్‌లోని రాయల్ చార్టర్, ఈస్టిండియా కంపెనీని నెలకొల్పింది. 17వ శతాబ్దంలో భారత దేశంలో మొఘల్ పాలకులు, స్థానిక పాలకులు అనుమతివ్వడంతో అది భారత దేశంలో తన వ్యాపార స్థావరాన్ని నెలకొల్పింది. తన స్థావరాలను రక్షించుకునేందుకు స్వంత సైన్యాన్ని తయారు చేసుకునే హక్కును కూడా పొందింది. వాటిలో ప్రధానమైనవి కలకత్తా (నేటి కోల్‌కొతా), బంబాయి (నేటి ముంబయి), మద్రాస్ (నేటి చెన్నయ్). కాలక్రమంలో ఈ వాణిజ్య స్థావరాల చుట్టూ పెద్ద నగరాలు వెలసిల్లాయి.

మొఘల్ సామ్రాజ్యం పతనం చెందడంతో కంపెనీ తన వ్యాపార ప్రయోజనాలు రక్షించుకోవడం కోసం "రాజకీయ" వ్యవహర్తగా మారింది. 1757లో ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలోని ఈస్టిండియా కంపెనీ దళాలు బెంగాల్‌లోని మొఘల్ గవర్నర్‌పై నిర్ణయాత్మక విజయం సాధించడంలో ఈ ప్రక్రియ కనిపించింది. అనేక సంవత్సరాల తరువాత ఈ దళాలుల బక్సర్ వద్ద మొఘల్ సైన్యంపై మరింత నిర్ణయాత్మక విజయం సాధించాయి. దాంతో మొఘల్ చక్రవర్తి 1765లో బెంగాల్ (నేటి బంగ్లాదేశ్‌తో సహా),

బీహార్, ఒరిస్సా (నేటి ఒడిషా) జమీందారీని కంపెనీకి కట్టబెట్టాల్సి వచ్చింది. జమీందారుగా మారిన కంపెనీ భూమి శిస్తుల వసూలు, నేరాలకు శిక్షలు విధించడం వంటి హక్కులు పొందింది. భారత దేశంలోని స్వతంత్ర రాజ్యం ఒక విదేశీ వాణిజ్య కంపెనీకి పరిపాలనా బాధ్యతలు అప్పగించింది. సాంకేతికంగా అది మొఘల్ సామ్రాజ్యపు సామంత రాజ్యంగా మారింది.

ఆ విధంగా కొంతమంది వ్యాపారుల బృందం పరిపాలకులుగా మారారు. కానీ వారి లాభాపేక్ష మాత్రం మారలేదు. దాంతో వారిలో అవినీతి హద్దులు దాటిపోయింది. వారి లూటీ విధానలతో కంపెనీ షేర్లు పడిపోయాయి. ఈ విధంగా కొత్తగా ధనవంతులైన కొందరు కంపెనీ అధికారులు బ్రిటన్‌కు తిరిగి వచ్చి అక్కడి రాజకీయ జీవితాన్ని 'అవినీతిమయం" చేయడం ప్రారంభించారు. బ్రిటిష్‌ను పరిపాలిస్తున్న భూస్వామ్య శక్తులకు ఇది నచ్చలేదు. అందువల్ల కంపెనీ వ్యవహారాలపై కన్ను వేసి ఉంచాలనీ, పార్లమెంటరీ చట్టాలద్వారా దాన్ని నియంత్రించాలని నిర్ణయించారు. ఎవరూ ఇవ్వని అధికారాలతో ఒక విదేశీ ప్రభుత్వం తరఫున కంపెనీ భారత దేశంలో అధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున ఈ విధంగా దానిపై నియంత్రణ నెలకొల్పాల్సిన అవసరం ఏర్పడింది. దాంతో బ్రిటిష్ రాజ్యం కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఆరంభించింది.

> **❝ అమెరికా అధ్యక్షుల వారైన డొనాల్డ్ ట్రంప్, ఆయన వీర స్నేహి తుడు, కుడిభుజం అయిన ఎలాన్ మస్క్‌లు వ్యాపార యాజమాన్య పద్ధతులను ప్రభుత్వ నిర్వహణకు వర్తింప జేయడానికి ప్రయత్నిస్తు న్నారు. ఇదంతా కూడా అమెరికా ఫెడరల్ ప్రభుత్వాన్ని మరింత సమర్ధవంతంగా మార్చడం కోసమే చేస్తున్నట్లు వాళ్లు చెప్పకుంటున్నారు. కానీ ఈ మాటల మాటున ప్రభుత్వాన్ని వ్యాపార కార్యకలాపాల యాజమాన్యం కిందకు నెట్టేస్తున్నారు. ❞**



డొనాల్డ్ ట్రంప్, అలాన్ మస్క్ ద్వయం: పరిపాలనను వ్యాపారంగా మార్చారు

### కంపెనీపై బ్రిటన్ ఎలా నియంత్రణ సాధించింది?

బ్రిటిష్ పార్లమెంటులో 1773లో చేసిన రెగ్యులేటింగ్ చట్టంతో బ్రిటిష్ ప్రభుత్వం కంపెనీ వ్యవహారాల్లో జోక్యాన్ని ఆరంభించింది. కంపెనీ భారత దేశంలో అధికారం చెలాయిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అది కంపెనీ సివిల్, మిలిటరీ వ్యవహారాలను తన చేతుల్లోకి తీసుకున్నది. ఆ విధగా కంపెనీకి చెందిన బెంగాల్ గవర్నర్‌ను గవర్నర్ జనరల్‌గా మార్చివేసింది. అలాగే బంబాయి, మద్రాసు గవర్నర్లను కూడా తన కిందికి తెచ్చుకున్నది. కంపెనీ తన వాటాదారులకు ఇచ్చే డివిడెండ్ల పరిమితిని కూడా బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. కంపెనీ స్వాధీనం చేసుకున్న ప్రాంతాలపై పాలనాధికారాలను చేజిక్కించుకోవడంతోబాటు, కంపెనీ వ్యాపార కార్యకలాపాల బాధ్యతల్లో కూడా బ్రిటిష్ ప్రభుత్వం తన అధికారులను నియమించింది.

11 సంవత్సరాల తరువాత, 1784లో భారత దేశంలో కంపెనీకి గల ప్రాంతాలపై పరిపాలనా బాధ్యతలు నిర్వహించేందుకు గాను బ్రిటిష్ పార్లమెంటు ఆ దేశంలో ఒక ప్రభుత్వ యంత్రాంగాన్ని నియమించింది. దీనివల్ల బెంగాల్‌లో కంపెనీ సాంకేతికంగా మొఘల్ సామ్రాజ్యపు సామంత ప్రభువుగా ఉన్నప్పటికీ అదంతా బ్రిటిష్ ప్రభుత్వ వలసగా మారిపోయి నట్లయింది. అయితే భారత దేశంలో వ్యాపారంపై కంపెనీ తన గుత్తాధిపత్యాన్ని మాత్రం నిలుపుకుంది. కంపెనీ వాటాదారుల తరఫున వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను నియమించింది. ఈ విధంగా ద్వంద్వ నియంత్రణ – పరిపాలన, వాణిజ్యం– 1833 వరకు కొనసాగింది. ఆ ఏడాది కంపెనీ వాణిజ్య కార్యకలాపాలు రద్దయ్యాయి. దాంతో కంపెనీ పూర్తిగా పరిపాలనా విభాగంగా మాత్రమే మిగిలింది. ఆ విధంగా భారత దేశాన్ని బ్రిటన్ తన వలసగా మార్చుకోడానికి కంపెనీని ఒక ముసుగుగా ఉపయోగపెట్టుకుంది. 1857 మొదటి స్వాతంత్ర్య సంగ్రామాన్ని ఓడించిన తరువాత 1858లో ఈ ముసుగును కూడా తొలగించింది. భారత దేశ పాలనను బ్రిటిష్ సింహాసనం పాలించడం ప్రారంభించింది.

సారాంశంగా చెపాలంటే, 1765లో కంపెనీ మొఘల్ సామ్రాజ్యపు జమిందారుగా మారిన తరువాత బ్రిటిష్ పాలక వర్గాలు క్రమక్రమంగా దాని అధికార కార్యకలాపాలనూ, పాక్షిక–సార్వభౌమాధికార పాలననూ స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమం సుదీర్ఘంగానూ, ఒడిదుడుకులతోనూ సాగింది. కాని ఈ క్రమం ఒక విషయాన్ని నిర్ధారించింది. అదేమంటే, రాజ్యం కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవచ్చు, ముఖ్యంగా అది గనుక కొన్ని ప్రాంతాలపై ఆధిపత్యం కలిగి ఉంటే. ఒక సార్వభౌమాధికార ప్రభుత్వానికీ, ఒక

> “ట్రంప్-మస్క్ బృందం ఏం చేస్తున్నదో చెప్పడానికి అమెరికా అధ్యక్షుల వారు ఫిబ్రవరి 26న జరిపిన తన తొలి కాబినెస్ సమావేశమే ఒక గొప్ప ఉదాహరణ. విశేషమేమంటే ఈ సమావేశాన్ని ప్రత్యక్షప్రసారం చేశారు. మీడియా ఈ సమావేశానికి హాజరు కావడమే కాకుండా ప్రశ్నలు అడగడానికి కూడా అవకాశం ఇచ్చారు. డోజ్, దాని లక్ష్యాల గురించి మంత్రి వర్గానికి చెప్పాలని మస్క్‌ను ట్రంప్ కోరారు.”

వాణిజ్య సంస్థకూ మధ్య ఉన్న తేడాను అది స్థిరపరిచింది. కానీ ట్రంప్, మస్క్‌లు సామర్థ్యం పెంచుతున్నాం అన్న ముసుగులో ఒక వాణిజ్య సంస్థకూ, ప్రభుత్వ పరిపాలనా పాత్రకూ మధ్య నున్న సరిహద్దులను చెరిపేస్తున్నారు.

**పరిపాలనను “సంస్కరించ”డానికి వ్యాపార ఎత్తుగడలు అమలు చేస్తున్న మస్క్**

ట్రంప్‌మస్క్ బృందం ఏం చేస్తున్నదో చెప్పడానికి అమెరికా అధ్యక్షుల వారు ఫిబ్రవరి 26న జరిపిన తన తొలి కాబినెస్ సమావేశమే ఒక గొప్ప ఉదాహరణ. విశేషమేమంటే ఈ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. మీడియా ఈ సమావేశానికి హాజరు కావడమే కాకుండా ప్రశ్నలు అడగడానికి కూడా అవకాశం ఇచ్చారు. డోజ్, దాని లక్ష్యాల గురించి మంత్రి వర్గానికి చెప్పాలని మస్క్‌ను ట్రంప్ కోరారు. ప్రభుత్వ విభాగాలు, ఏజెన్సీలు తమ కంప్యూటర్ వ్యవస్థలను మెరుగుపరుచుకోడానికి డోజ్ “సాంకేతిక సహకారం” అందిస్తుందని మస్క్ చెప్పారు. ఖర్చులు తగ్గించుకోడానికి గాను అనవసరమైన వాటినీ, సమర్థత లేని వాటినీ తగ్గించడం కూడా డోజ్ బాధ్యత అని చెప్పారు. దేశం 2 లక్షల కోట్ల డాలర్ల (వార్షిక) లోటుతో కొనసాగడం కష్టమని మస్క్ చెప్పారు. ప్రస్తుతం దేశం ఏడాదికి 1 లక్ష కోట్ల డాలర్ల వడ్డీ కడుతున్నదని ఆయన తెలిపారు. ఇది రక్షణ రంగ బడ్జెట్‌కు సమానమని చెప్పారు. అమెరికా గునుక ఇదే విధంగా ముందుకు పోతే దివాళా తీస్తుందన్నారు. ఇప్పటి నుండి సెప్టెంబర్ వరకు రోజుకు 400 కోట్ల డాలర్ల చొప్పున ప్రభుత్వ వ్యయంలో కోత విధించాలని ఆయన గట్టిగా సిఫార్సు చేశారు.

ప్రభుత్వం సంస్కరణలు చేయవద్దనీ, వ్యర్థాన్ని నివారించవద్దనీ, లేక అవినీతిని నిర్మూలించవద్దనీ ఎవరూ చెప్పరు. ఇది ప్రభుత్వం నిరంతరం చేయాల్సిన ప్రక్రియ. అయితే వారు తమ విధానాల పరిధిలో వాటిని చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ట్రంప్, మస్క్ ఆధ్వర్యంలో అమెరికాలో జరుగుతున్నదది కాదు. వ్యాపార వేత్త అయిన మస్క్ తన విస్తారమైన వ్యాపార సామ్రాజ్యంలో అమలు చేస్తున్న వ్యూహాలను, ఎత్తుగడలను పరిపాలనలో అమలు పరుస్తున్నారు. అమెరికా

# ట్రంప్ సుంకాలు కార్మికవర్గంపై భారాలు

**జెస్సికా కోర్బెట్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వాణిజ్య సుంకాల మూలంగా అమెరికాలోని ప్రతి కార్మికవర్గ కుటుంబం మీద ఏటా కనీసం కొన్ని వందల లేక వేల డాలర్ల భారం పడుతుంది అని ఆ దేశ పార్లమెంట్ సభ్యుడు డాన్ బేయర్ అధ్యక్షతన పనిచేస్తున్న సంయుక్త ఆర్థిక కమిటీ నివేదిక వెల్లడించింది. కారు, ఇల్లు వంటివి కొనుగోలు చెయ్యాలనుకుంటే ఈ భారం మరింత ఎక్కువ అవుతుందని ఆ కమిటీ అంచనా వేసింది. 'కెనడా, మెక్సికో, చైనా దేశాల మీద ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాల కారణంగా ప్రతి అమెరికన్ కుటుంబం మీద ఏటా సగటున 2,000 డాలర్ల అదనపు భారం పడుతుంది' అని బేయర్ ఒక ప్రకటనలో వెల్లడించాడు. 'ట్రంప్ ప్రకటించిన ఈ వాణిజ్య యుద్ధం అమెరికన్ ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తుంది, మార్కెట్ సంక్షోభానికి దారితీస్తుంది, నిత్యావసరాల కొనుగోళ్ల కోసం అమెరికన్‌లు మరిన్ని డాలర్లు చెల్లించాల్సి వస్తుంది' అని బేయర్ వివరించాడు.

'సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ పాలసీ రీసెర్చ్' సహ వ్యవస్థాపకుడు డీన్ బేకర్ అయితే ట్రంప్ వాణిజ్య సుంకాలు అమెరికన్ల మీద బేయర్ అంచనాలకు మించిన భారం మోపుతాయని వివరిస్తూ అందుకు సమర్థనగా యేల్ విశ్వవిద్యాలయంలోని 'బడ్జెట్ ల్యాబ్' వెలువరించిన గణాంకాలను ఉదహరించాడు. అలాగే ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలకు ప్రతిగా ఆయా దేశాలు ప్రతీకార సుంకాలు విధిస్తే పరిస్థితి ఏమిటనే అంచనాలు ఈ గణాంకాలలో పొందుపరచలేదని కూడా డీన్ బేకర్ వివరించాడు. 'ప్రతీకార సుంకాలు అమెరికన్ ఉత్పత్తిదారుల మీద తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఏ లక్ష్యం కోసం ట్రంప్ ఈ సుంకాలు విధించానని ప్రకటించాడో ఆ ప్రయోజనాలు నెరవేర్చడంలో ఈ సుంకాలు విఫలం అవుతాయని, అధికార బాధ్యతలు స్వీకరించిన రెండు నెలలోనే ట్రంప్ అమెరికన్ ఆర్థిక వ్యవస్థను మట్టికరిపిస్తున్నాడని, మాంద్యం నెలకొనే పరిస్థితులకు నెడుతున్నాడని బేకర్ ఆందోళన వ్యక్తం చేశాడు.

వినియోగదారుల మీదా, అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మీదా ప్రతికూల ప్రభావం చూపుతాయన్న నిష్ణాతుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి ట్రంప్ చైనా దిగుమతుల మీద 20 శాతం, మరో నెల తేడాలో కెనడా, మెక్సికో దేశాల దిగుమతుల మీద 25 శాతం అదనపు సుంకాలు విధించాడు. అమెరికాలోని అతిపెద్ద మూడు వాణిజ్య సంస్థలు ఈ సుంకాల విధింపును తప్పుపడతాయి. అలాగే ఆయా దేశాలు కూడా ట్రంప్ చర్యలకు ప్రతిచర్యలు ఉంటాయని హెచ్చరించాయి.

ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన కాలంలో (2016–2020)

ఫెడరల్ ప్రభుత్వాన్ని సంస్కరించే పనిని ఆయనకు అప్పగించారు. కాబినెట్ సమావేశానికి మస్క్ హాజరుకావడం దీన్ని తెలియజేస్తున్నది. అంతే కాదు ఆయన ఫిబ్రవరి 18న ట్రంప్‌తో కలిసి ఫాక్స్ న్యూస్ ఛానల్ జరిపిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ..."ఆయన చాలా బాగా పనిచేస్తారు. ఆయన తెలివితేటలతోబాటు ఆయన దగ్గర కొంతమంది యువ మేధావులు పనిచేస్తున్నారు. వాళ్లు అతని కన్నా నాసిరకం డ్రస్‌లు వేసుకుంటారు. నిజానికి వాళ్లు కేవలం టీ–షర్టులు మాత్రమే ధరిస్తారు. వాళ్లకి 180 ఐక్యూ ఉందన్న విషయం మీకు తెలీదు" అని చెప్పారు. మస్క్ సాంకేతిక సహకారానికి మించి చేస్తున్నారని ట్రంప్ చెప్పారు. "ఆయనో నాయకుడు. నిజంగా ఆయన నాయకుడు. పనిచేసి చూపిస్తాడు" అని కూడా ట్రంప్ చెప్పారు.

**❝ బ్రిటిష్ ప్రభుత్వం 1773 రెగ్యులేషన్ చట్టం చేసినప్పుడు ఎలాగైతే కొందరు వాటాదారులు మండిపడ్డారో అలాగే అమెరికా ప్రభుత్వంలోని కొందరు ఇప్పుడు మస్క్ పద్ధతుల పట్ల కోపంగా ఉన్నారు. గత వారం రోజుల్లో మీరు ఏం పనిచేశారో రాసి ఇవ్వండి అని ఇటీవల మస్క్ బృందం ఫెడరల్ ప్రభుత్వాధికారులకు ఒక లేఖ పంపింది. దీనికి స్పందించవద్దని విదేశాంగ శాఖ, మరికొందరు తమ అధికారులకు చెప్పారు. ❞**

బ్రిటిష్ ప్రభుత్వం 1773 రెగ్యులేషన్ చట్టం చేసినప్పుడు ఎలాగైతే కొందరు వాటాదారులు మండిపడ్డారో అలాగే అమెరికా ప్రభుత్వంలోని కొందరు ఇప్పుడు మస్క్ పద్ధతుల పట్ల కోపంగా ఉన్నారు. గత వారం రోజుల్లో మీరు ఏం పనిచేశారో రాసి ఇవ్వండి అని ఇటీవల మస్క్ బృందం ఫెడరల్ ప్రభుత్వాధికారులకు ఒక లేఖ పంపింది. దీనికి స్పందించవద్దని విదేశాంగ శాఖ, మరికొందరు తమ అధికారులకు చెప్పారు. తన ఉద్దేశం అధికారుల పనితీరును సమీక్షించడం కాదనీ, ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న అధికారులు నిజంగా బ్రతికి ఉన్నారా లేక చనిపోయారా అని తెలుసుకోడానికేనని మస్క్ ఇటీవల వివరణ ఇచ్చారు. జాతీయ భద్రత అంశాల్లోకి వెళ్ల దలుచుకోలేదని చెబుతూ అధికారులు భద్రతా కారణాల రీత్యా వివరాలు ఇవ్వనక్కరలేదని కాబినెట్ సమావేశంలో మస్క్ చెప్పారు.

అధ్యక్షుని ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు అమలు కావాలని నేను కోరుకుంటున్నాను అని మస్క్ చెప్పారు. సాంప్రదాయకంగా ఇటువంటి పర్యవేక్షణను ఏ దేశంలో నైనా రాజ్యం లేక ప్రభుత్వం చేస్తుంది, బయటి వ్యక్తులు కాదు. ఏ దేశంలోనైనా ప్రభుత్వం ఆయా శాఖలకు

కూడా ఇలానే చైనా మీద వాణిజ్య సుంకాలు విధించాడు. దాని మూలంగా 'చైనా మీద ట్రంప్ మోపాననుకున్న భారం అంతా అమెరికన్ దిగుమతిదారులు, వినియోగదారులు పూర్తిగా భరించాల్సి వచ్చింద'ని బేయర్ నివేదిక స్పష్టం చేసింది.

'దిగుమతుల మీద వాణిజ్య సుంకాలు విధించడం మూలంగా అమెరికా అనివార్యంగా స్వంత గడ్డమీద ఉత్పత్తి చెయ్యడం మొదలు పెట్టాల్సి వస్తుంది' అంటూ ట్రంప్ తన చర్యకు సమర్థనగా మరో వాదన ముందుపెట్టాడు. అలా జరిగినప్పటికీ అమెరికన్ ఉత్పత్తిదారులు తాము ఉత్పత్తి చేసే సరుకుల ధరలు పెంచక తప్పదు. ఎందుకంటే వాళ్ళు దిగుమతి చేసుకునే ముడిసరుకులు ఈ సుంకాల మూలంగా మరింత ప్రియం అయిపోతాయి. ఏతావాతా ఈ ధరల పెరుగుదల భారాన్ని వినియోగదారులు భరించాల్సి వస్తుంది అని బేయర్ నివేదిక విశ్లేషించింది.




ట్రంప్, మస్క్ కూటమి పాలనపై ఆగ్రహం : రాజధాని వాషింగ్టన్‌లో కార్మికుల నిరసన ప్రదర్శన

బడ్జెట్ ల్యాబ్ గణాంకాల ఆధారంగా అమెరికాలో ఏయే వస్తువుల / సరుకుల ధరలు ఏమేరకు పెరిగే అవకాశం ఉన్నదో కూడా బేయర్ కమిటీ నివేదిక వెల్లడించింది.

– కంప్యూటర్లు, ఫోన్‌లు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు 11 శాతం పెరిగే అవకాశం ఉంటుంది.

– దుస్తుల ధరలు 7.5 శాతం పెరిగే అవకాశం ఉన్నది.

– కార్లు తదితర మోటారు వాహనాలు, వాటి విడిభాగాలు 6 శాతం పెరిగే అవకాశం ఉన్నది.

– చమురు ధరలు 1.7 శాతం, పెట్రోలియం, బొగ్గు ఉత్పత్తులు 1.6 శాతం పెరిగే అవకాశం ఉన్నది.

– పచారీ సరుకుల ధరలు ఇప్పటికే వేతన కార్మికుల జేబుల్ని పిండేస్తున్నాయి. ఇవి మరింత పెరిగే అవకాశం ఉన్నది. బియ్యం ధరలు 4.4 శాతం పెరుగుతాయి. మొత్తంగా పచారీ ధరలు 3 శాతం పెరిగే అవకాశం ఉన్నది.

> **“ అమెరికా పరిపాలనపై మస్క్ ప్రభావం ఎంత ఉంటుందో ఇప్పుడే పూర్తిగా అంచనా వేయలేం. ఈస్టిండియా కంపెనీ కేవలం వ్యాపారానికే పరిమితమై ఉండకుండా సార్వభౌమ పరిపాలనా వ్యవహారాలు చేపట్టినందున దాని వ్యవహారాల్లో బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సహజం.కానీ ప్రభుత్వం, రాజకీయ క్రమం మౌలిక సంస్కరణలు చేయడంలో అసమర్థులైనాయి గనుక బయటి సంస్థలు వ్యాపార పద్ధతులు ఉపయోగించి ఆ కార్యక్రమాన్ని చేపట్టాయని ట్రంప్, మస్క్ సమర్థించుకుంటున్నారు. ఇది పూర్తిగా కొత్తది. ”**

కేటాయించిన డబ్బు ఖర్చు ఎలా చేశారు, ఖర్చు చేసేటప్పుడు నియమనిబంధనలు పాటించారా అన్న విషయాన్ని పర్యవేక్షించే అధికారాన్ని ఆడిటింగ్ అధికారులకు అప్పగిస్తారు. ఇప్పుడు ఆడిటింగ్ అధికారులు కూడా తమ సామర్థ్యానిక సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను మస్క్ బృందానికి ఇవ్వాల్సి వస్తోంది. ఇవన్నీ రాజ్యాంగ బద్ధమైన విధులు. కానీ ట్రంప్ ఈ విధులను ఒక వ్యాపారికి అప్పగించారు. అయితే ఆయనకు డోజ్ అధిపతి అనే ముసుగు తొడిగారు. కానీ వాస్తవానికి డోజ్ వర్తింప జేస్తున్న పద్ధతులకు ప్రేరణ ప్రభుత్వం నుండి కాదు, వ్యాపార వాణిజ్య వర్గాల నుండి వస్తున్నది.

ప్రజలు తనను ఎన్నికల్లో గెలిపించడం ద్వారా తాను చేపట్టిన ఫెడరల్ అధికార యంత్రాంగాన్ని సంస్కరించడం, అనవసరమైన కార్యక్రమాలను రద్దు చేయడం, ఇంధన ఉత్పత్తిని పెంచడం, వలసలను నిరోధించడం మొదలైన కార్యక్రమాలకు మద్దతిచ్చారని ట్రంప్ అంటున్నారు. అమెరికా పరిపాలనపై మస్క్ ప్రభావం ఎంత ఉంటుందో ఇప్పుడే పూర్తిగా అంచనా వేయలేం. ఈస్టిండియా కంపెనీ కేవలం వ్యాపారానికే పరిమితమై ఉండకుండా సార్వభౌమ పరిపాలనా వ్యవహారాలు చేపట్టినందున దాని వ్యవహారాల్లో బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సహజం. ఇది పరిపాలనకు సంబంధించిన మౌలిక సూత్రాల ఆధారంగా జరిగింది. కానీ ట్రంప్-మస్క్‌ల కార్యక్రమం వెనుకనున్న సమర్థింపు ఏమిటంటే ప్రభుత్వం, రాజకీయ క్రమం మౌలిక సంస్కరణలు చేయడంలో అసమర్థులైనాయి గనుక బయటి సంస్థలు వ్యాపార పద్ధతులు ఉపయోగించి ఆ కార్యక్రమాన్ని చేపట్టాయని. ఇది పూర్తిగా కొత్తది.

ప్రపంచ వ్యాపితంగా వ్యాపార సంస్థలకు ఇటువంటి సవాళ్లు ఎదుర్కొనే విలక్షణమైన మార్గాలు ఉన్నాయి కాబట్టి అటువంటి మార్గం ఎన్నుకున్న ట్రంప్‌మస్క్ బృందం ఎంతవరకు విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే. ఈలోగా భూమ్మీద అతి శక్తివంతమైన దేశంలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల ప్రపంచంలో కొంత గందరగోళం ఉన్నప్పటికీ యావత్ ప్రపంచం దీనివైపు చాలా ఆసక్తితో చూస్తున్నది.

**(అనువాదం : ఎస్. వెంకట్రావు)**

---

ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల విధానం మూలంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థతో పాటుగా రాష్ట్రాలు, స్థానిక సంస్థలను కూడా ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతీస్తాయి.

దక్షిణ అమెరికా, మధ్య ప్రాచ్య అమెరికన్ కౌంటీల (స్థానిక సంస్థల) ఆర్థిక వ్యవస్థలు ఎక్కువగా అంతర్జాతీయ వాణిజ్యం మీదనే ఆధారపడి ఉన్నాయి. అలాగే కొన్ని రాష్ట్రాలు కూడా ఇలా అంతర్జాతీయ వాణిజ్యం మీదనే ఆధారపడి ఉన్నాయి. ట్రంప్ చర్యల మూలంగా ఈ స్థానిక ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినిపోయే ప్రమాదం ఉన్నది.

ట్రంప్ ఇప్పటివరకు మెక్సికో, కెనడా, చైనా దేశాల మీద విధించిన అదనపు వాణిజ్య సుంకాల పర్యవసానాలను పరిగణనలోకి తీసుకోకుండా యూరోపియన్ యూనియన్ దేశాల మీద, అవసరం అయితే ఇతర ఏ దేశం మీద అయినా సరే అదనపు వాణిజ్యం సుంకాలు విధిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

బేయర్ సంయుక్త ఆర్థిక కమిటీతోపాటు వాణిజ్యం మీద 'వేస్ & మీన్స్' సబ్ కమిటీలో కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

పార్లమెంట్ (కాంగ్రెస్)లో ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్‌లు ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య సుంకాల విధానాన్ని నిలవరించ డానికి తగిన చట్టం తీసుకురావాలని వారికి నేను విజ్ఞప్తి చేసాను. అయితే రిపబ్లికన్‌లు నా విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ధరల పెరుగుదలకు, అంతిమంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినిపోయినా సరే ట్రంప్‌కు తోడుగా నిలవాలని వాళ్ళు భావిస్తున్నట్లు న్నారు అని బేయర్ వివరించాడు.

ఈ సబ్‌కమిటీలో డెమొక్రాటిక్ పార్టీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధితో కలిసి బేయర్ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాడు. – “అంతూదరీ ఉండని ఈ వాణిజ్య యుద్ధాల భారాన్ని అమెరికన్లు ఎంతమాత్రం భరాయించే స్థితిలో లేరు. బాధ్యతా రాహిత్యంగా విధించిన ఈ అదనపు సుంకాలమూలంగా ప్రభుత్వ రాబడి పెరుగుతుంది, ఆ రాబడి నుండి మరిన్ని పన్ను రాయితీలు పొందాలని సంపన్న వర్గాలు వేచి చూస్తున్నాయి' అంటూ ఆ సంయుక్త ప్రకటన ఘాటుగా విమర్శించింది.


అమెరికన్ కాంగ్రెస్ ఉభయ సభలలోనూ రిపబ్లికన్‌లు మెజార్టీగా ఉన్నారు. గత నెలలో ఈ ఉభయ సభలు ఆమోదించిన బడ్జెట్ ద్వారా లక్షలాది మంది కార్మికవర్గ కుటుంబాలు మేలు చేసే 'ఆహార సహాయ పథకం' నిధులకు తీవ్రంగా కోతపెట్టి 2017లో సంపన్న వర్గాలకు ట్రంప్ అందించిన పన్ను రాయితీల పరంపరకు తిరిగి స్థానం కల్పించారు.

రిపబ్లికన్‌లు పార్లమెంట్ సభ్యులుగా తమ అధికారాల గుర్తెరిగి, వ్యూహాత్మకంగా వ్యవహరించి స్థిర వాణిజ్య విధానాలకు రూపకల్పన చేసి అమెరికన్ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే దానికి ముందుకు రావాలి తప్ప ట్రంప్‌కు, మొత్తం ఫెడరల్ ప్రభుత్వ వ్యవస్థను దెబ్బకొట్టి ట్రంప్ శతకోటీశ్వర స్నేహితుడయిన ఎలాన్ మస్క్‌లకు సర్వాధికారాలు కట్టబెట్టి తమ చేతులు దులిపేసుకోవడం ఏమాత్రం వీలు కాదు– అని బేయర్ సాటి చట్టసభ సభ్యులకు పిలుపునిచ్చాడు. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

**(అనువాదం : కె.సత్యరంజన్)**

# మధ్య యుగాల్లో సాంకేతిక అభివృద్ధి : వృత్తులు, నేత

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి పూర్వసంపాదకులు

నూలు వస్త్రాలకు తల్లిగా భారత ఉప ఖండాన్ని ప్రపంచం అంతా పరిగణించేది. చరిత్ర కూడా దీనిని ధృవపరుస్తోంది. క్రీ.పూ. 4000 నాటి పత్తి విత్తనాలు మెహెర్‌ఘర్‌లో (ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉంది) లభించాయి. క్రీ.పూ.2000 నాటి రంగులద్దిన నూలు వస్త్రాల ముక్కలు మొహెంజదారోలో దొరికాయి. ఇప్పటివరకూ లభించిన అత్యంత ప్రాచీనమైన నూలు వస్త్రం క్రీ.పూ. 3000 నాటిది. అది జోర్డాన్‌లో లభించింది. ఆ తర్వాత ప్రాచీనమైనది మొహెంజదారోలో దొరికినదే. బ్రిటిష్ వారు వచ్చేనాటికి దేశంలో వ్యవసాయం తర్వాత అత్యంతపెద్ద వృత్తి నేత పరిశ్రమే.


నేతలో పత్తిని సేకరించడం, గింజలను వేరు చేసి ఏకడం, దారం వడకడం, వస్త్రాన్ని నేయడం అనేవి నాలుగు దశలు. ఒక్కో దశలోనూ సాంకేతికపరంగా చోటు చేసుకున్న పరిణామాలను చూద్దాం.

సేకరించి ఎండబెట్టిన పత్తి నుండి గింజలను వేరు చేయడానికి ఉపయోగించిన సాధనాన్ని చర్ఖీ అని హిందూస్తానీ భాషలో అనేవారు. ఒకదానికొకటి వ్యతిరేక దిశలో తిరుగాడే రెండు సమాంతర రోలర్లు చర్ఖీలో అమర్చుతారు. అరచేతులతో వాటిని అదమగానే అవి కదులుతాయి. ఆ రెండింటికీ మధ్య ఉంచిన పత్తి నుండి గింజలు వేరుపడతాయి. ఈ విధానం క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి పాటించేవారు.

ఆ తర్వాత ముళ్ళచక్రం అమర్చిన రోలర్లు వచ్చాయి. ఒక రోలర్‌ను తిప్పితే రెండవది ఆటోమేటిక్‌గా తిరుగుతుంది. ఈ సాధనం క్రీ.శ.13-17 శతాబ్దాల మధ్య కాలంలో దేశంలో వివిధ ప్రాంతాలకు విస్తరించింది. (చూ.దక్షిణాది లోని కాటన్ జిన్ నమూనా చిత్రం 2.2 )

రెండవ దశలో గింజలనుండి వేరు చేసిన పత్తిని ఏకుతారు. దాని వలన పత్తికాయలో దగ్గరగా అతుక్కుని వున్న పత్తి పోగులు దేనికదే విడివిడిగా అవుతాయి. అప్పుడే దానిని దారంగా వడకడం సాధ్యం. ఇలా ఏకడానికి విల్లు మాదిరిగా ఉండే సాధనాన్ని ఉపయోగించారు. బహుశా దీనిని చాలా పురాతనకాలంలోనే మన దేశంలోనే రూపొందించివుండాలి. బౌద్ధ జాతక కథల్లో దీని ప్రస్తావన ఉంది. ఇతర దేశాల్లో దీని ప్రస్తావన 13వ శతాబ్దం అనంతరమే కనిపిస్తుంది. తెలుగునాట దూదేకుల అన్న పేరుతో ఒక కులం కూడా ఉండడం చూస్తాం. (చూ. పత్తిని ఏకే విల్లు నమూనా చిత్రం 2.3)

దారం తీయడానికి వీలుగా పత్తిని సిద్ధం చేసిన తర్వాత మనకి మధ్య యుగాలలో అత్యంత ప్రభావం చూపిన కొత్త పనిముట్టుగా



రాట్నం రంగంలో కనిపిస్తుంది. మొట్టమొదటి యంత్రంగా దీనిని చెప్పవచ్చు. ఎందుకంటే ఇందులో కీలకమైన యాంత్రిక సూత్రాలు ఇమిడివున్నాయి. ఇరుసు ఆధారంగా తిరిగే చక్రం, దానిని తిప్పడానికి కావలసిన శక్తిని అందించే నిర్మాణం, ముఖ్యంగా దాని వాడకం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచగలడం... ఇవన్నీ యంత్రానికి సంబంధించిన లక్షణాలే. అవన్నీ రాట్నంలో ఉన్నాయి. (చూ. రాట్నం నమూనా చిత్రం 2.4)

ఈ రాట్నం ప్రవేశించకమునుపు తకిలీని ఉపయోగించి ఒక చేత్తో దానిని తిప్పుతూ రెండో చేత్తో దారం తీసే విధానం ఉండేది. రాట్నం ప్రవేశంతో దానికి ఒకే ఒక కదురు ఉన్నా ఆరు రెట్లు ఎక్కువ దారాన్ని తీయడం సాధ్యమైంది. కదురుల సంఖ్య పెరిగినకొద్దీ ఉత్పత్తి పెరుగుతూ వచ్చింది.

ఐతే చాలా మంది భావిస్తున్నట్టు మన దేశంలో రాట్నం చరిత్ర అంత పురాతనమైనదేమీ కాదు. క్రీ.శ. 12, 13 శతాబ్దాల నాటికి చెందిన రచనలలో కూడా తకిలీతో దారం తీసే వర్ణనలే కనిసిస్తున్నాయి. క్రీ.శ. 1350 నాటికవి ఇస్లామీ దక్కను భాషలో చేసిన రచనలో మొదటిసారిగా రాట్నం వడికే స్త్రీ వర్ణన కనిపించింది.

"చర్ఖా (రాట్నం) తో నూలు వడికే పనిలో నిమగ్నమైవున్న మహిళ పని ఎప్పుడూ మెరుగ్గానే ఉంటుంది

అది ఇచ్చే గౌరవంతో ఆమె తన బాధల్ని మరిచిపోగలుగుతుంది


పత్తి ఆమెకు సహచరి, దు:ఖం ఆమె చేతి పాత్ర

రాట్నం చేసే సవ్వడి ఆమె సంగీతం"

దారం వడికిన తర్వాత దశ నేయడం. చాలా కాలం వరకూ భారతదేశంలో వస్త్రాన్ని నేయడానికి భూమికి సమాంతరంగా అమర్చిన మగ్గాలనే ఉపయోగిస్తూవచ్చారు. నిలువుగా అమర్చిన దారాల మధ్య నుండి అడ్డంగా నేయవలసిన పోగును 'నాడి' ద్వారా పంపడం, అందుకు వీలుగా ఆ నిలువు దారాల మధ్య కాలితో తొక్కే మీటలద్వారా సందు కలిగించడం మనకి చేనేత మగ్గాలలో కనిపిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం చైనాలో తొలి శతాబ్దాలలోనే మొదలైనప్పటికీ మన దేశంలో దానిని ఉపయోగించినట్టు ఆధారాలు క్రీ.శ. 15 వ శతాబ్దం నాటివి మాత్రమే లభిస్తున్నాయి. (చూ. ఊహాచిత్రం 2.6)

కాశ్మీర్‌లో శాలువలు నేయడానికి ఉపయోగించే మగ్గాలు నిలువుగా అమర్చివుంటాయి.

> **“ క్రీ.శ. 13వ శతాబ్దం నాటికి భారత దేశం కమ్మరం పనిలో సాధించిన నైపుణ్యం ప్రపంచ ప్రసిద్ధికెక్కింది. ప్రత్యేకించి యుద్ధాలలో ఉపయోగించే ఖడ్గాలను తయారు చేయ డంలో మంచి పేరు పొందారు. ఉక్కు రాడ్లను కర్రబొగ్గుతో బాటు కరిగించి దానిని ఖడ్గంగా పోతపోసి అంచును వాడిగా చేసిన అనంత రం దానికి సారా పూత పూసేవారు. ఆధునిక కాలంలోనూ దాదాపు ఇదే పద్ధతిని అనుసరి స్తున్నారు. ”**




ఈ పద్ధతి బహుశా 14వ లేదా 15వ శతాబ్దం నుండీ వచ్చివుండాలి. వస్త్రాన్ని నేసిన తర్వాత దానికి రంగులు అద్దే విధానం ఒక తరహా అయితే, ముందే దారాలకు రంగులను అద్ది వాటిని రకరకాల డిజైన్‌లు వచ్చేలా నేయడం మరొక పద్ధతి. వస్త్రాలకు రంగులు అద్దడం అనేది క్రీ.శ.8వ శతాబ్దం నుండీ ఉంది. నీలిమందును ఉపయోగించి బట్టలకు రంగులు వేయడం అనేది క్రీస్తుపూర్వపు కాలం నుంచీ ఉండేది. కర్ర అచ్చులపై రకరకాల డిజైన్లను చెక్కి వాటిని రంగుల్లో ముంచి వస్త్రాలపై అద్దడం కూడా మధ్య యుగాలలోనే మొదలైంది. మన రాష్ట్రంలో ఈ సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తి చేసే కలంకారీ వస్త్రాలు ప్రసిద్ధం.

చాలా కాలం వరకూ భారత ఉపఖండం లో సూది ఉపయోగం ఉన్నట్టు కనిపించదు. క్రీ.శ.13వ శతాబ్దంలో మాత్రమే అది మొదలైంది. ఆ తర్వాత ఎంబ్రాయిడరీ పనులు పెంపొందాయి.

**గనుల తవ్వకం, లోహాల ఉత్పత్తి**

రాళ్ళ క్వారీలు పాతరాతియుగంనుండీ ఉన్నాయి. ఐతే రాగి, తర్వాత ఇనుము ఉపయోగంలోకి వచ్చాక భూమి లోతుల్లోకి పోయి ఖనిజాలను తవ్వి తీయడం అనేది భారతదేశం లో మౌర్యుల కాలానికి ఎక్కువగా అమలులోకి వచ్చింది. ఆ నాటికి ప్రపంచంలోకి తక్కిన దేశాల కన్నా మన ఉపఖండం ఈ విషయంలో ముందుండేది. దాదాపు 100 మీటర్ల లోతువరకూ తవ్వకాలు జరిపినట్టు దాఖలాలు ఉన్నాయి. ఎక్కువగా ఉప్పు కోసం తవ్వకాలు జరిగేవి. ఆ తర్వాత ఇనుప ఖనిజం తవ్వకాలు మొదలయ్యాయి. ఐతే దాదాపు 1800 సంవత్సరాల తర్వాత కూడా ఖనిజాల కోసం భూమిని లోతుగా తవ్వడంలో పెద్ద మార్పులు లేవు. ఎక్కువగా కొండలను తొలిచి రెండు, మూడు వందల గజాల వరకూ భూమికి సమాంతరంగా పోయిన గనులే ఉన్నాయి. దాదాపు 60 వేలమంది పనివారిని కొల్లూరు దగ్గర, 40 వేలమందిని గొల్లపల్లి దగ్గర పనిలో పెట్టిన గోల్కొండ వజ్రపు గనులు కూడా 10, 15 మీటర్లకన్నా లోతు ల్లోకి పోలేదు. బహుశా లోతుల్లోకి పోయినప్పుడు ఊరే నీటిని బైటకు తోడే ఏర్పాట్లు లేకపోవడం, దిగువనుండి తవ్విన మట్టి ని వెలుపలికి తెచ్చే ఏర్పా ట్లు లేకపోవడం ఇందుకు కారణం అయివుండొచ్చు.



**ఇనుము**

మన ఉపఖండం లోని రాళ్ళలో ఇనుము పాలు దాదాపు 60 శాతం వరకూ ఉన్నవి చాలా చోట్ల లభించేవి. ఇనుప ముక్కలు విడివిడిగా అక్కడక్కడా చాలా ముందునుంచీ లభ్యం అయినా, క్రీ.పూ. 800 నాటికి ఇనుపరాళ్ళను కరిగించి వాటిని బొగ్గుతో కలిపి పోత పోయడం తెలుసుకున్నారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నాటికి ఉక్కును తయారు చేసే విధానం తెలుసుకున్నారు. ఆనాటి భారతీయ లోహకారుల కౌశలానికి నిదర్శనంగా నేటికీ ఢిల్లీలో కుతుబ్‌మినార్ పక్కనే నిలిచివున్న మహరౌలీ స్తంభం క్రీ.శ.400 నాటిది. 12 మీటర్ల ఎత్తు, 40 సెంటీమీటర్ల కైవారం ఉన్న ఆ ఇనుప స్తంభం నేటికీ తుప్పు పట్టలేదు.

క్రీ.శ. 13వ శతాబ్దం నాటికి భారత దేశం కమ్మరం పనిలో సాధించిన నైపుణ్యం ప్రపంచ ప్రసిద్ధికెక్కింది. ప్రత్యేకించి యుద్ధాలలో ఉపయోగించే ఖడ్గాలను తయారు చేయడంలో మంచి పేరు పొందారు. ఉక్కు రాడ్లను కర్రబొగ్గుతో బాటు కరిగించి దానిని ఖడ్గంగా పోతపోసి అంచును వాడిగా చేసిన అనంతరం దానికి సారా పూత పూసేవారు. ఆధునిక కాలంలోనూ దాదాపు ఇదే పద్ధతిని అనుసరి స్తున్నారు. తుపాకులు, ఫిరంగులు వంటివి పోతపోయడానికి కావలసిన భారీ సైజు కొలిమిని ఏర్పాటు చేయడానికి తగిన సాంకేతికత మధ్య యుగాలలో మనకు లేకపోయింది. ఈ విషయంలో యూరప్ దేశాలు ముందడుగు వేశాయి.

ఐతే, వస్తువుకూ అది కర్ర గానీ, మరేదైనా గానీ, రంధ్రాలు చేయడానికి ఉపయోగించే 'బర్మా', కత్తులకు పదును పెట్టడానికి ఉపయోగించే ఆకురాయి చక్రం వంటివి మధ్య యుగాలలో వాడకంలో ఉండేవి. పిచికారీ చేయడానికి ఉపయోగించే సాధనాలు కూడా క్రీ.శ.16వ శతాబ్దానికి కానీ మన దేశంలోకి ప్రవేశించలేదు. అప్పుడు కూడా వాటిని హోలీ పండుగలలో రంగులు చల్లుకోడానికి ఉపయోగించారే తప్ప పనిముట్టుగా ఆ సాంకేతికతను ఉపయోగించే ప్రయత్నాలు జరగలేదు. (చూ. రంధ్రాలు చేయడానికి వాడే బర్మా ఊహాచిత్రం 2.8)

**తుత్తునాగం (జింక్), తగరం, రాగి**

వెండి, సీసం లోహాల కోసం తవ్విన ముడి

ఖనిజం నుండి ఆ రెండింటినీ వేరు చేసే ప్రయత్నంలోనే తుత్తునాగం లేదా జింక్ అనే లోహం కనుగొనడం భారతదేశంలో మొదట క్రీస్తుకు పూర్వకాలంలోనే జరిగింది. ఆ తర్వాత దానిని ఇత్తడి తయారీలో వినియోగించడం నేర్చుకున్నారు. కాని మొదట జింక్ ను కనుగొన్న జవార్ గనులు( రాజస్తాన్) ఆ తర్వాత దాదాపు వెయ్యి సంవత్సరాలు మూతబడ్డాయి. మళ్ళీ క్రీ.శ.13వ శతాబ్దంలో అక్కడి ఖనిజాన్ని ప్రధానంగా జింక్ కోసం తవ్వి తీయడం ప్రారంభించారు.

రాగి పాత్రలను వంటలలో ఉపయోగించడానికి వీలుగా వాటి లోపల తగరపు పూత పూయడం అనే పద్ధతి మన దేశానికి ఇస్లామిక్ దేశాలనుండి 13వ లేదా 14 వ శతాబ్దంలో వచ్చింది..

### బంగారం, వెండి

చాలా ప్రాథమికమైన, సరళమైన పని ముట్లతోనే బంగారు, వెండి వస్తువులను, ఆభరణాలను తయారు చేయడం మన దేశ కంసాలులకు చాలా కాలంనుండే తెలుసు. ఆభరణాలే కాకుండా బంగారు, వెండి నాణేలను కూడా టంకశాలలో ముద్రించేవారు. 17 వ శతాబ్దం నాటికి సూరత్‌లోని టంకశాల రోజుకు 30,000 వెండి రూపాయలను ముద్రించేది.

**“ చాలా ప్రాథమికమైన, సరళమైన పని ముట్లతోనే బంగారు, వెండి వస్తువులను, ఆభరణాలను తయారు చేయడం మన దేశ కంసాలులకు చాలా కాలంనుండే తెలుసు. ఆభరణాలే కాకుండా బంగారు, వెండి నాణేలను కూడా టంకశాలలో ముద్రించేవారు. 17 వ శతాబ్దం నాటికి సూరత్‌లోని టంకశాల రోజుకు 30,000 వెండి రూపాయలను ముద్రించేది. ”**




Figure 2.4 Spinning wheel: *Miftāhu'l Fuzalā*, 1469

### భవన నిర్మాణ రంగం

క్రీ.పూ.2500–1900 మధ్య కాలంలో విలసిల్లిన సింధు నాగరికత కాలంలో ఆధునిక కాలంలో ఉపయోగిస్తున్న కాల్చిన ఇటుకలను నిర్మాణాలలో ఉపయోగించారన్నది ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మొహంజొదారో లో బైటపడిన నిర్మానాలలో తోరణాకారాల భవన ద్వారాలను సైతం నిర్మించారు. ఐతే ఆ తర్వాత మళ్ళీ అశోకుడి కాలం వరకూ, అంటే క్రీ.పూ.3వ శతాబ్దం వరకూ మనకు చెప్పుకోదగ్గ నిర్మాణాలు ఎక్కడా జరిగినట్టు ఆధారాలు లేవు. అశోకుడి రాతి స్తంభాలు చాలా అద్భుతమైన పనితనాన్ని సూచిస్తాయి. అదే విధంగా బౌద్ధ ఆరామాల కోసం దక్షిణ బీహార్‌లో చాలా సొగసుగా చెక్కిన రాతి గుహలు కూడా అప్పటి నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. క్రీ.శ.7 వ శతాబ్దం తర్వాత రాతి పలకలను ఉపయోగించి భారీ నిర్మాణాలను చేపట్టడం కనిపిస్తుంది. రాతి స్తంభాలను పటిష్టంగా అమర్చి వాటిపై కౌశలంతో రాతి దూలాలను చెరోవైపు నుండీ పేర్చుకుంటూ చివరికి అవి ఒక దగ్గర కలిసేలా చేసి పైకప్పు నిర్మాణాన్ని పూర్తి చేయడం ఆ కాలంలో సాధించిన నైపుణ్యం. కొన్నిచోట్ల ఆ రాత దూలాలు జారిపోకుండా వాటిని ఇనుప కడ్డీలతో అతికించివుంచారు.

కమాను, విల్లువంపుగా ఉండేకప్పు, గుమ్మటం వంటి ఆకారాలను ఉపయోగించి భారీ నిర్మాణాలు చేయడం 13వ శతాబ్దంలో మొదలైంది. కాల్చిన ఇటుకలు, కంకరరాయి, సున్నం, జిప్సం వాడిన గానుగ సున్నాన్ని, లేదా చెక్కసున్నాన్ని ఈ నిర్మాణాణాలలో ప్రధానంగా ఉపయోగించారు. ఈ చెక్కసున్నం ఇటుకలను, రాళ్ళను గట్టిగా పట్టివుంచుతుంది. సింధునాగరికత కాలంలోనే జిప్సం వాడినట్టు ఆధారాలు ఉన్నా, ఆ తర్వాత చాలా కాలం వరకూ వాటిని నిర్మాణాలకు ఉపయోగించడం జరగలేదు. ప్రధానంగా డిల్లీ సుల్తానుల పాలనా కాలంనుండీ వీటిని వినియోగించే సాంకేతిక పద్ధతి విరివిగా ఉపయోగించడం, చరిత్రాత్మక కట్టడాలను నిర్మించడం జరిగింది. వీటి నిర్మాణాలలో రోమన్, ఇరాన్ దేశాల నైపుణ్యాలను ఉపయోగపెట్టుకున్నారు. భవనాల నిర్మాణానికి పెద్ద పెద్ద రాళ్ళను, పలకలను, రాతి దూలాలను వినియోగించే పాత పద్ధతి స్థానంలో ఈ కొత్త పద్ధతి రావడంతో 14, 15 శతాబ్దాలలో భవనాల నిర్మాణం బాగా ఊపందుకుంది. ఇప్పుడు ఇటుకలు, కంకర, చెక్కసున్నం ప్రధాన ముడిపదార్ధాలయ్యాయి కనుక నిర్మాణం ఖర్చు కూడా బాగా తగ్గింది.

కప్పీలను ఉపయోగించి బాగా బరువైన వస్తువులను పైకి లేపే పరికరం ఎత్తైన భవన నిర్మాణాలలో, నీటిలోనుండి వొడ్డుకు మరమ్మత్తులకోసం ఓడలను లేపడంలో ఉపయోగించడం ఈ కాలంలో మనకు కనిపిస్తుంది. ఈ పద్ధతిని భారీ ఓడలలో తెరచాపలను ఎత్తడానికి కూడా ఉపయోగిస్తారు. అశోకుడి శివాలిక్ స్తంభాన్ని అంతకు ముందున్న స్థలం నుండి ఫిరోజ్‌షా కోట్లాకు తరలించడానికి ఇటువంటి పరికరాన్నే క్రీ.శ.1367లో ఉపయోగించారు. ఆంధ్ర తీరంలో నర్సాపురం ఓడరేవులో కుతుబ్‌షాహీ నౌకకు మరమ్మత్తులు చేయడానికి ఒడ్డుకు చేర్చినప్పుడు కూడా ఇటువంటి పరికరాన్నే ఉపయోగించారు. ఇది పూర్తిగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానం మీదనే ఆధారపడిన పరికరం. (చూ. ఊహాచిత్రం 2.12)

# వాళ్ల లాభాలా, మన ప్రాణాలా?

# గ్రీస్‌ను కుదిపేస్తున్న ప్రజాఉద్యమం

**ఎస్ వెంకట్రావు**



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

గ్రీసు చరిత్రలో కనీవినీఎరుగని ప్రజా పోరాటం అక్కడ జరుగుతోంది. దేశంలోని కార్మికవర్గం, యువత మొత్తం పోరాటంలో పాల్గొనడంతో బూర్జువా రాజకీయ వ్యవస్థ కుదుపులకు గురవుతోంది. విచిత్రమేమంటే రెండేళ్ల క్రితం జరిగిన ఒక రైలు ప్రమాదం ఈ ప్రజా ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తోంది. అయితే ప్రభుత్వ పనితీరు ముఖ్యంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ప్రవచిత నయా–ఉదారవాద విధానాల పట్ల నిరసన ఈ ప్రజా ఉద్యమం వెనుక అంతర్లీనంగా పనిచేస్తున్నది.

ఫిబ్రవరి 28వ తేదీన గ్రీసు చరిత్రలో ఎరుగనంతటి గొప్ప ప్రజా సమీకరణను చూసింది. దేశవ్యాపితంగా దాదాపు 200 నగరాల్లో 15 లక్షల మందికి పైగా ప్రజలు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కార్మికవర్గం ఆ రోజున దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె నిర్వహించింది. ప్రదర్శనల్లో కార్మికులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, వృత్తిదారులు, రైతులు, యువకులు, కళాకారులు ఇంకా అనేక రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు. పిల్లల్ని ఎత్తుకుని తల్లిదండ్రులు ప్రదర్శనల్లో కిలోమీటర్ల దూరం నడిచారు. ఈ ప్రదర్శనకు ముందు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజా నిరసనలు జరిగాయి.

రెండు సంవత్సరాల క్రితం గ్రీసు రాజధాని ఏథెన్స్‌లో తెంపి వద్ద జరిగిన ఒక ఘోర రైలు ప్రమాదంలో చనిపోయిన 57 మందికి న్యాయం చేయాలనీ, ఈ ఘోరానికి కారణాన్ని కప్పిపుచ్చి నేరస్తులను వెనకేసుకొస్తున్న ప్రభుత్వ వైఖరి నశించాలని నిరసిస్తూ రెండేళ్ల తరువాత ఇంత పెద్ద సమీకరణ జరిగింది.

2023 ఫిబ్రవరి 28న గ్రీసు రాజధాని ఏథెన్స్ నుండి తెస్సలోనికి నగరానికి ప్రయాణిస్తున్న ఒక ప్యాసింజర్ ట్రైన్ ఎదురుగా వస్తున్న గూడ్సు రైలును ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. 57 మంది చనిపోగా అనేక మంది క్షతగాత్రులైనారు. ప్యాసింజర్ రైలును గూడ్సు బండి వస్తున్న మార్గంలోకి పంపడంతో ఈ ప్రమాదం జరిగింది. దేశ చరిత్రలో అతి ఘోరమైన ఈ ప్రమాదం మొత్తం దేశ ప్రజలను కలచి వేసింది. కనీస శిక్షణ లేని స్టేషన్ మాస్టర్ పొరపాటు వల్ల ఈ ప్రమాదం జరిగినప్పటికీ దీని వెనుక కేవలం మానవ తప్పిదమే కాకుండా లోతైన వ్యవస్తాగత లోపాలు దాగున్నాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఇయు ఒత్తిడి వల్ల గ్రీకు ప్రభుత్వం రైల్వేలను ప్రయివేటీకరించడం దీని వెనుకనున్న ప్రధాన కారణం. ప్యాసింజర్ రైలు ప్రయాణించిన మార్గంలో సిగ్నలింగ్ పనిచేయడం లేదు, అక్కడ రిమోట్ మోనిటరింగ్ గానీ, భద్రతా వ్యవస్థలు గానీ నెలకొల్పలేదు. కమ్యూనికేషన్ వ్యవస్థ సమస్యాత్మకంగా ఉంది. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే 21వ శతాబ్దంలో ఒక యూరోపియన్ యూనిన్ దేశంలో ఉండాల్సిన విధంగా రైల్వే వ్యవస్థ లేదు.

దాంతో సహజంగానే గ్రీకు ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించారు. 2015లో ప్రయివేటీకరణ చేసిన తరువాత దేశంలోని రైల్వే వ్యవస్థ ఎందుకింతలా పాడై పోయింది అనేది మొదటి ప్రశ్న. 2015లో గ్రీసు పెద్ద రుణ సంక్షోభంలో కూరుకుపోయిన తరువాత అక్కడ పెద్ద రాజకీయ సంక్షోభం కూడా ఏర్పడింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, యూరోపియన్ బ్యాంకులు కలిసి గ్రీకు ప్రభుత్వం చేత పొదుపు చర్యల పత్రంపై సంతకాలు చేయించుకుని రుణం మంజూరు చేశాయి. అందులో భాగంగా అన్ని రంగాలతో పాటు రైల్వేలను ప్రయివేటీకరించడం ప్రారంభించారు.

ప్రయివేటీకరణ అంశంలోపాటు యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్‌తో అనుసంధానించే రైల్వే భద్రతా వ్యవస్థను నెలకొల్పడంలో సంవత్సరాల తరబడి జరిగిన జాప్యాన్ని కూడా ప్రజలు ప్రశ్నించారు. ఈ మొతం వ్యవహారం మానవ తప్పిదం అని తప్పుకున్న ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు తీవ్రమైనాయి. ముఖ్యంగా మరణించిన వారిలో అత్యధికులు 35 ఏళ్ల లోపు యువత కావడంతో వారి తల్లిదండ్రులు ప్రమాదానికి కారణాలనూ, బాధ్యులనూ తేల్చాలని రెండేళ్లుగా పెద్ద ఎత్తున దేశ వ్యాపిత క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్‌లో వారు రిటైర్డ్ రైల్వే నిపుణులనూ, పౌర సమాజాన్ని పెద్ద ఎత్తున భాగస్వాములను చేశారు. దీనికి ప్రతిపక్షాల, ముఖ్యంగా గ్రీసు కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాల మద్దతు లభించింది. దాంతో ఉద్యమం తీవ్రతరమై గత కొద్ది మాసాలుగా దేశ వ్యాపిత ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు జరుగుతూ వచ్చాయి.

ఈ మొత్తం క్యాంపెయిన్‌కు పరాకాష్టగా గత ఫిబ్రవరి 28న, ప్రమాదం జరిగి రెండో వార్షికం సందర్భంగా దేవవ్యాపిత నిరశన ప్రదర్శనలు, కార్మివర్గ సార్వత్రిక సమ్మె జరిగాయి. కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనడంతో అన్ని పరిశ్రమలు, పని ప్రదేశాలు స్తంభించిపోయాయి. షాపులు, పాఠశాలలు, కళాశాలు, యూనివర్సిటీలు ఇతర ఉన్నత విద్యాసంస్థలు మూతపడ్డాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

ఈ ప్రజా పోరాటం పాలక వర్గాన్ని పెద్ద కుదుపు కుదిపింది. ఫిబ్రవరి ప్రదర్శనల తరువాత ప్రభుత్వంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మార్చి 7న మితవాద ఎన్‌డి ప్రభుత్వంపై పార్లమెంటులో అవిశ్వాసం ప్రవేశ

పెట్టారు. 300 సభ్యులున్న దిగువ సభలో ప్రభుత్వం కొన ఊపిరితో బతికి బయట పడింది. పాలక పక్షానికి 157 మంది మద్దతివ్వగా 136 మంది వ్యతిరేకంగా ఓటేశారు. ఏడుగురు ఓటింగుకు గైర్హాజరయ్యారు.

ఫిబ్రవరి సమ్మె, ప్రదర్శనలకు ముందూ, తరువాత కూడా గ్రీసులో వేలాది మందితో ప్రదర్శనలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. 'నిజం కావాలి', 'న్యాయం కావాలి' అన్న నినాదంతో ఇటీవలి వారాల్లో అనేక నగరాలు, పట్టణాల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ఏథెన్స్‌లో రైల్వే కార్మికులు జరిపిన ప్రదర్శనపై పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. నగరంలోని సింటాగ్మా చౌక్ వద్ద జరిగిన యువజన ర్యాలీపై పోలీసులు లాఠీ చార్జీ చేశారు.

ఈ ప్రజాఉద్యమంలో కార్మికవర్గ పాత్రనూ, వారి సమ్మె పోరాటాన్నీ మరుగున పడేయడానికి బూర్జువా రాజకీయ పార్టీలు, వారి ట్రేడ్‌యూనియన్ సంస్థలూ ముఖ్యంగా బూర్జువా ప్రచార సాధనాలు తీవ్రంగా పయత్నించాయి. ఫిబ్రవరి 28 ప్రజాసమీ కరణలో భాగంగా కార్మికవర్గం దేశవ్యాపిత సమ్మె నిర్వహించాలని దేశంలో అతిపెద్ద వామపక్ష ట్రేడ్ యూనియన్ అయిన 'పామె' పిలుపు నిచ్చింది. గ్రీకు కమ్యూనిస్టు పార్టీ సమ్మెకు మద్దతిచ్చింది. ఒకవైపు బూర్జువా ప్రతిపక్ష పార్టీలు ప్రజానిరసనల్లో పాల్గొంటూనే మరోవైపు కార్మిక సమ్మెను అడ్డుకోడానికి శతవిధాలా ప్రయత్నించాయి. దేశంలో పెద్ద పార్టీలయిన ఎన్‌డి, పాసోక్, సిరిజాలకు అనుబంధంగా ఉన్న ట్రేడ్ యూనియన్లు సమ్మెకు తాము వ్యతిరేకమని ప్రకటించాయి. ప్రభుత్వం బెదిరింపులకు దిగింది. పని ప్రదేశాల్లో యజమానులు కార్మికులను వేధించారు. కొన్ని చోట్ల సమ్మెకు వెళ్లే కార్మికులను పనుల్లోనుండి తొలగించారు. ఇంకోవైపు కార్మికుల సమ్మె డిమాండ్లను వక్రీకరించేందుకు బూర్జువా ప్రచార యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నించింది. ఇదంతా పనికి మాలిన వారు చేసే పనికి మాలిన పని అన్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న దేశం సమ్మె వల్ల అల్లకల్లోలం అవుతుందని బెదిరించారు. చివరికి ఫిబ్రవరి 28 దగ్గరకొస్తున్న కొద్దీ సమ్మెకు మద్దతిచ్చే ట్రేడ్ యూనియన్ కార్మికులపై దాడులకు కూడా దిగారు. అయినప్పటికీ ఈ దుష్ప్రచారం, బెదిరింపులు, వేధింపులు, దాడులు అన్నిటినీ

❝ ఈ ప్రజాఉద్యమంలో కార్మికవర్గ పాత్రనూ, వారి సమ్మె పోరాటాన్నీ మరుగున పడేయడానికి బూర్జువా రాజకీయ పార్టీలు, వారి ట్రేడ్‌యూనియన్ సంస్థలూ ముఖ్యంగా బూర్జువా ప్రచార సాధనాలు తీవ్రంగా పయత్నించాయి. ఫిబ్రవరి 28 ప్రజాసమీ కరణలో భాగంగా కార్మికవర్గం దేశవ్యాపిత సమ్మె నిర్వహించాలని దేశంలో అతిపెద్ద వామపక్ష ట్రేడ్ యూనియన్ అయిన 'పామె' పిలుపు నిచ్చింది. గ్రీకు కమ్యూనిస్టు పార్టీ సమ్మెకు మద్దతిచ్చింది. ❞



ఫిబ్రవరి 28న ఏథెన్స్ నగరంలో జరిగిన మహాప్రదర్శనలో అగ్రభాగం

అదిగమించి కార్మికులు పెద్ద ఎత్తున సార్వత్రిక సమ్మె చేశారు.

ఈ కార్మిక - ప్రజా ఉద్యమంలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ), గ్రీసు కమ్యూనిస్టు యూత్ (కెఎన్ఇ) ప్రముఖ పాత్ర నిర్వహించాయి. కమ్యూనిస్టు పార్టీ, దాని యువజన విభాగాలు తమ శక్తినంతటినీ కూడదీసి కార్మిక-ప్రజా ఉద్యమం జయప్రదం కావడానికి కృషి చేశాయి. తమ సభ్యులు, శ్రేయోభిలాషులంతా ఉద్యమంలోనూ, సమ్మెలోనూ పాల్గొనడమే కాకుండా ఎక్కడికక్కడ నిర్వహణలో భాగస్వాములైనాయి. రైలు ప్రమాదానికి కారణాలను వెలికి తీసి, దీనికి బాధ్యులు ఎంతటి పెద్ద స్థానంలో ఉన్నా వారికి

> **"నిజానికి గ్రీకు ప్రజానీకం ఇంత పెద్ద ఎత్తున కదలడానికి వెనుక ఇంకా లోతైన కారణం ఉంది. 2008 పెట్టుబడి దారీ సంక్షోభం గ్రీసు ఆర్థిక వ్యవస్థను రుణ సుడిగుండంలో పడేసింది. దాని నుండి బయటపడ్డానికి ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఇయు ఇచ్చిన మందు సంక్షోభాన్ని మరింత పెంచింది. పొదుపు చర్యల పేరుతో కార్మి కుల జీతాలకు కోతపెట్టారు. సంక్షేమానికి సున్నం పూశారు. భవిష్య త్తు పట్ల వారిలో తీవ్రమై అభద్రతా భావం ఏర్పడింది. వీటి వ్యక్తీకరణే తింపి రైలు ప్రమాద ఉద్యమ రూపంలో ముందుకొచ్చింది."**

శిక్షలు పడేంతవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తా మనీ, పార్లమెంటులో కూడా దీనిపై నిలదీస్తా మని గ్రీసు కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో ప్రకటించింది.

2009 నుండి అధికారంలో కొనసాగు తూ వస్తున్న ఎన్‌డి, పాసోక్, సిరిజా ప్రభుత్వాల విధానాలే ఈ రేల్వే దుర్ఘటనకు కారణమని ఈ ఘటనపై జరిగిన దర్యాప్తులో వెల్లడయిన సమాచారం తెలియజేస్తోంది. అప్పటి నుండి ఇయు మార్గదర్శకత్వంలో ప్రభుత్వాలు రైల్వేలను ముక్కలు ముక్కలుగా చేసి ప్రయివేటు వారికి అమ్మేయడం ప్రారంభించాయి. (ఇది అచ్చంగా మన మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలా లేదా!) ముఖ్యంగా రైల్వేల్లో అత్యంత లాభదాయకమైన భాగాలను ప్రయివేటు వారికి అమ్మేశారు. లాభదాయకం కాని విభాగాలు ప్రభుత్వ చెంత ఉండిపోయాయి. రైల్వే భద్రతకు సంబంధించిన ప్రాజెక్టులు చేపట్టకుండా మూలన పడేశారు. రైల్వే కార్మికుల సంఖ్యను తగ్గించేవారు. ముఖ్యమైన విభాగాలను తగినతం సిబ్బంది లేకుండానే నడిపేస్తున్నారు. ఉన్న కార్మికులు, ఉద్యోగులపై పనిభారం పెరిగిపోయింది. దాంతోపాటు గ్రీకు రైల్వేలను నాటోకు చెందిన ప్రమాదకరమైన ఆయుధాలు, ఇతర పదార్థాల రవాణాకు ఉపయోగించడం ఎక్కువైంది.

రానున్న కాలంలో "ఈ ఉద్యమంలోపల మా కృషి, కార్యకలాపాలు, చొరవను మరింత ముందుకు తీసుకుపోతాం'' అని గ్రీకు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. పార్లమెంటు లోపల కూడా అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుని గ్రీకు ప్రజలు, యువత భవిష్యత్తును కాపాడ్డానికి ప్రయత్నిస్తాం అని పేర్కొంది.

నిజానికి గ్రీకు కార్మికులు, యువత, మొత్తం ప్రజానీకం ఇంత పెద్ద ఎత్తున కదలడానికి బయటకు కనిపిస్తున్న కారణం తింపి రైలు ప్రమాదం అయినప్పటికీ దీని వెనుక ఇంకా లోతైన కారణం ఉంది. 2008 పెట్టుబడి దారీ సంక్షోభం గ్రీసు ఆర్థిక వ్యవస్థను రుణ సుడిగుండంలో పడేసింది. దాని నుండి బయటపడడానికి ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఇయు ఇచ్చిన మందు సంక్షోభాన్ని మరింత పెంచింది. 2009 నుండి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయోగాలు ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహాలను మిగిల్చాయి. పొదుపు చర్యల పేరుతో కార్మికుల జీతాలకు కోతపెట్టారు. సంక్షేమానికి సున్నం పూశారు. భవిష్యత్తు పట్ల వారిలో తీవ్రమై అభద్రతా భావం ఏర్పడింది. వీటి వ్యక్తీకరణే తింపి రైలు ప్రమాద ఉద్యమ రూపంలో ముందుకొచ్చింది.

నిజానికి గ్రీసులోనే కాదు అనేక యూరోపియన్ దేశాల్లో పెట్టుబడిదారీ సంక్షోభం వేస్తున్న భారాలపై కార్మిక వర్గం, ప్రజలు తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక దేశాల్లో పచ్చి మితవాద రాజకీయ పక్షాలు ఈ అసంతృప్తిని ఉప యోగించుకుని ప్రజల్లో వైషమ్యాలు రెచ్చగొట్టి అధికారంలోకి వస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రధాన మైన ప్రతిపక్షాలుగా ముందుకొస్తున్నాయి. తమ కష్టాలకు ఆఫ్రికా, ఆసియా, తూర్పు యూరప్ దేశాల నుండి వచ్చే వలస దారులే కారణమని చెబుతూ వలసదారుల వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. ఇస్లామోఫోబియా (ముస్లింలందరినీ ఉగ్రవాదులుగా ముద్రవేసే తత్వం) యూరప్‌లో పరాకాష్టకు చేరుకున్నది. అదే సమయంలో మరోవైపు కార్మికవర్గంపైనా, ప్రజలపైనా పాలకవర్గాలు వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలు కూడా జరుగుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా యూరప్‌లో గ్రీసు అటువంటి ప్రజా పోరాటాలకు కేంద్రంగా ఉంది. రైలు ప్రమాదం నేపథ్యంలో తాజాగా వెల్లువెత్తిన ప్రజా నిరసన పోరాటం కూడా ఇందులో భాగమే. ❋

---

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# ప్రజలను మోసం చేయటానికే 2047 అభివృద్ధి జపం



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ.కోటిరెడ్డి

దేశాన్ని అభివృద్ధి పథంలో పయనింప జేస్తున్నామని, 2047 నాటికి భారత ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో రెండవదిగా మారుతుందని మోడి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. స్వాతంత్ర్యం సాధించిన శత వార్షికోత్సవ సంవత్సరమైన 2047 నాటికి దేశాన్ని స్వయం పోషకంగా, సంపన్నవంతంగా మారుస్తామని మోడి చెబుతున్నాడు. దీనిని సాధించటానికి వ్యవసాయం, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, పెట్టుబడులు, ఎగుమతులు వునాదిగా ఉంటాయని ప్రకటించారు. 2047 నాటికి దరిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలిస్తామనీ, 100 శాతం పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామనీ, అందరికీ అందుబాటులో ఉండే విధంగా సమగ్రంగా ఆరోగ్య పరిరక్షణ, 100 శాతం కార్మికులను నిపుణులుగా చేస్తామనీ, రైతులు మన దేశాన్ని ప్రపంచ ఆహార పాత్రగా మారుస్తామనీ ప్రకటిస్తున్నారు. 2025-26 బడ్జెట్‌లో కూడా ఈ అంశాలను ప్రస్తావించారు.

"బుద్ధులు భూములేలుతుంటే రాతలు గాడిదలు కాశాయన్న" చందంగా ప్రభుత్వ చర్యలు ఉంటున్నాయి. తాము చెబుతున్న లక్ష్యాలను సాధించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి మారుగా, జరుగుతున్న కొద్దిపాటి అభివృద్ధిని కూడా దెబ్బతీసే విధానాలను అనుసరిస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధిని సాధించటం ప్రజల ఆర్థికాభివృద్ధి, హక్కుల అమలుతో ముడిపడి ఉంది. ప్రభుత్వం వాటిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నది.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి కావస్తున్నది కాబట్టి ఇప్పటి వరకు అనుసరించిన విధానాలకు భిన్నమైన విధానాలను ఇప్పుడు అనుసరిస్తారనుకుంటే అది భ్రమే అవుతుంది. ఇప్పటి వరకు మోడి ప్రభుత్వం అనుసరించిన విధానాలు ప్రజలను మరింతగా దోపిడి చేయటంతో పాటు ప్రభుత్వరంగ పరిశ్రమలు, ప్రజల ఆస్తులను కూడా కార్పొరేట్లు స్వాధీనం చేసుకోవటానికి అవకాశం కల్పించాయి. సంక్షేమ పథకాలు అనవసరమైనవని, ప్రజలను సోమరులను చేస్తాయని ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్‌లు బ్యాంకుల నుండి తీసుకున్న 16.35 లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేశారు. అంతకు పది రెట్లు వివిధ రాయితీల రూపంలో కార్పొరేట్లకు అందజేశారు. మరోవైపున వివిధ వర్గాల ప్రజలపై విపరీతమైన భారాలను మోపుతున్నారు. మొత్తంగా చూసినపుడు ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉంది.

### ప్రజల అభివృద్ధే దేశాభివృద్ధి

దేశంలోని ప్రజల అభివృద్ధి ద్వారానే ఒక దేశాభివృది సాధ్యమౌతుంది. మనదేశం లో ప్రధానమైన వ్యవసాయ రంగంలో రైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితులు దిగజారిపోతున్నాయి. వ్యవసాయంలో పెడుతున్న ఖర్చులకు, వారికి వస్తున్న ఆదాయాలకు పొంతన లేకపోవటంతో రైతులు అప్పుల పాలవుతు న్నారు. రుణభారంతో అనేకమంది రైతులు, కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆహారోత్పత్తిని పెంచటం ద్వారా మన దేశాన్ని ప్రపంచ ఆహార పాత్రగా మారుస్తామని చెబుతున్న ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవటం లేదు. తాము పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధరలు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనేది రైతుల ప్రధానమైన డిమాండ్లలో ఒకటిగా ఉంది. ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకోవటం లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు సి2+50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సును పక్కన పెట్టింది. వ్యవసాయో త్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించటం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

అభివృద్ధి కార్యక్రమాల కోసం స్వాధీనం చేసుకున్న భూములకు తగిన పరిహారం ఇవ్వటంతో పాటు వారికి పునరావాసం, పునర్నిర్మాణం కల్పించాలని యుపిఎ హయాంలో చేసిన చట్టాన్ని రద్దు చేయటానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. రైతులు, ప్రజల నుండి ప్రతిఘటన ఎదురుకావటం, ప్రతిపక్షాలు వ్యతిరేకించ టంతో ఆ ప్రయత్నంలో విఫలమైంది. వ్యవసాయాన్ని, రైతులను కార్పొరేట్ల దయా దాక్షిణ్యాలకు వదిలివేయటానికి చేసిన మూడు నల్ల చట్టాలకు రైతుల ప్రతిఘటన, వారికి దేశప్రజల నుండి లభించిన మద్దతు వలన ఆ చట్టాలను రద్దు చేయక తప్పలేదు. ఇప్పుడు ఆ నల్ల చట్టాలలోని అంశాలను వివిధ రూపాలలో అమలు చేయటానికి పూనుకున్నది.

వ్యవసాయ కార్మికుల పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. పనిరోజులు తగ్గిపోతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగటం లేదు. ఉపాధి హామీ చట్టం ద్వారా వారికి దొరుకుతున్న పని దినాలను తగ్గించటానికి ప్రభుత్వం పూనుకున్నది. దేశవ్యాపితంగా ఉన్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించటానికి అవసరమైన నిధులను

> **"పరిశ్రమల పేరుతో ప్రభుత్వం తీసుకుని పెట్టుబడిదారులకు అప్పగించిన భూములలో పదోవంతు భూమిలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామనే పేరుతో పెట్టుబడిదారులు భూములు తీసుకుని, ఆ భూములను బ్యాంకులలో హామీగా పెట్టి కోట్లాది రూపాయలు రుణం తీసుకుంటున్నారు."**

కేటాయించటం లేదు. గత సంవత్సరం కేటాయించిన 86,000 కోట్ల రూపాయలు మాత్రమే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం కేటాయించింది. గత సంవత్సరం బకాయిలు 9,754 కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, అదే మొత్తాన్ని కేటాయించటం అంటే వాస్తవంలో గత సంవత్సరం కన్నా అంత మొత్తం తగ్గించి కేటాయించటమే అవుతుంది. గత సంవత్సరం అవసరమైన మొత్తంతో పోల్చుకుంటే 19,508 కోట్ల రూపాయలు తక్కువగా కేటాయించింది. ఈ విధంగా కేటాయింపులను తగ్గించటం 10 కోట్లమందికి పైగా ఉన్న వ్యవసాయ కార్మికులు, చట్టం ద్వారా ఉపాధి పొందుతున్న వారి జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

**పరిశ్రమల పేరుతో భూములు కాజేస్తున్న పారిశ్రామికవేత్తలు**

దేశంలోనూ, ఉభయ తెలుగు రాష్ట్రాల లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామనే పేరుతో పెట్టుబడిదారులు రైతుల భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తున్నది. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం తీసుకుని పెట్టుబడిదారులకు అప్పగించిన భూములలో పదోవంతు భూమిలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామనే పేరుతో పెట్టుబడిదారులు భూములు తీసుకుని, ఆ భూములను బ్యాంకులలో హామీగా పెట్టి కోట్లాది రూపాయలు రుణం తీసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల పరిశ్రమల పేరుతో తీసుకున్న భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వాస్తవంగా పరిశ్రమలు పెడతామని, నిరుద్యోగులు, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆర్భాటం చేసిన ప్రాంతాలలో పరిశ్రమలు రాకపోవటంతో భూములు పంటలు లేకుండా పర్రలుగా ఉన్నాయి. దానితో కొత్తగా ఉపాధి రాకపోగా, రైతులు, కూలీలకు ఉన్న ఉపాధి కూడా పోయింది.

పరిశ్రమలు వచ్చిన ప్రాంతాలలో కూడా స్థానికంగా ఉన్న నిరుద్యోగులు, యువతకు ఉపాధి శూన్యంగా ఉన్నది. పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారులు స్థానికు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా బీహార్, యుపి, రాజస్థాన్ తదితర చోట్లనుండి అత్యంత తక్కువ కూలికి వలస కూలీలను తీసుకువచ్చి పనులు చేయించు కొంటున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి లోని నిర్మాణ పనులలో స్థానిక కూలీలకు పనులు కల్పించకుండా వలస కూలీలతో ప్రభుత్వం పనులు చేయించింది. పరిశ్రమలలో పనులలో పెట్టకోక, వ్యవసాయంలో ఉన్న ఉపాధి పోవటంతో తెలుగు రాష్ట్రాలలో ఎప్పుడూ వలసలు పోని ప్రాంతాల నుండి కూడా కూలీలతో పాటు రైతులు కూడా వలసలు పోతున్నారు. వలస పోయిన ప్రాంతానికి వీరు దూరప్రాంతం వారు కావటంతో అక్కడ వీరికి అతి తక్కువ కూలి ఇస్తున్నారు. యుపి, బీహార్‌ల నుండి వలస వస్తున్న కూలీలు మనప్రాంతంలో ఎటువంటి దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారో మనప్రాంతం నుండి ఇతర రాష్ట్రాలకు వలసలు పోయిన రైతు, కూలీలు కూడా అటువంటి పరిస్థితులనే అనుభవిస్తు న్నారు. పరిశ్రమల పేరుతో రైతుల నుండి భూములు తీసుకోవటం స్థానికులను "రెంటికి చెడ్డ రేవడి"గా చేస్తున్నది.

ఇపుడు కొన్నిచోట్ల రైతుల నుండి భూములు తీసుకొని, పరిహారం చెల్లించకుండా సంవత్సరానికి 30 వేల రూపాయల కౌలు చెల్లిస్తామంటున్నారు. ఆ కౌలుకు కూడా గ్యారంటీ ఇవ్వటానికి ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. పూర్తిగా పెట్టుబడిదారులపై ఆధారపడి భూములను లీజుకు ఇస్తే, వారు కౌలు చెల్లించకపోతే రైతుల పరిస్థితి ఏమిటి? కౌలు చెల్లించలేదు కాబట్టి భూముల నుండి వెళ్ళిపొమ్మని రైతులు వారిని భూముల నుండి తొలగించగలరా? కౌలుకు తీసుకున్న భూములను హామీగా పెట్టి, పెట్టుబడిదారులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు గడువు తీరేలోగా వారు చెల్లిస్తారా? చెల్లించకపోతే బ్యాంకులు ఆ రుణాలను భూయజమానులైన రైతుల నుండి వసూలు చేయటానికి పూనుకుంటాయా? అసలు పెట్టుబడిదారులు ఆ భూములను ఖాళీ చేయకుండా, గడువు తర్వాత కూడా ఆ భూములలోనే కొనసాగితే వారిని రైతులు భూముల నుండి తొలగించగలరా? కౌలు చెల్లింపుకే గ్యారంటీ ఇవ్వని ప్రభుత్వాలు పెట్టుబడిదారుల నుండి భూములను స్వాధీనం చేసుకొని, యజమానులైన రైతులకు తిరిగి ఇవ్వటానికి పూనుకుంటాయా? ఇటువంటి సమస్యలు పరిష్కరించకుండా 2047 నాటికి అద్భుతాలు సాధించటం సాధ్యమౌతుందా?

**కార్మికవర్గంపై తీవ్రమైన అణచివేత**

బిజెపి ప్రభుత్వం కార్మికవర్గంపై దారుణమైన అణచివేతను కొనసాగిస్తున్నది. అనేక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను హరిస్తున్నది. కార్మికచట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించింది. వాటిని అమలు చేయటానికి తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నది. ఈ లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు సమ్మె హక్కు, వేతనాల పెంపు, పని పరిస్థితులు, ఇతరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనలు చేయటానికి అవకాశాలు ఉండదు. యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారు.

మోడి ప్రభుత్వ అండ చూసుకొని పెట్టుబడిదారులు కార్మికవర్గంపై జులుం ఛలాయిస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది గంటల పనిదినం ఉన్నప్పటికీ, 9 నుండి 10 గంటలు పని చేయిస్తున్నారు. కార్మికులు, ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి చెబితే, ఎల్ ఆండ్ టి సుబ్రహ్మణ్యన్ 90 గంటలు పని చేయాలని చెప్పాడు. కార్మికులు, ఉద్యోగులపై పనిభారం పెంపు, వేతనాలు పెంచకుండా ఉండే విషయంలో పెట్టుబడిదారులు చేస్తున్న కుతంత్రాలకు మోడి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది.

పరిశ్రమలు, సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పట్ల పెట్టుబడిదారులు వ్యవహరిస్తున్న తీరు ఇది. ఇక ఏ పని దొరికితే ఆ పని చేసే కార్మికులు – గిగ్ వర్కర్స్ – ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారికి నిర్దిష్టమైన పనిగంటలు,

వేతనాలు, చట్టపరంగా వర్తించే అంశాలు, సామాజిక సంక్షేమం తదితరాలు ఏమీలేవు. ఏరోజు కారోజు పని చూయించే యజమాని దయా దాక్షిణ్యాలపై ఆధారపడి వారి జీవితాలు ఉంటున్నాయి. ఎక్కువ రోజులు ఏ పనీ దొరక్కపోవటంతో వారు కనీసావసరాలు తీర్చుకోవటానికి కూడా ఆదాయం రాక ఇబ్బంది పడుతున్నారు.

### సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలుచేయాలి

ఈ విధంగా దేశ ప్రజానీకంలో 80 శాతం మందికి పని, జీవితానికి గ్యారంటి లేని పరిస్థితులలో అభివృద్ధిని సాధించాలంటే వారి జీవితాలకు ప్రభుత్వం కనీసమైన గ్యారంటీలు కల్పించటానికి పూనుకోవాలి. సాధారణ ప్రజల జీవితాలకు ఎటువంటి గ్యారంటీ లేకుండా ఉండాలనీ, రేపటి జీవితంపై భయం కల్పిస్తే ఎంత తక్కువ వేతనానికైనా పనిచేస్తారనీ పెట్టుబడిదారులు, ప్రభుత్వం భావిస్తున్నాయి. కానీ వాస్తవమేమిటంటే తాము చేస్తున్న పని వలన తమకు కనీస జీవనానికి అవసరమైన వేతనం లేదా జీతాలు కూడా రావనీ, తమ పని ఫలితాన్ని పెట్టుబడిదారులు కాజేస్తున్నారని భావిస్తే ప్రజలు ఉత్సాహంతో పనిచేయరు. తాము చేసేపని తమకోసమని, దాని వలన తాము, దేశం అభివృద్ధి చెందుతాయని భావిస్తే చేసే పనిలో అద్భుతాలు సాధిస్తారు.

అందువలన ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేని విధానాలను పక్కన పెట్టి, ప్రజానుకూల విధానాలను అమలుచేయటానికి పూనుకుంటేనే అభివృద్ధి సాధ్యమౌతుంది. కేవలం దేశ, విదేశీ పెట్టుబడిదారులే అభివృద్ధిని సాధిస్తారని భావిస్తే వారు అభివృద్ధి చెందుతారు మినహా ప్రజలు, దేశాభివృద్ధి జరగదు. ఎగుమతులు పెంచుతామనేది లక్ష్యాలలో ఒకటిగా పెట్టుకున్న ప్రభుత్వం ట్రంప్ మన దిగుమతులపై టారిఫ్‌లు పెంచుతామని ప్రకటిస్తుంటే నోరు మెదపటం లేదు. భారీ పరిశ్రమలు, విదేశీ సంస్థలకు అనుకూలమైన విధానాలు అనుసరిస్తూ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు రక్షణలు, రాయితీలను తగ్గిస్తున్నది. దానితో చిన్న మధ్య తరగతి పరిశ్రమలు భారి పరిశ్రమలు, విదేశీ దిగుమతులతో పోటికి తట్టుకోలేక దివాళా తీస్తున్నాయి. పెట్టుబడులను ఆకర్షిస్తామన్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. వచ్చే పెట్టుబడులలో ఎక్కువ భాగం స్టాక్ మార్కెట్ లేదా ప్రభుత్వరంగ పరిశ్రమలను కబళించటానికి వస్తున్నాయి. ఈ రెండింటి వలన జరిగే అభివృద్ధి శూన్యం. ఉత్పత్తిరంగంలోకి పెట్టుబడులు వస్తే, కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే అభివృద్ధి జరుగుతుంది. కానీ ఒకవైపున ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, జీవన ప్రమాణాలు దిగజారుతుంటే కొత్త పరిశ్రమలలో తయారైన సరుకులను ఎవరు కొనుగోలు చేస్తారు? ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది కాబట్టే మన అభివృద్ధి అంచనాలను అందుకోలేకపోవటం, జిడిపి తగ్గిపోవటం జరుగుతున్నది.

వీటిని పరిష్కరించి, సరైన ఆర్థిక విధానాలను అనుసరిస్తేనే అభివృద్ధి సాధ్యమౌతుంది. కేవలం బడా పెట్టుబడిదారుల అభివృద్ధినే దేశాభివృద్ధిగా భావించినంత కాలం దేశం వెనుకబడే ఉంటుంది. ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను పరిష్కరించటానికి, ప్రజలు ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధిని సాధించటానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకున్నపుడే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధి నిరంతరం జరగుతుండాలి గాని "చూడండి. 2047 నాటికి ఆర్థికాభివృద్ధిలో ప్రపంచంలో రెండవ స్థానానికి చేరతాం. అప్పటి వరకు ఇబ్బందులు పడుతుండండి. కష్టాను ఎదుర్కొండి" అని చెప్పటం ప్రజలను మోసం చేయటమే. 2047 నాటికి అభివృద్ధి పేరుతో మోడి ప్రభుత్వం అటువంటి మోసానికే పూనుకున్నది. ప్రజలు ఈ మోసాన్ని గ్రహించకపోతే వారి జీవితాలు మరింత దుర్భరంగా మారతాయి. దీనికి వ్యతిరేకంగా పోరాడితేనే ప్రజలు, దేశం అభివృద్ధిని సాధించటం సాధ్యమౌతుంది. ప్రజలు తమ జీవితాలను, దేశాన్ని అభివృద్ధి చేయటం కోసం మోడి ప్రభుత్వ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

❋

"సాధారణ ప్రజల జీవితాలకు ఎటువంటి గ్యారంటీ లేకుండా ఉండాలనీ, రేపటి జీవితంపై భయం కల్పిస్తే ఎంత తక్కువ వేతనానికైనా పనిచేస్తారనీ పెట్టుబడిదారులు, ప్రభుత్వం భావిస్తున్నాయి. కానీ వాస్తవమేమిటంటే తాము చేస్తున్న పని వలన తమకు కనీస జీవనానికి అవసరమైన వేతనం లేదా జీతాలు కూడా రావనీ, తమ పని ఫలితాన్ని పెట్టుబడిదారులు కాజేస్తున్నా రని భావిస్తే ప్రజలు ఉత్సాహంతో పనిచేయరు."



భారత దేశంలో కార్మికవర్గానికి కనీస హక్కులు కనుమరుగవుతున్నాయి

# భారత్‌లో ప్రజా సైన్సు ఉద్యమం ముందున్న సవాళ్లు

**రఘునందన్**

పెట్టుబడిదారీ యుగంలో సైన్సు ఎంతగా అభివృద్ధి చెందిందంటే మన ముందున్న అన్ని రకాల ప్రశ్నలకు సైన్స్, సాంకేతికతలు ఖచ్చితమైన తుది సమాధానాలు కలిగి ఉన్నాయన్న అభిప్రాయం విస్తృత ప్రజానీకంలో కలిగింది. 'శాస్త్రీయ మైనది' 'అంటే రుజువుకు నిలిచేది, అన్ని ప్రశ్నలకు సమాధానాలు కలిగి ఉండేది, ఎప్పుడూ ప్రయోజనకరమైన ఫలితాలు అందించేదని భావనలు వ్యాపించాయి.

కానీ రెండవ ప్రపంచయుద్ధం ముగింపు దశలో అమెరికా హిరోషిమా, నాగసాకిపై అణుబాంబులు వేసిన తరువాత ఈ అభిప్రాయాల్లోని కొన్ని భావనలు ఉపసంహరించబడ్డాయి. ఈ దారుణం తరువాత కూడా హైడ్రోజన్ బాంబుల తయారీని శాస్త్రవేత్తలే ప్రశ్నించారు. అమెరికా అణుసంస్థల్లో బాధ్యతలు నిర్వహించే జె. రాబర్ట్ ఓపెన్ హైమర్, లియో స్జిలార్డ్ వంటి శాస్త్రవేత్తలు సైతం అణు బాంబుల ప్రయోగాన్ని తప్పు పట్టారు. శాస్త్రీయ సమాజంలోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అణ్వాయుధాల వంటి ఆవిష్కరణల ఫలితంగా ఏర్పడే పరిణామాలపై శాస్త్రవేత్తల్లో నైతిక ప్రశ్నలు కూడా లేవనెత్తాయి. అనంతర కాలంలో అనేక రకాల నూతన సాంకేతికతపై కూడా ఇటువంటి ప్రశ్నలే వచ్చాయి. ఆహారపంటల్లో జన్యు మార్పిడి, క్లోనింగ్, నానో టెక్నాలజీ వంటి అంశాలు అనేక నూతన నైతిక ప్రశ్నలను, పూర్తిగా తెలియని ఫలితాల గురించి భయాందోళనలు కలిగించాయి. శాస్త్ర సమాజంలోని వారుకూడా ఈ సాంకేతికతల వల్ల భవిష్యత్తులో చోటుచేసుకునే ఫలితాల గురించి పూర్తిస్థాయిలో సమాచారం లేదన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా అంశాల్లో మరింత సమాచారం తెలుసుకునే వరకు, తదుపరి పరిశోధనలు నిలిపివేయాలని భావించారు. దీనినే 'ప్రికాషనరీ ప్రిన్సిపల్'గా పిలిచేవారు.

ప్రభుత్వాల్లో పారదర్శకత లోపించడం, కార్పొరేట్ల కుతంత్రాలు, గత కాలపు చేదు అనుభవాల కారణంగా కొన్ని సైన్స్ పరిశోధనలపై ప్రజానీకంలో తీవ్రస్థాయిలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అణ్వాయుధాల భయాలు, సృష్టి అంతానికి సంబంధించిన భావనలు ప్రపంచ ప్రజానీకాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. వీటిని పరిగణలోకి తీసుకున్నప్పుడు సైన్స్ ఫలాలు అన్నివేళలా మానవాళికి సానుకూలంగానో, వారి పట్ల ప్రేమాస్పదంగానో ఉండవలసిన అవసరం లేదని స్పష్టమవుతుంది. అదే విధంగా సమాజంలో అందరికీ సమానంగా సైన్స్ ఫలాలు అందవన్న విషయం కూడా అర్థమవుతుంది. అమెరికా పర్యావరణ ఏజెన్సీలో పనిచేస్తున్న రాచెల్ కార్సన్స్ అనే శాస్త్రవేత్త ప్రచురించిన 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకంలో డిడిటిని విచ్చలవిడిగా పిచికారి చేయడం వల్ల, సాధారణ పురుగుమందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిం చారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాగుతున్న పర్యావరణ ఉద్యమానికి ఇది ప్రేరణగా చెప్పవచ్చు. అమెరికా, బ్రిటన్‌లలో థాలిమైడ్ వినియోగంతో వికలాంగ శిశువుల జననం, జపాన్‌లో నీటిలో పాదరసం కలవడం, భారతదేశంలో భోపాల్ గ్యాస్ ప్రమాదం, పూర్వ సోవియట్ యూనియన్‌లో చెర్నోబిల్ అణువిద్యుత్ ప్లాంటు విపత్తు, ఇప్పుడు ఉక్రెయిన్‌లోనూ, పాలస్తీనాలోనూ చోటుచేసుకుంటున్న పరిణామాలు సైన్స్, సాంకేతిక తలపై ప్రజల విశ్వాసాలను తీవ్రంగా దెబ్బ తీశాయి. జీవ వైవిధ్యం కోల్పోవడం, భూ సారం క్షీణించడం, ఆహార పదార్థాలలో పురుగు మందుల అవశేషాలు పెరగడం హరిత విప్లవ ఫలితాలను ప్రశ్నార్థకంగా మార్చివేశా యి. భారీ ప్రాజెక్టులు, మైనింగ్ కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో ప్రజలను స్థానభ్రంశం చేయ డంతో పాటు, పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. శిలాజ ఇంధనాలు ముఖ్యంగా పెట్రోలియం ఆధారిత శక్తి, మానవాళిని భయోత్పాతాలకు గురిచేసే వాతావరణ మార్పులకు కారణమౌతోంది. కార్పొరేట్ల అత్యాశ, ప్రభు త్వాల దుర్నీతులు సైన్స్, సాంకేతికతలను దుర్వినియోగ పర్చి, మానవాళికి ప్రమాదకరంగా మారుస్తున్న తీరుకు ఇవి నిదర్శనాలు.

ఈ నేపథ్యంలో ఆధునిక సైన్స్, సాంకేతికతలే ఈ దుష్పరిణామాలకు కారణమన్న వాదనలు బలంగా ముందు కొచ్చాయి. పౌరసమాజంలోని విమర్శకులు, మేధావులు, ప్రజలను ప్రభావితం చేసే పలువురు ఇతరులు ఈ తరహా విమర్శలు చేశారు. ఇది పాశ్చాత్య దేశాలకు చెందిన ప్రముఖులచే ప్రేరణ పొందిన భావన! సైన్స్. సాంకేతికతల దుర్వినియోగం, దుష్పరిణామల వంటి అంశాలపై పెద్ద ఎత్తున చర్చలు జరగడమే దీనికి కారణం. నిజానికి సైన్స్‌ను, దాని ఆవిష్కరణలను ప్రజాపక్షం చేయడం, ప్రజలలో ఆ మేరకు చైతన్యం నింపడమే ఇప్పుడెదురవుతున్న ఈ సవాళ్లను ఎదుర్కొనే సరైన మార్గాలు.

సైన్స్, సాంకేతికతలకు సంబంధించి స్పష్టమైన, భిన్నమైన దృక్పథం ప్రస్తుతం అవసరం. సైన్స్ ప్రజలకు శత్రువు కాదు. పెట్టుబడిదారీ విధానం, ఆ విధానంలోని వర్గ సమాజం యొక్క సహజ లక్షణమే నిజమైన సమస్య. సైన్స్‌ను సామాన్య ప్రజలకు, పర్యావరణానికి వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా మార్చింది పెట్టుబడిదారి విధానమే. సైన్స్, సాంకేతికతలకు సంబంధించి నిర్ణయాత్మక పాత్ర నుండి సామాన్య ప్రజలను, కష్టజీవులను ఉద్దేశపూర్వకంగా వేరు చేసింది కూడా ఆ విధానమే! ప్రజా సైన్స్ ఉద్యమ దృక్పథం ఇదే!

నేడు మూడవ సహస్రాబ్దిలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, బయో కెమిస్ట్రీ, రవాణా, కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇలా

వివిధ రంగాల్లో ప్రతి పది సంవత్సరాలకోసారి గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సాంకేతికతలో చాలా వేగంగా మార్పులు వస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఒంటరిగా నివసించే కొన్ని సమూహాలపై తప్ప, దాదాపు అందరి జీవితాలపైనా ఈ మార్పుల ప్రభావం పడుతోంది. అదే సమయంలో సమకాలిన సామాజిక నిర్మాణం అంటే ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వహిస్తున్న పెట్టుబడిదారీ సమాజం తన గత రూపాల నుండి వేగంగా రూపాంతరం చెందుతోంది. పెట్టుబడిదారి లక్షణాలుగా ఉన్న జాతీయ - రాజ్యపెట్టుబడి దారీ విధానం, వలసవాదం, ప్రారంభ సామ్రాజ్యవాదం వంటివి ఇప్పుడు గతానికి పరిమితమైనాయి. స్వభావ రీత్యా కొన్ని దేశాలు, బహుళజాతి సంస్థలు, ఇతర పెద్ద సంస్థలు పరిశోధనలకు నిధులు సమకూర్చడం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమం యొక్క చారిత్రక పరిణామాన్ని దృష్టిలో ఉంచుకుని సైన్స్-సాంకేతికత, సమాజానికి మధ్య ఉన్న సంబంధపు ముఖ్య లక్షణాలను, ప్రజా సైన్స్ ఉద్యమం యొక్క పాత్ర, పనితీరును చర్చిద్దాం:

**సైన్సు - సాంకేతికత**

సైన్స్, టెక్నాలజీల మధ్య విభజన గీత గీయడం ప్రస్తుతం సాధ్యం కాదన్న విషయం మనం గమనించవచ్చు. సైన్సును సాంకేతికత అనుసరించిందని చెప్పడం కానీ, లేదా నిర్దిష్ట పద్ధతుల్లో సైన్స్ సూత్రాలను వర్తింపచేయడం ద్వారా శాస్త్రీయ ఆవిష్కరణలు తొలుత వచ్చాయని చెప్పడం కానీ నిజం కాదు. విజ్ఞాన శాస్త్రంలో ఏ సమయంలోనైనా ఒకే ఒక ఆధిపత్య సిద్ధాంతం, నమూనా ఉంటుంది. సాంకేతికతలో అయితే బహుళ ఎంపికలు అందుబాటులో ఉంటాయి. ఉదా: సౌరశక్తి, బయోమాస్, హైడ్రోపవర్ తదితరాలు. ప్రస్తుత కాలంలో సైన్స్ టెక్నాలజీతో విడదీయరాని విధంగా ముడిపడింది. సాధారణ ప్రయోగాల ద్వారా దానిని కొనసాగించడం ఇక ఎంత మాత్రం సాధ్యం కాదు. అధునాతన సాంకేతికతలతో అత్యంత ఆధునిక పరికరాలు ప్రస్తుతం సైన్స్‌కు అవసరం. సైన్స్‌లోని వివిధ శాఖలు, వాటిమధ్య ఉన్న విభజన రేఖలు అస్పష్టంగా మారుతున్నాయి. కార్పొరేట్లు ఖర్చు చేస్తున్న నిధులు పరిశోధనలపైనా, నూతన ఆవిష్కరణలపైనా వారికి అనుకూలమైన ఫలితాల కోసం శాస్త్రీయపరిశోధనలపై ఒత్తిడి చేస్తున్నాయి. సామాజిక వ్యవస్థలో సాంకేతికత ఎప్పుడూ భాగంగానే ఉంటుంది. అలాగే, దాని

> **"ఏ వ్యాధికి ఔషధం అభివృద్ధి చేయాలో, దానికెంత ఖర్చు చేయాలో నిర్ణయించేదెవరు? ప్రపంచవ్యాప్తంగా ప్రజలు చనిపోతున్నా ఔషధకంపెనీలు ఆ వ్యాధుల మీద పరిశోధనలు చేయడానికి నిధులు ఖర్చు చేయవు. తమకు లాభాలు తెచ్చిపెట్టే మందులను మాత్రమే తయారు చేస్తాయి. దాన్ని తయారు చేయడానికి ఇతరులను అనుమతించవు. వీటన్నింటిని పర్యవేక్షించి, నియంత్రించాల్సిన ప్రభుత్వాలు బహుళ జాతి కార్పొరేట్ క్రీడలో భాగస్వాములువుతున్నాయి."**

యజమాని, వినియోగదారుని మధ్య నిర్దిష్ట సంబంధాల్లో కూడా పాలుపంచుకుంటుంది. ప్రస్తుతం సైన్స్ విషయంలో కూడా ఇది నిజమవుతోంది. భారీ ప్రయోగశాలలు, పరికరాలు, గణనకు సంబంధించిన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లు లేకుండా జన్యుశాస్త్రంలో ప్రయోగాలు, జిఎం పంటల ఆవిష్కరణ సాధ్యమయ్యేది కాదు.

సైన్స్, సాంకేతికతల ప్రయోజనాలు నేడు జనాభాలోని విస్తారమైన వర్గాలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటిని అందిపుచ్చుకోవడంలో పెద్ద ఎత్తున అంతరాలు నెలకొన్నాయి. ఆదాయాల ప్రాతిప దికన ఈ అంతరాలు ఏర్పడ్డాయి. పెట్టు బడిదారి విధానానికి అవసరమైన విధంగా ఆధునిక గాడ్జెట్‌లు, సెల్‌ఫోన్‌లు, ఇతర ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. కానీ, లాభాలు మాత్రం కొద్ది కార్పొరేట్లకే పరిమితం అయ్యాయి. ఈ రంగం అపరిమితంగా పురోగతి సాగిస్తూ, అందరి జీవితాలను ప్రభావితం చేస్తున్నప్పటికీ దాని దుష్ప్రభావాలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. ప్రభుత్వాల సమర్థవంతమైన నియంత్రణ లేకపోవడం, సంస్థలల్లో పారదర్శకత లేకపో వడం వల్ల ఈ పరిస్థితి మరింత దిగజారింది. అందువల్ల సైన్స్, సాంకేతికతలు సమాజం మధ్య పెద్ద ఎత్తున అంతరం కూడా పెరుగుతోంది. ఉత్పత్తులు ప్రజలకు చేరుతున్నప్పటికీ వాటి ప్రయోజనాలు, ప్రమాదాల గురించి వారికి తెలిసింది చాలా తక్కువ. ప్రస్తుతం పరిశోధనలు ఎక్కువగా ప్రభుత్వ సంస్థల కంటే, పెద్ద కార్పొరేట్ సంస్థలు వాటి ఆధ్వర్యంలో పనిచేస్తున్న విశ్వవిద్యాలయాల ప్రయోగశాలలోనే జరుగుతున్నాయి. పెన్సిలిన్, లేదా ఎక్స్‌రే ఆవిష్కర్తలు తమ పరిశోధనల నుండి లాభం పొందాలని ఆలోచించలేదు. కానీ, నేడు పేటెంట్లు లేకుండా దాదాపుగా ఎటువంటి పరిశోధనలు జరగడం లేదు. మానవజాతి ఉమ్మడి వారసత్వమైన విజ్ఞానాన్ని పెట్టుబడిదారి విధానం ప్రైవేటీకరించింది. మానవత్వం ఏమాత్రం లేని కార్పొరేట్ సంస్థల చేతుల్లో అది చిక్కుకుంది. ఆ సంస్థలు తమ లాభాలు పెంచుకోవడం కోసమే పనిచేస్తున్నాయి.

ఏ పరిశోధనలను చేయాలో నిర్ణయించేది ఎవరు? జన్యు మార్పిడి చేసిన పంటలను ఎక్కడ ప్రవేశపెట్టాలో నిర్ణయించేది ఎవరు?

ఏ వ్యాధికి ఔషధం అభివృద్ధి చేయాలో, దానికి ఎంత ఖర్చు చేయాలో నిర్ణయించేది ఎవరు;? ప్రపంచవ్యాప్తంగా ప్రజలు చనిపోతున్నా ఔషధకంపెనీలు ఆ వ్యాధుల మీద పరిశోధనలు చేయడానికి నిధులు ఖర్చు చేయవు. తమకు లాభాలు తెచ్చిపెట్టే మందులను మాత్రమే తయారుచేస్తాయి. వాటిని కూడా తక్కువ ధరకు విక్రయించవు. అదే ఔషధాన్ని తయారు చేయడానికి ఇతరులను అనుమతించవు. వీటన్నింటిని పర్యవేక్షించి, నియంత్రించాల్సిన ప్రభుత్వాలు బహుళ జాతి కార్పొరేట్ క్రీడలో భాగస్వాములువుతున్నాయి. మరి ప్రజలకు అత్యంత అవసరమైన ఈ పనిని చేసేది ఎవరు?

**ప్రజా సైన్స్ ఉద్యమం (పిఎస్ఎం)**

ప్రజా సైన్స్ ఉద్యమానికి చరిత్ర కేటాయించిన విధి ఇది. సామాజిక శక్తులతో రూపొందించబడిన సైన్స్ కొన్ని సంస్థాగత నిర్మాణాలతో నియంత్రించబడుతూ, ఉన్నత వర్గాల వారికి ప్రయోజనం కలిగిస్తుందని మనం ఇప్పటికే చూశాం. ఈ ప్రక్రియలు ఆ కాలంలోని నిర్దిష్ట సామాజిక నిర్మాణం, లేదా ఉత్పత్తి ప్రక్రియలో జరుగుతాయని, అందువల్ల బడా బూర్జువా నేతృత్వంలోని ఆధిపత్య వర్గాలచే నడపబడుతాయని మనం అర్థం చేసుకున్నాము. నేడు కార్పొరేట్ సంస్థలు ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా పనిచేస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, ఆచరణలో బడా కార్పొరేట్లకు సేవకులుగా మారుతు న్నాయి. కాబట్టి సైన్స్

> **"ప్రజా సైన్స్ ఉద్యమం.. సైన్స్- సాంకేతికతల్లోని అభివృద్ధిని, పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. అవి సమాజంపైనా ముఖ్యంగా శ్రామిక ప్రజలు, అట్టడుగు వర్గాలు, మధ్య తరగతి ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్నది అర్థం చేసుకోవాలి. కార్పరేట్ సంస్థల రహస్య ప్రయోగశాలల నుండి సైన్స్, సాంకేతికతలను తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అప్పుడు మాత్రమే ప్రజలు వారి జీవితాలపై పెద్ద ఎత్తున ప్రభావం చూపే సైన్స్, టెక్నాలజీని అర్థం చేసుకుని స్పందించగలరు."**

అండ్ టెక్నాలజీకి సంబంధించిన మన దృక్పథం ఈ ఆధిపత్య తరగతులకు, వారి సామాజిక పాత్రకు వ్యతిరేకంగా జరుగుతున్న వర్గపోరాటంతో జతకావాలి.

ప్రజా సైన్స్ ఉద్యమం.. సైన్స్-సాంకేతికతల్లోని అభివృద్ధిని, పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. అవి సమాజంపైనా ముఖ్యంగా శ్రామిక ప్రజలు, అట్టడుగు వర్గాలు, మధ్య తరగతి ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయన్నది అర్థం చేసుకోవాలి. కార్పరేట్ సంస్థల రహస్య ప్రయోగశాలల నుండి సైన్స్, సాంకేతికతలను తిరిగి ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అప్పుడు మాత్రమే ప్రజలు వారి జీవితాలపై పెద్ద ఎత్తున ప్రభావం చూపే సైన్స్, టెక్నాలజీని అర్థం చేసుకుని స్పందించగలరు. దీనికోసం శాస్త్రవేత్తలతో నిపుణులతో పిఎస్ఎం కార్యకర్తలు చర్చించాలి. సైన్స్, సాంకేతికతలు పనిచేసే విధానం, సామాజిక ప్రభావంపై వారితో ఉద్దేశపూర్వకంగా చర్చలు జరపాలి. వారిని ప్రజల వైపునకు తీసుకురావాలి. సాధారణ ప్రజల ప్రయోజనాల కోసం, పర్యావరణ సుస్థిరత కోసం సైన్స్, సాంకేతిక తల విధానాలు, పాత్రలు, కార్యకలాపాలను మార్చడానికి కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రజా సైన్స్ ఉద్యమం ఈ కర్తవ్యాన్ని స్వీకరించి, నిర్వహించకపోతే సైన్స్, సాంకేతికతలు పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లి ప్రజలను దోపిడి చేయడానికి, పర్యావరణాన్ని దెబ్బతీయడానికి సాధనంగా, శక్తిగామారవచ్చు. సైన్స్ అనేది మానవజాతి ఉమ్మడి వారసత్వం. దీనిని పరిరక్షించి, కొనసాగించేందుకు సమాజాన్ని ప్రజాస్వామీ్యకరించడానికి పోరాటాల్లో నిమగ్నమైన అన్ని శక్తులతో కలిసి పనిచేయాలి.

**ఏఐపిఎస్ఎన్ సంక్షిప్త చరిత్ర...దృక్పథం**

మనం ఇంతవరకు సమాజానికి, సైన్స్ అండ్ టెక్నాలజీకి ఉన్న సంబంధాన్ని చర్చించాము. అదే విధంగా ప్రజా సైన్స్ ఉద్యమం పరిష్కరించాల్సిన సమస్యను గురించి కూడా మాట్లాడుకున్నాం. ఇప్పుడు మరింత స్పష్టంగా అంకిత భావంగల కార్యకర్తలు ఏ దృక్పథంతో పనిచేయాలి అన్న విషయాన్ని పరిశీలిస్తాం. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపిఎస్ఎన్)వివిధ రకాల స్వతంత్ర సంస్థలతో, వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటైంది.


సైన్స్, సాంకేతికతలు భారతదేశంలో ఇప్పటికే పెద్ద వ్యాపారంగా మారాయి. రాజ్యం మద్దతుతో యజమానులైన కార్పొరేట్ ప్రయోజనాల కోసం అది పనిచేస్తోంది. ప్రభుత్వ రంగం ప్రజలకోసం చేసే కొద్దిపాటి పనులను కూడా మానుకుంది. ఒకప్పుడు విదేశీ సాయంపై ఆధారపడిన వ్యవసాయరంగంలో గతంలో పెట్టిన పెట్టుబడులను కూడా మానుకుంది. ఆరోగ్యరంగం వేగంగా ప్రైవేటీకరణ అవుతోంది. ఈ రంగంలో కూడా స్వావలంబన తగ్గుతోంది. ప్రజల కష్టార్జితంతో బహుళ జాతి కంపెనీలు, భారతీయ కార్పొరేట్లు పెద్ద ఎత్తున లాభాలు చేసుకుంటున్నాయి. గతంలో కొంత మేరకైన దేశ ప్రజల ప్రయోజనాల కోసం, స్వావలంబన కోసం పనిచేసిన దేశానికి చెందిన పెద్ద వ్యాపార సంస్థలు నయా ఉదారవాద విధానాల ప్రభావంతో ఆ కృషి నుండి తప్పుకున్నాయి. పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) రంగంలో ప్రభుత్వ వాటా గణనీయంగా తగ్గుతోంది. ఫలితంగా ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందుతున్నట్లు కనిపించినప్పటికీ శాస్త్ర, సాంకేతిక రంగాల నుండి వచ్చే వాటాల్లో ఎక్కువ భాగం బహుళజాతి సంస్థలు తీసుకుంటున్నాయి. భారతీయ బడా వ్యాపారులు, జూనియర్ భాగస్వాములుగా చిన్న వాటాను తీసుకుంటున్నారు. స్వదేశీ శాస్త్ర,సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాజ్యం కానీ, పెద్ద వ్యాపార సంస్థలుగాని ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయన్నది కీలక ప్రశ్న!

సైన్స్ అండ్ టెక్నాలజీ విధానం (లేదా సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన పబ్లిక్ పాలసీ) రూపొందించినప్పటి నుండి దీనితో పాటు మరికొన్ని సమస్యలపై ఏఐపిఎస్ఎన్‌తో పనిచేసే అంకిత భావం గల కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. విధానాన్ని అధ్యయనం చేయడం, విమర్శలు సిద్ధం చేయడం, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడం, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న విధానాలపై వారిని సమీకరించడం ఏఐపిఎస్ఎన్ ప్రధాన కర్తవ్యాలు. దీంతో పాటు ఈ సమస్యలపై చర్చించడం, ప్రచారం చేయడం వంటివి చేయాలి. ఈ దృక్పథం ముందుకు పోయేలా, వ్యాప్తి చెందేలా అన్ని రాజ్యాంగ వ్యవస్థల స్థాయిల్లోనూ కృషి చేయడం , ఏఐపిఎస్ఎన్ స్థాయిలోనూ కృషి చేయడం అంకిత భావం గల కార్యకర్తల కర్తవ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీ విధాన పరమైన సమస్యలపై వివిధ తరగతుల ప్రజానీకాన్ని, ముఖ్యంగా ఆ సమస్యల కారణంగా ప్రభావితమయ్యే ప్రజలను చైతన్యం చేయడం, సమస్యలను వారికి అర్థమయ్యే భాషలో వివరించడం కూడా పై కృషికి దగ్గర సంబంధం ఉండేదే! విధాన రూపకల్పన ప్రభుత్వ అధికారుల, నిపుణుల బాధ్యతగా భావిస్తున్నందున, దానిని ప్రజల ముందుకు తీసుకుపోవడానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దీనికి సంబంధించిన సమాచారం ఇప్పటికే విస్తృతంగా అందుబాటులో ఉంది. అనేక మంది శాస్త్రవేత్తలు, పాఠశాల, కళాశాలల సైన్స్ ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, వైద్యులు, ఉద్యోగ విరమణ చేసిన శాస్త్రవేత్తలు ఈ రంగాల్లో అవగాహన ఉన్నవారిగా ప్రజలలో పనిచేస్తున్నారు. వారితో చర్చిస్తున్నారు.

ఈ కృషికి ఎందుకంత ప్రాధాన్యత? అది కూడా ఇప్పుడే ఎందుకు చేయాలి? అన్న ప్రశ్నలు సహజం. విధానాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందచేయడం వల్ల వారికి దాని గురించి తెలుస్తుంది. అదే విధంగా వారు దానిని తమ అవసరాల మేరకు కొంతైనా ప్రభావితం చేయగలుగుతారు. విధాన రూపకల్పన ప్రక్రియ ప్రజాస్వామీకరణ జరుగుతుంది. ఈ తరహా అనుభవాలు ఏఐపిఎస్ఎన్‌కు, దాని సభ్య సంస్థలకు ఎన్నో ఉన్నాయి. పర్యావరణ అంశాలపై కెఎస్ఎస్‌పి చేసిన ప్రచారం (ప్రత్యేకంగా సైలెంట్ వ్యాలీపై) ఢిల్లీ సైన్స్ ఫోరమ్, మధ్యప్రదేశ్ విజ్ఞాన సభ,

ఏకలవ్య ఇంకా అనేక సభ్య సంస్థలు భోపాల్ గ్యాస్ విషాదంపై చేసిన ప్రచారం పరిశ్రమలకు సంబంధించి కొత్త నిబంధనలు రూపొందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చాయి. ఈ సందర్భాల్లో తాము పనిచేస్తున్న సంస్థలతో పాటు, ఎఐపిఎస్ఎన్‌ను ముందుకు నడిపించడం అందరి బాధ్యత. ఈ తరహా కార్యక్రమాలే ప్రజాసైన్స్ ఉద్యమాన్ని నిర్వచిస్తాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ విధాన రూపకల్పన, అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతాయి. తద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ

**❝ నిజానికి సైన్స్ పాపులరైజేషన్ అనేది భారత దేశంలోనూ, విదేశాల్లోనూ ఎప్పటి నుండో ఉన్న ఆలోచన. దీనివల్ల ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. యుకెలోని ఒక నివేదిక ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు సమాజంలోని వివిధ తరగతుల ప్రజానీకంలో ప్రచారం చేయడం వల్ల సైన్స్. సాంకేతికతల ప్రయోజనాలు పెంపొందడంతో పాటు, పరిశోధనలకు మరింతగా నిధులు ఖర్చుచేసేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తాయి. ❞**



**జపాన్‌పై అమెరికా వేసిన అణుబాంబులు : (ఎడమ) 1945 ఆగస్టు 6 హిరోషిమా, (కుడి) ఆగస్టు 9 నాగసాకి**

రంగంలో నూతన సామాజిక పొందికకు బాటలు వేయగలం.

**ప్రజల్లోకి సైన్స్ (సైన్స్ పాపులరైజేషన్)**

పై పని సజావుగా జరగాలంటే, సైన్స్, సాంకేతిక అంశాలను ప్రజలకు వివరించాలి. నిజానికి సైన్స్ పాపులరైజేషన్ అనేది భారత దేశంలోనూ, విదేశాల్లోనూ ఎప్పటి నుండో ఉన్న ఆలోచన. దీనివల్ల ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. యుకెలోని ఒక నివేదిక ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు సమాజంలోని వివిధ తరగతుల ప్రజానీకంలో ప్రచారం చేయడం వల్ల సైన్స్. సాంకేతికతల ప్రయోజనాలు పెంపొందడంతో పాటు, పరిశోధనలకు మరింతగా నిధులు ఖర్చుచేసేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తాయి. అనేక పాశ్చాత్య దేశాల్లో కూడా ఈ తరహా భావన ప్రచారంలో ఉంది. భారతదేశంలో బెంగాల్ పునరజ్జీవన ఉద్యమంసందర్భంగా సైన్స్ ప్రచారాన్ని ఆధునీకరణకు సాధనంగా భావించారు. పశ్చిమబెంగాల్‌లో సైన్స్ క్లబ్‌ల ఉద్యమం బాగా ప్రసిద్ధి చెందింది. ఎఐపిఎస్ఎన్ ప్రారంభదశలో చేరిన అనేక సంస్థలు లక్ష్యాల సాధన కోసం ఆ పాత నమూనాలోనే పనిచేస్తున్నాయి. అయితే, దానితో కొంత సారూప్యత ఉన్నప్పటికీ విభిన్న లక్ష్యాల సాధన కోసం విభిన్నమైన సైన్స్ ప్రచారం కోసం పిఎస్ఎం పిలుపునిస్తోంది.

ప్రసిద్ధి చెందిన భారత జన విజ్ఞాన జాత ఎఐపిఎస్ఎన్‌కు పునాది వేసింది. అప్పటి ప్రభుత్వం దీనికి మద్దతు ఇచ్చింది.

ఈ జాతా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఐదు సాంస్కృతిక ప్రచార జాతాలను తీసుకువెళ్లి భయంకరమైన గ్యాస్ విపత్తు జరిగిన భోపాల్‌లో సమావేశమైంది. ఈ భారీ కార్యక్రమం సైన్స్‌ను ప్రజల వద్దకు తీసుకువెళ్లింది. దాని పేరుతో ప్రజలను మభ్య పెడుతున్న పద్ధతులను వివరించింది. సైన్స్ ఫలాలు పేదలకు చేరేందుకు ఒత్తిడి చేసింది. దీనికోసం కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. కొన్ని ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలకు కూడా విమర్శనాత్మకంగా పరిశీలించింది. దేశ వ్యాప్తంగా సైన్స్ ఉద్యమ వాలంటీర్లను గుర్తించడం, సంస్థలను ఏర్పాటు చేయడానికి ఈ జాతా ఉపయోగపడింది.

> **" ప్రజల్లో సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ ఆలోచన)ను పెంపొందించడం కూడా ప్రజా సైన్స్ ఉద్యమ పనుల్లో ముఖ్యమైనది. శాస్త్ర సాంకేతిక ప్రచారం అంటే సైన్స్ జ్ఞానాన్ని పెంచడం మాత్రమే కాదు. మూఢనమ్మ కాలను, తప్పుడు భావనలను తొలగించడం.. అదే సమ యంలో విమర్శనాత్మక, శాస్త్రీయ ఆలోచన లను చొప్పించడం కూడా! "**

ప్రజా సైన్స్ ఉద్యమంలోని అనేక సంస్థలు స్థానిక భాషల్లో పత్రికలు, పుస్తకాలు ప్రచురించడం ప్రారంభించాయి. ప్రజలు ఈ సంస్థల గురించి తెలుసుకోవడానికి. వాటి ప్రాభవాన్ని విస్తృత పరుచుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సంస్థల ఆర్థిక పోషణకు కూడా ఈ ప్రచురణలు ఉపయోగ పడ్డాయి. వీధినాటకాలు, పాటలు, స్కిట్‌ల తది తరాలతో వివిధ ప్రాంతాల్లో కళాజాతాలు నిర్వహించారు. విజ్ఞానశాస్త్రం- సమాజంతో దాని సంబంధం, సమస్యలు, తదితన అంశాలతో ఇవి సాగాయి. అనేక చోట్ల, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపన్యాసాల కంటే సాంస్కృతిక కార్యక్రమాలే ప్రభావవంత మైన రూపంగా నిలిచాయి. జనాదరణ పొందిన ఆ కార్యక్రమాల కేంద్రంగా ఉపన్యా సాలు, చర్చలు సాగాయి. సైన్స్ ఉద్యమ కార్య కర్తలు వీటిని క్రమం తప్పకుండా నిర్వ హించారు.

**శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్)**

ప్రజల్లో సైంటిఫిక్ టెంపర్ (శాస్త్రీయ ఆలోచన)ను పెంపొందించడం కూడా ప్రజా సైన్స్ ఉద్యమ పనుల్లో ముఖ్యమైనది. శాస్త్ర సాంకేతిక ప్రచారం అంటే సైన్స్ జ్ఞానాన్ని పెంచడం మాత్రమే కాదు. మూఢనమ్మకాలను, తప్పుడు భావనలను తొలగించడం.. అదే సమ యంలో విమర్శనాత్మక, శాస్త్రీయ ఆలోచన లను చొప్పించడం కూడా! అనేక ఎఐపిఎస్ఎన్ సంస్థలు ఈ తరహా కార్యక్రమాలను ఎన్నింటి నో నిర్వహించాయి. ప్రస్తుతం బిజెపి మూఢ నమ్మకాలతో కూడిన అనేక అశాస్త్రీయ అంశాలను ముందుకు తెస్తోంది. విజ్ఞాన శాస్త్రాన్ని ప్రపంచంలో అందరికంటే ముందు గా వైదిక సంస్కృతి హిందువులు కను గొన్నారని, పురాణ సంఘటనలకు చరిత్రగా చూపడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. సైన్స్, రుజువులను బేఖాతరు చేస్తూ విశ్వాసాల ప్రాతిపదికన వాదనలను ముందుకు తీసుకువ స్తోంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో శాస్త్రీయ ఆలో చనను పెంపొందించడమన్నది అత్యవసరంగా ముందుకు వచ్చింది. దీనికి ఎంతో రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. ఎఐపిఎస్ఎన్ ఈ అంశాన్ని గమనంలో ఉంచుకుని శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే కార్యక్రమాలను మరోసారి పరిశీలించాలి. విమర్శనాత్మక ఆలోచన ధోరణులను ప్రజల్లో పెంచాలి. రుజువులు, ఆధారాలను పరిశీలించే విచక్షణా జ్ఞానాన్ని వారికి అందించాలి. మూఢ నమ్మకా లకు వ్యతిరేకంగా ప్రచారాలను కొనసాగిస్తూనే దీనిని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలి. మనం చేసే ప్రతి సైన్స్ కార్యక్రమం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచన ధోరణులను పెంచే విధంగా రూపొందించుకోవాలి.

ఇది సైన్స్ అండ్ టెక్నాలజీ విధానాల గురించి, వాటి ఫలితంగా తమకు కలిగే ప్రయో జనాలు లేదా నష్టాల గురించి ఆలోచించడా నికి ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఎఐపిఎస్ఎన్ లోని అంకిత భావం గల కార్యకర్తలకు ఈ విస్తృత లక్ష్యాలు ఎంతో ముఖ్యమైనవి. 'సామాజిక విప్లవం కోసం సైన్స్' అనేది కెఎస్ఎస్‌పి యొక్క నినాదం. సైన్, సాంకేతికల ప్రచారమే చివరిది కాదు. అది సామాజిక పరివర్తనకు ఉపయోగపడే సోపానం. సూడో సైన్స్, అశాస్త్రీయ అంశాల ప్రచారంలోఉన్న బిజెపి, సంఘ్ పరివార్‌లను ఎదుర్కోవడంతో పాటు, ఇతర లక్ష్యాలను సాధించడానికి ఇది ఉపయోగపడుతుంది.

**సరికొత్త మార్పులపై అధ్యయనం**

పైన చెప్పుకున్నవన్నీ సజావుగా జరగా లంటే ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్తలు మరిం తగా ఈ రంగంపై దృష్టి పెట్టాలి. సైన్స్, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, వస్తున్న సమస్యలు, చర్చలు వంటివన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. నిపుణులు మాత్రమే సైన్స్ ఉద్యమ కార్యకర్తలు కాగలరని, లేదా ప్రత్యేక అధ్యయనం చేస్తేనే ప్రతిభావంత మైన కార్యకర్తగా ఉండగలరన్న భావనలు న్నాయి. అయితే, వాటికి భిన్నంగా ప్రజలతో చర్చించాలనుకున్న సైన్స్,సాంకేతిక తలకు సంబంధించిన అంశాలపై పిఎస్ఎం కార్యకర్తలు తమను తాము సన్నద్ధం చేసుకో వాలి. వాటికి సంబంధించిన సమాచారాన్ని అధ్యయనం చేయాలి. ఇది మొదట చెప్పుకు న్నంత కష్టం కాదు. అధ్యయనానికి సంబంధిం చిన సమాచారం పుష్కలంగా అందుబాటులో ఉంది. సహాయం చేయడానికి సీనియర్ కార్యకర్తలు కూడా ఉన్నారు. ఎఐపిఎస్ఎన్, దాని సభ్య సంస్థల్లో పనిచేస్తున్న అంకిత భావం గల కార్యకర్తలు వివిధ భాషలలో, వివిధ అంశాలనూ అధ్యయన మెటీరియల్‌ను సిద్ధం చేయాలి. అవసరమైన సామర్థ్యం మేరకు ఇతర కార్యకర్తలను తీర్చిదిద్దడానికి కృషి చేయాలి. ప్రస్తుతం ఇది ఎఐపిఎస్ఎన్‌లో బలహీనతగా ఉంది. అనేక ఎన్‌జిఓలతో పాటు ఇతరులు కూడా ఈ రంగంలో పనిచేస్తున్నారు. అనేక సమయాల్లో వారు అశాస్త్రీయ వైఖరిని తీసుకుంటున్నారు. ఇది రానున్న రోజుల్లో తీవ్ర సమస్యగా మారే ప్రమాదముంది.

**సంస్థలతో సంబంధాలు**

వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం కూడా సమాచార సేకరణకు అధ్యయనానికి ఉపయోగపడుతుంది. ఇది కూడా ఎఐపిఎస్ఎన్ సభ్య సంస్థల్లో బలహీన తగా ఉంది. అయితే, ఈ సంబంధాలు చాలా ముఖ్యమైనవి. ప్రజా సైన్స్ ఉద్యమ సామర్థ్యా న్ని ఇవి పెంచుతాయి. అధ్యాపకులు, పరిశోధకులకు సామాజికంగా ప్రయోజనకర మైన అంశాలపై దృష్టి సారించడానికి ఉపయోగపడతాయి. సంస్థాగత నిర్మాణాల్లో పని సంస్కృతిని పెంచడంతో పాటు, ప్రజాస్వామీకరించడానికి దోహదపడతాయి. వాస్తవానికి బెర్నాల్‌తో పాటు 20వ శతాబ్ధా నికి చెందిన పలువురు మార్క్సిస్ట్ మేధావులు విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల్లోని శాస్త్రవేత్తల మధ్య చేసే కృషినే ప్రజా సైన్స్ ఉద్యమ పనిలో ప్రధానభాగంగా చూశారు. భారతదేశంలో కూడా ప్రజాసైన్స్ ఉద్యమ ప్రారంభ దశలో ఢిల్లీ సైన్స్ ఫోరమ్ ద్వారా సిఎస్ఐఆర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చురుకైన పనిని నిర్వహించారు. దురదృష్టవ శాత్తు ప్రస్తుతం ఆ కృషి దెబ్బతిని, సైన్స్ ఉద్యమ కార్యక్రమాల్లో గత పాత్రను పోషించడం లేదు.

*(మిగతా వచ్చే సంచికలో)*

# డా॥ కోట్నీస్

(2వ పేజీ తరువాయి)

జవహర్ లాల్ నెహ్రూ వైద్యుల ఎంపిక కోసం 1938లో ఇండియన్ మెడికల్ మిషన్ అనే కమిటీని డాక్టర్ జీవరాజ్ మెహతా అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఆ కమిటీకి దరఖాస్తు చేసుకున్న వైద్యుల్లో డాక్టర్ కోట్నీస్ ఒకరు. సాహసాల పట్ల ఆసక్తితో ఆయన దరఖాస్తు చేశాడు. చైనా యుద్ధ రంగానికి వెళ్లటానికి ఎంపిక చేయబడిన డాక్టర్ల బృందంలో అయిదుగురు ఉన్నారు. ఆ ఐదుగురిలో అందరికన్నా అతి చిన్న వాడు కోట్నీస్. 1938 సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి ఆ ఐదుగురు డాక్టర్ల బృందం బొంబయిలో బయలుదేరి ఓడలో చైనా వెళ్లారు. తమతో పాటు వాళ్లు ఒక అంబులెన్స్ ట్రక్కు, అంబులెన్స్ కారు, మందులు, శస్త్ర చికిత్స పరికరాలు తీసుకెళ్లారు. 1938 సెప్టెంబర్ 17న చైనా లోని "కాంటన్" నగరం చేరుకున్నారు. అది దక్షిణ చైనాలో ముఖ్యమైన నౌకా కేంద్రం. ఆ నగరంలో చైనా నిర్మాత సన్ యట్ సేన్ సతీమణి "మేడం సన్ యట్ సేన్" ఈ భారత వైద్య బృందానికి స్వాగతం పలికారు. అప్పటికి జపాన్ చైనా మీద దురాక్రమణ ప్రారంభించి ఏడేళ్లు గడిచాయి. అది యుద్ధ వాతావరణం కాబట్టి దేశంలో సాధారణ పరిస్థితులు లేవు. ఎప్పుడు ఏ మూల నుంచి జపాన్ బాంబులు పడతాయో తెలియదు. రాత్రులు అంతా చిమ్మ చీకటి. యుద్ధ సైరన్లు మోగితే ప్రజలందరూ దగ్గరలోని సొరంగాలలోకి వెళ్లిపోవాలి. అలాంటి పరిస్థితుల్లో కోట్నీస్ బృందం కాంటన్ నుండి ''చాంగ్ షా'' నగరం మీదుగా ప్రయాణించి సెప్టెంబరు 29కి "ఉహాన్" లోని ''హాంకో ''నగరానికి చేరుకున్నారు. ఆ ప్రయాణం పొడవునా వారికి భయంకరమైన అనుభవాలు ఎదురయ్యాయి, మైదానాలు గుండా, కొండ చరియల మీదుగా, పర్వత సానువుల గుండా అత్యంత ప్రమాదకరమైన వంపుల కుండా ప్రయాణం చేశారు. దారి పొడవునా గ్రామాల్లో, పట్టణాల్లో భయంకర మైన విధ్వంసాలను కళ్ళారా చూశారు. జపాన్ విమాన దాడుల ఫలితంగా పొగలు సెగలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూలిన వంతెనలు, ధ్వంసమైన పంటలు, తెగిపోయిన రైలు పట్టాలు డాక్టర్ కోట్నీస్ బృందానికి తాము ఎక్కడికి ప్రయాణిస్తున్నామో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. కుక్కలు మానవ కళేబరాలను తింటున్న దృశ్యాలు, దుమ్ము కొట్టుకొని ఆకలితో నకనకలాడుతూ, రక్తం లేక పాలిపోయిన ముఖాలు. కొంతమంది సైనికులు అయితే తమ యూనిఫారం చించుకొని గాయాలకు కట్లు కట్టుకుంటున్నారు. హంకో నగరంలో కోట్నీస్ బృందం చేరుకున్న ఆసుపత్రి పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది. 200 పడకల సామర్థ్యం గల ఆసుపత్రిలో 1700 మంది క్షతగాత్రులు సైనికులు కటిక నేల మీద పడుకొని ఉన్నారు. వరండాలన్నీ కిక్కిరిసిపోయి ఉన్నాయి. ఇంకొక ఆసుపత్రిలో అయితే 2500 మంది



**చైనాలోని హెబీ రాష్ట్రం షిజియాజువాంగ్ పట్టణంలో డాక్టర్ కోట్నీస్ సమాధి**

క్షతగాత్రులు సరైన చికిత్స దొరక్క హాహాకారాలు చేస్తున్నారు.

ఆ వాతావరణంలో డాక్టర్ కోట్నీస్ బృందం 1938 అక్టోబర్ 1న పనిలోకి దిగింది. ఆ రోజు నుండి 1942 డిసెంబర్ 9న కన్నుమూసే దాకా డాక్టర్ కోట్నీస్ ఒక్క క్షణం కూడా విశ్రాంతి ఎరుగడు. ఏ దేశం కోసం సేవ చేస్తున్నాను ఏ దేశ సైనికులకు వైద్యం చేస్తున్నాను అని ఆలోచించకుండా సేవే ధ్యేయం, సేవే గమ్యం, సేవే లక్ష్యం అనుకుంటూ డాక్టర్ కోట్నీస్ ఒక విధంగా తన జీవితాన్ని కొవ్వొత్తి చేసుకున్నాడు. హాంకో నగరంలో తన సేవలు ప్రారంభించిన మొదటి రోజునే శస్త్ర చికిత్సలు చేయవలసి వచ్చింది. కాళ్లు చేతులు పోగొట్టుకున్న వారు, ముఖాలు చితికిపోయి వికృత ఆకారంలో ఉన్నవాళ్లు, పొట్టలో, ఊపిరితిత్తుల్లో తూటాలు దిగి ఉన్నవాళ్లు ఏది ఏమైనా గానీ మాతృదేశ రక్షణలో తమ జీవితాలను అర్పిస్తున్నాము అన్న భావంతో ఉన్నవాళ్లే. అలాంటి వారందరికీ డాక్టర్ కోట్నిస్ బృందం వైద్యం చేసింది. స్థానిక పత్రికలన్నీ భారతీయ వైద్య బృందం గురించి ప్రముఖంగా వార్తలు రాశాయి. వారాలు తరబడి ప్రయాణించి దుస్తులు మీద దుమ్ము కూడా దులుపుకోకుండా సైనిక ఆసుపత్రుల్లో సేవలు ప్రారంభించిన భారతీయ వైద్యులు అని రాస్తూ తమ కృతజ్ఞతలు చాటుకున్నాయి.

ప్రత్యక్ష యుద్ధరంగం నుండి "హాంకో"నగరానికి సగటున ఎనిమిది వందల మంది సైనికులు వచ్చేవాళ్లు. చెడిపోయిన యంత్రాలను గబగబా బాగు చేసినట్లే, వచ్చిన సైనికులకు చికిత్స చేసి మళ్లీ వాళ్లను యుద్ధరంగం లోకి వెళ్లే లాగా చేసేవారు. ఈ విషయాలన్నీ వివరంగా సోలాపూర్‌లో ఉన్న అమ్మానాన్నలకు ఉత్తరాల ద్వారా తెలియ చేస్తూండేవాడు డాక్టర్ కోట్నీస్. హాంకో నగరంలో ఉన్నప్పుడే డాక్టర్ కోట్నీస్‌కి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు "చౌ ఎన్ లై "ను కలుసు కునే అవకాశం కలిగింది. మూడు వారాలు ఆ నగరంలో ఉండి ఆ తర్వాత జపాన్ దాడి నుండి తప్పించుకోడానికి డాక్టర్ కోట్నీస్ బృందం" ఇచ్చాంగ్" అనే నగరానికి బయలుదేరారు. నదీ మార్గంలో స్టీమర్ లో వెళ్లాలి. అప్పటికే చాలా స్టీమర్లను జపాన్ సైనికులు నదిలో ముంచేస్తున్నారు. అంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో నాలుగు రోజులు ప్రయాణం చేసి ''ఇచ్ఛాంగ్'' నగరం చేరుకున్నారు. వీళ్ళ వెనకాల వస్తున్న మరో స్టీమర్ జపాన్ బాంబులకు గురై నదిలో మునిగిపోయింది. ఆ నగరంలోని సైనిక ఆసుపత్రిలోనూ, రెడ్ క్రాస్ ఆసుపత్రిలోనూ 28 రోజులు తమ సేవలు అందించారు. నెల రోజుల తర్వాత అక్కడి నుంచి మళ్లీ 400 మైళ్ళు, ఆరు రోజులు ప్రయాణించి ''చోంగ్‌కింగ్'' అనే నగరం చేరుకున్నారు. అంటే ఎక్కడెక్కడ కీలకమైన శస్త్ర చికిత్సలు అవసరమో అక్కడికి డాక్టర్ల బృందాన్ని తీసుకువెళ్లారు చైనా అధికారులు. ఆ నగరంలో రెండు నెలలు ఉన్నారు. 1939 కొత్త సంవత్సర వేడుకలు కూడా అక్కడి సైనిక ఆసుపత్రిలోనే జరుపుకున్నారు.

భారతీయ డాక్టర్లందరికీ స్థానిక గుర్తింపు కోసం చైనా భాషలో వాళ్ళకంటూ కొన్ని పేర్లు కేటాయించారు. డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్ యొక్క చైనా పేరు''ఖాచి హువా''. అంటే చైనాలో మంచి గుణాలు ఉన్నవాడు అని అర్థం. ఇప్పటికి కూడా చైనీస్ రికార్డుల్లో డాక్టర్ కోట్నీస్ పేరు "ఖాచి హువా" అనే ఉంటుంది. "చోంగ్ కింగ్''నగరంలో వారికి భయంకరమైన అనుభవం ఎదురైంది. 1939 జనవరి 15

రాత్రి అందరూ చలికి వణుకుతూ ఇళ్ళల్లో నిద్రపోతున్న సమయంలో జపాన్ సైన్యం బాంబులు వర్షం కురిపించింది. పెద్ద పెద్ద భవనాలు తునా తునకలైపోయాయి. డాక్టర్ కోట్నీస్ బృందం ఆ అర్ధరాత్రి చీకట్లో కర్తవ్యం నిర్వహణలో దిగారు. కూలిపోయిన భవనంలో నుంచి మనుషుల్ని వెలికి తీయడంలో పాల్గొన్నారు. ఆ ఒక్క భవనంలోనే శిధిలాల్లో సుమారుగా 200 మంది శవాలుగ మారిపోయారు. వాళ్లను వెలికి తీసే క్రమంలో డాక్టర్ కోట్నీస్ కు ఎదురైన అత్యంత దుర్భర దృశ్యం ఒక మహిళ ఒళ్లో పాలు తాగుతున్న పసిబిడ్డతో పాటు శవాలై ఉండటం. ఈ దృశ్యం డాక్టర్ కోట్నీసును చాలా బాధకు గురి చేసింది. క్షతగాత్రులైన వాళ్లను స్ట్రేచర్ల పైన ఉంచి ఆసుపత్రికి తరలించే ప్రతి దశలోనూ డాక్టర్ కోట్నీస్ పనిచేశారు.

సరిగ్గా ఈ సమయంలో డాక్టర్ కోట్నీస్ ఇంటి నుంచి పిడుగులాంటి సమాచారం వచ్చింది. 1938 డిసెంబర్ 28న డాక్టర్ కోట్నీస్ తండ్రి, విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విషయం కోట్నీస్‌కు రెండు నెలలు ఆలస్యంగా తెలిసింది. ఆయన తండ్రి గారి మంచితనంతో ఒక మిత్రుడు చేసిన అప్పుకు మధ్యవర్తిగా ఉండటం, అతను అప్పు తీర్చలేక పోవటం, అప్పిచ్చిన వాళ్ళు కోట్నీస్ తండ్రి మీదకు రావటం ఆ క్రమంలో ఇల్లు కూడా కోల్పోయే పరిస్థితి రావటం ఈ ఒత్తిడి అన్ని తట్టుకోలేక విషం తాగి మరణించాడు ఆయన. భారతదేశానికి వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తాం వెళ్లిపో అని కోట్నీస్‌కు చైనా మిత్రులు చెప్పారు. దానికి కోట్నీస్ ఒప్పుకోలేదు. నాన్న చనిపోయి రెండు నెలలు అయింది. ఇప్పుడు నేను వెళ్లి మాత్రం చేసేదేముంది అక్కడ. కనీసం ఒక సంవత్సరం అయినా ఇక్కడ పని చేస్తాము అని కాంట్రాక్ట్ రాశాం కదా మధ్యలో మానేసి మీకు ఇబ్బంది కలిగించను. అంతేకాదు రోజు వస్తున్న క్షతగాత్రులైన సైనికులను వదలి వెళ్లాలని అనిపించట్లేదు అన్నాడు. నా కుటుంబం నిజంగానే గొప్ప దురదృష్టాన్ని ఎదుర్కొంది. కానీ ఇక్కడ బాధపడుతున్న వేలాదిమంది అమాయక ప్రజలకు నా అవసరం ఇంకా ఎక్కువ అన్నాడు కోట్నీస్. డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్ వ్యక్తిత్వానికి, కర్తవ్య దీక్షకు ఇంతకు మించిన మరో ఉదాహరణ అవసరం లేదు. వీటన్నింటినీ తెలియజేస్తూ ఇంటికి ఉత్తరం రాశాడు రాలేకపోతున్నాను అని.

"చోంగ్ కింగ్"లో రెండు నెలలు పని చేశాక భారతీయ వైద్య బృందం "ఏనాన్" నగరం చేరుకుంది. బాంబుల వర్షాన్ని తప్పించుకుంటూ భారతీయ వైద్య బృందం అక్కడ 9 నెలలు పని చేశారు. 1939 ఫిబ్రవరి 12 నుంచి నవంబర్ 4 దాకా అక్కడే పని చేశారు. అక్కడ ఉన్న కొండ గుహల్లోనే తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. ఆ బృందం ఉప నాయకుడు డాక్టర్ చోల్కర్ "ఏనాన్" లోని చలిని భరించలేక 1939 మేలో భారతదేశానికి వెళ్ళిపోయాడు. మరొక సభ్యుడు డాక్టర్ దివేన్ ముఖర్జీ మూత్రకోశ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం అని హాంకాంగ్ వెళ్లి అక్కడి నుండి ఇండియాకు వచ్చేశారు. మిగిలిన ముగ్గురిలో యువకులైన డాక్టర్ కోట్నీస్, డాక్టర్ బసులు



చైనా ప్రజావిమోచన సైన్యం దుస్తుల్లో డా॥ కోట్నీస్

చైనా భాషను బాగా నేర్చుకున్నారు. రాయటం చదవటం కూడా. ఈ సమయంలోనే ఈ బృందం నాయకుడు "అటల్" అనారోగ్యం రీత్యా భారత్ కు వచ్చేందుకు నిర్ణయం తీసుకుని, చైనా సైనిక అధికారుల దగ్గర అనుమతి తీసుకుని మిగిలిన ఇద్దరు యువ డాక్టర్లను వదల్లేక వదల్లేక వెనక్కి వెళ్ళిపోయాడు. చైనాలో యుద్ధ రంగంలో ఎదుర్కొంటున్న అనేక సవాళు వాళ్లను భయపెట్టలేదు సరి కదా మరి కొంతకాలం ఉండిపోవాలని నిర్ణయానికి వచ్చారు ఆ ఇద్దరు యువ డాక్టర్లు. పైగా వీళ్లను వదులుకోవటానికి చైనా సైనిక అధికారులకు కూడా ఇష్టం లేదు. వాళ్లు చేస్తున్న చికిత్సలు నిజంగా అదొక మంత్రజాలం అనిపించింది చైనా అధికారులకు.

ఇంతలో 1939 ముగిసి 1940 వచ్చింది ఇంతకాలం వీళ్లిద్దరూ యుద్ధరంగా నికి మైళ్ళ దూరంలో ఉన్న ఆసుపత్రులలో పనిచేశారు. అయితే ఈసారి 1940 నుండి 8వ రూట్ "ఆర్మీ జనరల్ ఛూటే "వీళ్ళిద్దరిని యుద్ధ రంగంలో ప్రత్యక్షంగా పనిచేయటానికి వస్తారా, సైనికులతో పాటు మీరు కూడా ప్రయాణించాల్సి వస్తుంది అక్కడ డాక్టర్ల అవసరం ఎక్కువగా ఉంటుంది అని అడిగాడు. డాక్టర్ కోట్నీస్, డాక్టర్ బసులు దానికి అంగీకరించారు.

నేరుగా యుద్ధరంగంలో ఇద్దరూ పని చేశారు. చైనా గెరిల్లా యోధులతో కలిసి వీళ్లు కూడా సైనికుల్లాగా ముందు వరసలో ఉండేవాళ్ళు. దెబ్బలు తగిలిన సైనికులకు నిమిషాల వ్యవధిలో చికిత్స చేసేవారు. అలా కొద్ది నెలలు గడిచాక డాక్టర్ కోట్నీస్ సేవలు ఇంకొక చోట అవసరమని భావించాడు జనరల్ ఛూటే.

ఇక్కడ ఒక విషయం మనం తెలుసుకోవాలి. డాక్టర్ నార్మన్ బెతూన్ అని కెనడాకు చెందిన ఒక డాక్టరు, మన భారతీయ డాక్టర్లు లాగా చైనా యుద్ధ రంగానికి వచ్చి చైనా సైనికులకు అద్భుతమైన సేవలు అందించడంతోపాటుగా ఒక వినూత్న మైన వైద్యాలయాల కాన్సెప్ట్‌ను అమలుపరిచాడు. మొబైల్ బ్లడ్ బ్యాంక్, మొబైల్ హాస్పిటల్స్, ఆ ఆసుపత్రుల్లో వైద్యంతో పాటుగా ఇతరులకు వైద్యంలో శిక్షణ ఇవ్వడం లాంటి పద్ధతు లన్నింటినీ విజయవంతంగా నిర్వహించాడు డాక్టర్ బెతూన్. అయితే దురదృష్టవశాత్తు 1940 మొదట్లో సైనికులకు సేవ చేసేటప్పుడు తనకు సెప్టిక్ అయ్యి హఠాత్తుగా మరణించాడు. ఆయన ప్రారంభించిన మోడల్ ఆసుపత్రికి డైరెక్టర్‌గా ఉండమని డాక్టర్ కోట్నీస్‌ను అడిగాడు "జనరల్ ఛూటే". ఆ మొబైల్ ఆసుపత్రి విభాగాలు "టాంగ్" నది ఒడ్డున "కోకుంగ్" అనే ఊరిలో ఉంది. అక్కడ ఉన్న చిన్న చిన్న గుడిసెలే ఆసుపత్రిలోని వివిధ వార్డులు. డాక్టర్ కోట్నీస్ చైనా జీవితంలో చివరి మజిలీ ఈ గ్రామమే. ఆ మోడల్ ఆసుపత్రికి డైరెక్టర్‌గా ఆ ఊళ్లోనే ఉండిపోయాడాయన. తనతో ఉన్న డాక్టర్ బసు మాత్రం వేరే ఆసుపత్రిలో పనిచేయటానికి "ఏనాన్" నగరానికి వెళ్లిపోయాడు.

సంక్షుభిత చైనా సమాజానికి డాక్టర్ కోట్నిస్ నిర్విరామంగా సేవలు కొనసాగించాడు. 1940లో ఒకానొక సందర్భంలో 72 గంటల పాటు నిర్విరామంగా గాయపడ్డ సైనికులకు ఆపరేషన్ నిర్వహించాడు డాక్టర్ కోట్నీస్. వాళ్లకు సేవ చేయడంలో తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేసేవాడు కాదు. మోడల్ ఆసుపత్రిలో వైద్యంతోపాటు వైద్య శిక్షణ కూడా ఉంటుంది కదా అక్కడ నర్సులకు శిక్షణ ఇవ్వటానికి వచ్చిన

ఒక చైనా యువతి "కుచ్చింగ్ లాన్"కు డాక్టర్ కోట్నీస్ అంకిత భావం బాగా నచ్చింది. ఏ బంధమూ లేని చైనా సైనికుల కోసం తనకు తాను కొవ్వొత్తిగా కరిగించు కుంటున్నాడు అనుకుంది ఆ యువతి. ఆ భావనే ఆరాధనగా తర్వాత ప్రేమగా మారింది. వాళ్ళిద్దరూ కలిసి పనిచేసే క్రమంలో డాక్టర్ కోట్నీస్‌కు "కుచ్చింగ్ లాన్" అంటే అభిమానం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఆ యుద్ధ సమయంలో ఎవరు ఎప్పుడు పోతారో తెలియని ఆ సమయంలో ప్రేమ అత్యవసర ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. అలాంటి సమయంలో ఉద్భవించిన ప్రేమకు సంకుచిత కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంతాల, దేశాల, విభేదాలు అడ్డు రావు. 1941 నవంబర్ 25న వాళ్ళిద్దరూ ఆ యుద్ధ రంగంలోనే వివాహం చేసుకున్నారు. ఆసుపత్రుల్లోని వారికి, వాళ్లతో కలిసి పని చేసిన చైనా వారికి వీరిద్దరి వివాహం చాలా ఆనందం కలిగించింది. అప్పటికే డాక్టర్ కోట్నిస్ వాళ్ళందరికీ ఆరాధ్య దైవం అయిపోయాడు. ఇప్పుడు చైనాకు అల్లుడైపోయినాడని వాళ్ళందరూ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ విషయాలన్నీ వందల మైళ్ళ దూరంలో ఉన్న మిత్రుడు డాక్టర్ బసుకు ఉత్తరం ద్వారా తెలియపరిచాడు డాక్టర్ కోట్నీస్.

1942 ఆగస్టు 23వ తేదీన కోట్నిస్, కుచ్చింగ్ లాన్ దంపతులకు ఒక మగ బిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు "ఇన్ హువా" అని పేరు పెట్టారు. "ఇన్" అంటే ఇండియా, "హువా" అంటే చైనా. ఇప్పుడు ఆ మగ బిడ్డను తీసుకొని తను సోలాపూర్ కి వెళితే కుటుంబ సభ్యులు ఎంత ఆనందిస్తారో అన్న ఊహ కోట్నీస్ ను పులకింప చేసింది. అయితే కొడుకు పుట్టటానికి ఒకటి రెండు నెలలు ముందు నుండి ఒక రకమైన వణుకుడు జ్వరం డాక్టర్ కోట్నీసుని ఆవహించింది. ఆ తర్వాత ఆ వ్యాధి తీవ్రతరమైంది. పని ఒత్తిడి ఏమాత్రం విశ్రాంతి లేకపోవడం, రాత్రి పగలు గాయపడిన సైనికుల చెంతనే గడపటం వీటన్నిటితో ఆ వణుకుడు జ్వరం కాస్తా మూర్ఛ లోకి మారింది. చైనా అధికారులు డాక్టర్ కోట్నీస్‌కు పూర్తి విశ్రాంతి అవసరమని, కొన్నాళ్లు వైద్య సేవలకు దూరంగా ఉండమని చెప్పారు. 1942 డిసెంబర్ 8 రాత్రి మళ్ళీ మూర్ఛ వ్యాధి ఆయనను కమ్మేసింది. రాత్రంతా స్పృహ లేకుండా పడుకున్నాడు. భార్య పక్కనే ఉండి సపర్యలు చేసింది. మరునాడు అంటే 1942 డిసెంబర్ 9 పొద్దున్నే 6:15 నిమిషాలకు ఆఖరి శ్వాస పిలిచాడు డాక్టర్ కోట్నీస్.



ప్రఖ్యాత దర్శకుడు శాంతారామ్ నిర్మించిన డా॥ కోట్నీస్ కి అమర్ కహానీ చిత్రం పోస్టర్

కేవలం 32 సంవత్సరాల వయసులో వందేళ్లకు మించిన సేవలందించి అది కూడా వేరే దేశంలో, అది కూడా సామ్రాజ్యవాద ముష్కరులకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాయుద్ధరంగంలో ఉండి అడుగడుగునా ప్రమాదాలను ఎదుర్కొంటూ డాక్టర్ కోట్నీస్ విశ్వ మానవుడు అనే పదానికి అచ్చమైన నిర్వచనంగా చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఆయన ఒక అంతర్జాతీయ స్ఫూర్తి శిఖరం. చైనాలోని సైనిక అధికారులు డాక్టర్ కోట్నీస్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వార్తాపత్రికలన్నీ డాక్టర్ కోట్నీస్ మరణం గురించి ప్రముఖంగా వార్తలు ప్రచురించాయి ప్రత్యేక సంపాదకీయాలు రాశాయి.

''డాక్టర్ కోట్నిస్ వెలిగించిన అంతర్జాతీయ జ్యోతి ఎప్పటికీ ఆరనిది. సైన్యం ఒక సహాయక హస్తాన్ని కోల్పోయింది. దేశం ఒక స్నేహితుడిని కోల్పోయింది. అతని అంతర్జాతీయ స్ఫూర్తిని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకుందాం" అని చైనా కమ్యూనిస్టు యోధుడు చైర్మన్ మావో ఆయన గురించి రాశాడు.

అలానే మేడం సన్ యట్ సేన్ భారత్‌కు ఒక సందేశం పంపుతూ... "అతని జ్ఞాపకం మీ ప్రజలకు, మా ప్రజలకు మాత్రమే కాదు మొత్తం మానవాళి స్వేచ్ఛ, పురోగతి కోసం పోరాడిన యోధులకు కూడా చెందుతుంది. భవిష్యత్తు ఆయనను వర్తమానం కంటే ఎక్కువగా గౌరవిస్తుంది. ఎందుకంటే ఆయన భవిష్యత్తు కోసం పోరాడారు'' అన్నారు. ఆ తర్వాత చైనా జపాన్ల మధ్య యుద్ధం 1945 దాకా కొనసాగింది. 1949లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చైనా విప్లవం విజయం సాధించి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అవతరించింది. డాక్టర్ కోట్నీస్ భార్య కుమారుడు భారతదేశానికి వచ్చి వారి కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.

భారతదేశ పుత్రుడు, అంతర్జాతీయ దృక్పథంతో ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్న చైనా ప్రజల కోసం సేవలందించి చివరికి ఆ దేశంలోనే ఖననం చేయబడ్డాడు. చైనా మీద కోట్నీస్ ప్రభావం ఎంతగా పడిందంటే "కోట్నీస్ నుంచి నేర్చుకోండి" అని చైనా అంతటా ఒక ఉద్యమం సాగింది. డాక్టర్ బసు ఇచ్చిన ఇంటర్వ్యూ ఆధారంగా ప్రఖ్యాత దర్శకుడు శాంతారామ్ "కోట్నీస్ కీ అమర్ కహానీ" పేరుతో 1946లో బాలీవుడ్ సినిమా తీశాడు. అది బొంబాయిలో 27 వారాలపాటు ఆడింది.

మన రాష్ట్రంలో డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్ర రెడ్డి, డాక్టర్ జెట్టి శేషారెడ్డి లాంటి వారెందరికో మార్గదర్శిగా నిలిచి ప్రజావైద్య శాలల ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు డాక్టర్ కోట్నీస్. చైనా, భారత్ దేశాలు డాక్టర్ ద్వారకానాథ్ శాంతారామ్ కోట్నీస్ పేరు మీద తపాలా బిళ్ళలు విడుదల చేశాయి.

డాక్టర్ కోట్నీస్‌ది నిజంగానే ఒక గొప్ప అమర్ కహానీ!

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 11 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# అత్యంత కాలుష్య దేశాల్లో 5 స్థానంలో భారత్

ప్రపంచంలో అయిదు అత్యంత అధిక వాయు కాలుష్య దేశాల్లో భారత్ ఒకటని ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన అంతర్జాతీయ వాయు నాణ్యత రిపోర్టు 2024 తెలియజేసింది. ప్రపంచంలో వాయుకాలుష్యంలో మొదటి స్థానంలో ఆఫ్రికన్ దేశం చాద్ ఉంది. బంగ్లాదేశ్, పాకిస్తాన్, డొమినికన్ రిపబ్లిక్ కాంగోలు రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలవగా భారత దేశం అయిదవ స్థానాన్ని ఆక్రమిస్తోంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం గాలి కాలుష్యం 5 μg/m3 (క్యూబిక్ మీటర్ గాలిలో 5 మైక్రోగ్రాము (గ్రాములో పదిలక్షల వంతు)ల సూక్ష్మ కణాలు) వరకు అనుమతించవచ్చు. కానీ భారత దేశంలోని గాలి కాలుష్యం 50 μg/m3 ఉంది. అంటే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలతో పోలిస్తే భారత దేశంలో 10 రెట్లు ఎక్కువ కాలుష్యం ఉందన్న మాట. కాలుష్యంలో ప్రథమ స్థానంలో ఉన్న చాద్‌లో వాయు కాలుష్యం 90 μg/m3 కి పైగా ఉంది.

ఇంక నగరాలుగా చూసుకుంటే 2024లో ప్రపంచంలోని 100 అత్యంత కాలుష్య నగరాల్లో 74 మన దేశంలోనే ఉన్నాయి. ప్రపంచ వాయు నాణ్యత నివేదిక ప్రకారం మేఘాలయలోని బైమిహాట్ నగరం భూమ్మీద అత్యంత కలుషిత నగరంగా గణితికెక్కింది. ఇక్కడ వాయువులో 128.2 $\mu g/m^3$ సూక్ష్మ కణాలున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితికన్నా ఇది 25 రెట్లు ఎక్కువ. అత్యంత కాలుష్య నగరాల్లో మన దేశరాజధాని ఢిల్లీ కూడా ఉంది.

ప్రపంచంలోని 9 అత్యంత కాలుష్య నగరాల్లో 6 భారత దేశంలో ఉన్నాయి. వాయుకాలుష్య ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుంది. ప్రపంచ దేశాలు తక్షణం వాయుకాలుష్యాని తగ్గించాలని 2024 వాయు నాణ్యత నివేదిక హెచ్చరిస్తున్నదని గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ సంస్థలో సీనియర్ వాయు నాణ్యత నిపుణుడు ఐదాన్ ఫార్రో పేర్కొన్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యం యువత ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం కలిగిస్తుందని చెప్పారు.

బొగ్గు ఆధారిత పరిశ్రమలు, విద్యుదుత్పత్తిని తగ్గించి పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లడం దీనికి పరిష్కారాల్లో ఒకటి. ప్రపంచ దేశాలు ఆ దిశగా పెద్ద ఎత్తున తక్షణ చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ........................................

వీధి ........................................

గ్రామం ........................................

మండలం లేదా పట్టణం ........................................

జిల్లా ........................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.